www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం	12-4-2025	పేజీలు: 14	వెల (Price) : Rs. 6.50	సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 357	శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం, తిథి: పౌర్ణమి తె.5.52 తదుపరి పాడ్యమి, నక్షత్రం: హస్త సా.6.08 తదుపరి చిత్త, వర్జ్యం: తె. 3.09-4.57, దుర్ముహూర్తం: ఉ.6.05-7.43, అమృతఘడియలు: ఉ.11.23-1.11, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.27	విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మళ్లీ పర్మిట్ రూమ్‌లు!?

ఎక్సైజ్ శాఖ పునరాలోచన

'పర్మిట్' లేక రూ.175 కోట్ల నష్టం

షాపుల వద్దే ఎక్కువగా తాగుడు

బహిరంగ మద్యపానంతో ఇబ్బందులు

వైసీపీ హయాం నుంచే ఈ జాడ్యం

పర్మిట్ రూమ్‌లతో పరిష్కారమనే యోచన

ఒక నిర్ణయం తీసుకునే ముందు... పర్యవసానాలు ఆలోచించాలి! ఆదాయం మాత్రమే కాదు... దాని వల్ల తలెత్తే పరిణామాలూ పరిశీలించాలి. ఇలా ముందూ వెనుకా చూడకుండా తీసుకున్న ఒక నిర్ణయం సర్కారు ఆదాయాన్ని పోగొట్టడమే కాదు, బహిరంగ ప్రదేశాల్లో తాగుడుకూ కారణమైంది. ఆ నిర్ణయమే... పర్మిట్ రూమ్‌ల రద్దు! మద్యం షాపులకు అనుబంధంగా నిలబడి మాత్రమే తాగేందుకు వీలుగా ఏర్పాటుచేసే పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వొద్దని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

మిగతా 13వ పేజీలో...





ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు. కల్యాణోత్సవంలో మాంగల్య ధారణ ఘట్టం.

కమనీయం.. కోదండరాముని కల్యాణోత్సవం

14

బీసీలకు అండ

వారి రక్షణకు అతి త్వరలో ప్రత్యేక చట్టం: చంద్రబాబు

సబ్‌కమిటీ నివేదిక రాగానే చేస్తాం.. స్థానిక సంస్థల్లో మళ్లీ 34% కోటా

బీసీ సబ్‌ప్లాన్ కింద ఈ ఏడాది రూ.48 వేల కోట్ల ఖర్చు

బీసీ హాస్టళ్లకు రూ.4,500 కోట్లు.. 5,720 మందికి డీఎస్సీ శిక్షణ

ఇంటిపైనే విద్యుదుత్పత్తికి బీసీలకు కూడా సౌర ఫలకలు

వారు ఇళ్లు కట్టుకుంటే అదనంగా రూ.50 వేల సబ్సిడీ

బీసీ కార్పొరేషన్ కింద రూ.250 కోట్ల రుణాలు విడుదల

నా తల్లి బాధ చూసి 'దీపం' తెచ్చా.. రేపో, ఎల్లుండో 'తల్లికి వందనం'

తప్పులు చేస్తే ఖబడ్దార్.. 'సోషల్' సైకోలకు అదే చివరి రోజు: సీఎం

పూలే జయంతి సందర్భంగా ఆగిరిపల్లిలో ప్రజా వేదిక, పీ4 సభ

విజయవాడ/ఏలూరు/నూజివీడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి వెన్నెముకగా ఉన్న బలహీనవర్గాల రక్షణ, అభ్యున్నతికి ఇప్పటికీ ఎప్పటికీ కట్టుబడి ఉంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. వారికి పూర్తి అండగా ఉంటామని.. వారి రక్షణ కోసం త్వరలోనే చట్టం తీసుకొస్తున్నామని చెప్పారు. వారిని అన్ని వర్గాలతో సమానంగా.. అవసరమైతే అందరికంటే ముందుండే విధంగా

మిగతా 13వ పేజీలో...



ఆగిరిపల్లిలో ట్రాక్టర్ నడుపుతున్న సీఎం చంద్రబాబు



కోర్టు వద్ద పోలీసులపై చిందులు తొక్కుతున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

మాధవ్ వీరంగం

ఏం తమాషా చేస్తున్నారా?

ఎంపీగా చేశా.. పోలీస్ అధికారిని

మీడియా ఎదుట హాజరు వ్యవహారంలో రెచ్చిపోయిన మాజీ ఎంపీ

ఎస్పీ కార్యాలయం వద్ద చిందులు

గుంటూరు కోర్టు వద్ద ఏఎస్పీపై రంకెలు

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వరుసగా రెండోరోజూ పోలీసులపై చిందులు తొక్కారు. 'తమాషా చేస్తున్నారా' అంటూ రెచ్చిపోయారు. జగన్ సతీమణి భారతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో అరెస్టయి, పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు చేబ్రోలు కిరణ్‌పై దాడి చేసేందుకు మాధవ్ ప్రయత్నించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయనతోపాటు దాడిలో పాల్గొన్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కిరణ్‌ను మీడియా ముందు ప్రవేశపెట్టినట్లే మాధవ్ తదితరులనూ ప్రవేశపెట్టాలని భావించారు. కానీ కొన్ని కారణాల వల్ల మాధవ్‌ను మినహాయించి, మిగిలిన ఐదుగురిని మాత్రమే మీడియా ఎదుట

మిగతా 14వ పేజీలో...

రాజమండ్రి జైలుకు గోరంట్ల మాధవ్

రాసేది తప్పులు ఆపై.. ఏడ్పులు!

జగన్ రోత పత్రిక వింత వైఖరి

కుటుంబ కక్షలతో జరిగిన హత్యకు రాజకీయ రంగు

సొంత అల్లుడు, బంధువుల చేతిలో వ్యక్తి మృతి

తెలంగాణ సంచికలో ఇవే వివరాలతో వార్త

ఏపీ ఎడిషన్‌లో 'టీడీపీ గూండాల' పనే అని రచ్చ

సమర్థించుకునేందుకు 'పచ్చ' అంటూ పిచ్చి రాతలు

టీడీపీ ఫిర్యాదుతో జగన్ పత్రికపై కేసు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకే హత్య... ఒకే పత్రిక... ఒకే యాజమాన్యం! తెలంగాణ సంచికలో 'పాత కక్షల కారణంగా జరిగిన హత్య' అని ప్రచురించింది. ఆంధ్రప్రదేశ్ సంచికలో మాత్రం 'టీడీపీ గూండాలు చేసిన రాజకీయ హత్య' అని అచ్చేసింది! దీనిపై టీడీపీ కేసు పెట్టడంతో... జగన్ మీడియాకు 'పత్రికా స్వేచ్ఛ' గుర్తుకొచ్చింది! ఇదీ జగన్ రోత పత్రిక తీరు! చేసింది తప్పు కాబట్టి.. లెంపలేసుకోవాలి! లేదా.. మౌనంగా ఉండాలి. కాకుంటే.. టీడీపీపైనా, ప్రభుత్వంపైనా అక్కసు వెళ్లగక్కాలి. కానీ రోత పత్రిక శుక్రవారం తనకు గిట్టని పత్రికలపై 'పచ్చ మీడియా' అంటూ పిచ్చి రాతలు

మిగతా 12వ పేజీలో...

దాటవేత.. డొంక తిరుగుడు!

సీఐడీ విచారణలో జోగి రమేశ్ తీరు

దాడికి కాదు, నిరసనకే బాబు ఇంటికి

మా కార్లలో కర్రలు, రాళ్ల గురించి నాకు తెలియదు: మాజీ మంత్రి

మరోసారి రావాలన్న అధికారులు

13



మమ్మల్ని ఏమీ చేయలేరు

మళ్లీ అధికారంలోకొస్తాం

మీడియా వద్ద 'ఊగిన' జోగి రమేశ్



టీటీడీ గోశాలపై రగడ!

14

3 నెలల్లో వంద ఆవులు మృతి: భూమన

అబద్ధమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటారా?.. భానుప్రకాశ్‌రెడ్డి సవాల్

గత 3 నెలల్లో ఒక్క ఆవే అనారోగ్యంతో చనిపోయింది: బ్రాహ్మణ సాధికార సమితి

ఆవుల మృతి ప్రచారం అవాస్తవం: టీటీడీ

ఇంటర్ ఫలితాలు నేడే

ఉదయం 11 గంటలకు విడుదల: లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు విడుదలవుతాయని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ ద్వారా తెలిపారు. విద్యార్థులు resultsbie.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని, అలాగే మనమిత్ర వాట్సాప్ నంబరు 9552300009 ద్వారా కూడా ఫలితాలు చూడొచ్చని సూచించారు. ఇంటర్ ఫలితాలు విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు మార్గం చూపుతాయని లోకేశ్ పేర్కొన్నారు.



సిలిండర్ బుక్ చేసినా సబ్సిడీ జమ కాలేదా?

12

ఉచిత గ్యాస్‌కు మీరు అర్హులేనా?

సమస్య ఎక్కడుందో ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు

త్వరలో అందుబాటులోకి దీపం-2 డ్యాష్‌బోర్డ్

అప్పటి వైసీపీ కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అనుచరులు గత ఐదేళ్లూ రెచ్చిపోయారు. పట్టణం నడిబొడ్డున ఉన్న కాల్వలు, కుంట...డొంక పోరంబోకు అన్నింటినీ కలిపేసుకుని లేఔట్లు వేశారు. చివరికి శ్మశానాలను కూడా వదిలిపెట్టలేదు. మున్సిపల్ కామన్ సైట్లు, దేవదాయశాఖ భూములూ కలిపేసుకున్నారు.

సామాన్యులనేకాదు సొంత పార్టీ కార్యకర్తలనూ కావలి అపూర్వ సహోదరులు వదల్లేదు. దుగ్గిరాల కరుణాకర్ వైసీపీ కార్యకర్త. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ముసునూరు చెరువులో చేపలు వేలంపాటలో పాడుకుని పట్టుకునేవారు. కానీ, ఆయనకు వైసీపీ హయాంలో వేధింపులు తప్పలేదు. తమ స్థలం పక్కనే ఉన్న కరుణాకర్ ఇంటిని కలుపుకొని భారీ కమర్షియల్ కాంప్లెక్స్ కట్టాలని వారిద్దరూ ఎత్తువేశారు. కానీ, అందుకు సహకరించలేదని చేపలనూ కరుణాకర్‌ను పట్టుకోనివ్వలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో కరుణాకర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కరుణాకర్ వైసీపీ అయినా లోకేశ్ ఆయన కుటుంబాన్ని నాడు ఆదుకున్నారు. తనఖాలోని ఇంటిని రూ.15 లక్షలు కట్టి విడిపించారు.

అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి అపూర్వ సహోదరుల భూదందాలపై సమగ్ర విచారణ చేసేందుకు సిట్ వేస్తామని సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు కావలి పర్యటనలో ప్రకటించారు. రెవెన్యూ అధికారుల విచారణలో ఇప్పుడు తేలింది కొంతే. సిట్ వేస్తే మరిన్ని భూదందాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.



కావలి రూరల్ మండలం రుద్రకోట వద్ద తిప్పను తవ్వి గ్రావెల్ తరలించగా ఏర్పడిన గుంతలు (ఫైల్)

హాంఫట్

అపూర్వ సహోదరుల కబ్జాకాండ

300 కోట్ల విలువైన 90 ఎకరాలు కబ్జా

కావలి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, ఆయన సన్నిహితుడి అరాచక పర్వం

వైసీపీ హయాంలో యథేచ్ఛగా భూదందాలు

శ్మశానాలనూ వదలకుండా ఆక్రమణ

అక్రమాల దారిలో వైసీపీ నేతలకూ వేధింపులు

ఆత్మహత్య చేసుకున్న సొంత పార్టీ కార్యకర్త

ఐదేళ్లలో 100 కోట్ల గ్రావెల్ అక్రమ తవ్వకాలు

ప్రభుత్వానికి అందిన ఆర్డీవో నివేదిక

సిట్ వేస్తానని కావలిలో నాడు బాబు హామీ

దర్యాప్తు జరిగితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో అపూర్వ సహోదరులంటే హడల్. వారి కన్ను పడి ఎక్కడ తమ భూములు, ఆస్తులు, ఇళ్లూ హాంఫట్ అయిపోతాయేమోనని ప్రజలు, టీడీపీ శ్రేణులే కాదు, చివరికి వైసీపీ నేతలూ భయపడతారు. కాల్వలు..కుంట పోరంబోకు..డొంక పోరంబోకు..అసైన్డ్ భూములు.. వేటినీ వీరు వదలరు. చివరికి శ్మశానాలనూ కలిపేసుకొన్నారు. గ్రావెల్ కోసం వీరు తీసిన లోతైన గోతుల్లో పడి ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. అక్రమాలదారిలో తన, మన లేదు. అందరినీ వణికించేస్తారని వీరి గురించి కావలి నియోజకవర్గంలో చెబుతుంటారు. ఆఖరికి సొంత పార్టీవారే ధర్నా చేసే స్థాయికి వారిద్దరి అరాచక

మిగతా 12వ పేజీలో...

మరో 114 రాఫెల్ విమానాలు!

ఫ్రాన్స్ నుంచి కొనుగోలుకు కేంద్రం నిర్ణయం



18 ఆ దేశంలోనే తయారీ..

మిగిలిన 96 భారత్‌లో

స్థానిక కంపెనీలకు భాగస్వామ్యం

ఇప్పటికే వాయుసేన వద్ద 36 రాఫెల్ విమానాలు

నౌకాదళం కోసం మరో 26

కొత్త విమానాల్లో అమెరికా ఎఫ్-35లు ఉంటాయంటూ గతంలో ఊహాగానాలు

లండన్, ఏప్రిల్ 11: వైమానిక దళాన్ని బలోపేతం చేసేందుకు 114 రాఫెల్ 'బహుళ ప్రయోజనకర యుద్ధవిమానాలను' (ఎంఆర్‌ఎఫ్‌ఏ) ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. భారత్-ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య ఒప్పందం ద్వారా వీటిని సమకూర్చుకునే విధంగా కసరత్తు నడుస్తోంది. ఈ వివరాలను రక్షణశాఖకు చెందిన వర్గాలు వెల్లడించాయి. ఒప్పందంలో భాగంగా.. దాదాపు 18 విమానాలను ఫ్రాన్స్‌లోనే తయారుచేసి భారత్‌కు అందజేస్తారు. మిగిలిన 96 విమానాలను.. భారత్‌కు విడిభాగాలను తరలించి అక్కడే వాటిని అనుసంధానిస్తారు. దీనికోసం ఫ్రాన్స్‌కు చెందిన విమానాల తయారీ కంపెనీ దసో ఏవియేషన్, రక్షణరంగంలో

మిగతా 2వ పేజీలో...



అమెరికాపై చైనా 125 శాతం

ప్రతీకారం!

అగ్రరాజ్య సరుకుల దిగుమతులపై సుంకం మళ్లీ పెంపు

90 రోజుల నిలుపుదల జాబితాలో తమ దేశం లేనందునే!

అమెరికా మరోసారి పెంచితే పట్టించుకోబోమని ప్రకటన

ఈయూ కలిసిరావాలి.. కఠోర శ్రమతో మేం ఎదిగాం: జిన్‌పింగ్

అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటాం: జైశంకర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: అమెరికాతో సుంకాల యుద్ధంలో చైనా ఏమాత్రం వెనక్కి తగ్గడంలేదు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాన్ని 125 శాతానికి పెంచుతూ ప్రతీకారం తీర్చుకుంది. అమెరికా ప్రతీకార బాదుడు సుంకాలు మొదలుపెట్టినప్పటి నుంచీ అటు అగ్రరాజ్యం, ఇటు డ్రాగన్ దేశం

మిగతా 2వ పేజీలో...

గూగుల్‌లో భారీగా ఉద్యోగుల తొలగింపు

వందలాది మందికి ఉద్వాసన

డెలాయిట్, యాక్సెంచర్, ఇతర సంస్థలతో 5.1 బిలియన్ డాలర్ల ఐటీ ఒప్పందాలు రద్దు: పెంటగాన్



అన్నాడీఎంకే-బీజేపీ మధ్య

మళ్లీ పొత్తు

పళనిస్వామి సారథ్యంలో పనిచేస్తాం: అమిత్ షా

ఆర్ఎస్ఎస్ నేత, ఆడిటర్ గురుమూర్తి సలహాతో పొత్తుపై హుటాహుటిన కేంద్ర మంత్రి ప్రకటన

పళని డిమాండ్‌తోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి అన్నామలై తొలగింపు

కొత్త సారథిగా నాగేంద్రన్ నియామకం

డీఎంకే దూకుడుతోనే కమలనాథుల నిర్ణయం

2

బలహీనపడిన అల్పపీడనం

నేటి నుంచి మళ్లీ సెగలే

14

పాస్‌పోర్టు నిబంధన సరళతరం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: పాస్‌పోర్టు దరఖాస్తులో జీవిత భాగస్వామి పేరు చేర్చుకోవాలన్నా, మార్చుకోవాలన్నా పెళ్లి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. ఈ నిబంధన వల్ల దేశంలోని వివిధ ప్రాంతాల్లోని పౌరులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ నిబంధనను సరళీకృతం చేస్తూ భారత విదేశీ మంత్రిత్వ శాఖ విధానపర నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇప్పటికే పాస్‌పోర్టు సేవ వెబ్ సైట్‌లో కూడా మార్పులను జోడించారు. దీని ప్రకారం 'అనుబంధం జే'ను పాస్‌పోర్టు దరఖాస్తుదారు పూరించాల్సి ఉంటుంది. దానిపై దంపతులు ఇద్దరూ తేదీ, స్థలం పేర్కొంటూ సంతకం చేయాలి. వివాహం అయిందని, కలిసి ఉంటున్నామని నిర్ధారించాలి. తాము నివసిస్తున్న చిరునామాను పేర్కొనాలి. కలిసి దిగిన ఫొటోను 'స్వీయ నిర్ధారణ' చేసి జత చేయాలి. ఇరువురి ఆధార్ లేదా ఓటర్ ఐడీ లేదా పాస్‌పోర్టు నంబరును పేర్కొనాలి. దీనివలన పెళ్లి సర్టిఫికెట్ లేకపోయినా జీవిత భాగస్వామి పేరును జత చేసుకొని సులభంగా పాస్‌పోర్టు పొందవచ్చు.

125 శాతం 'ప్రతీకారం'

(మొదటిపేజీ తరువాయి)



పోటాపోటీగా సుంకాల విధింపును పెంచుకుంటూ పోతుండడం తెలిసిందే. కాగా, తమ దేశం నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను 145 శాతానికి పెంచుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన చైనాకు ఆగ్రహం తెప్పించింది. దీనికితోడు 75 దేశాల్లో సుంకాల పెంపుదల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తూ.. చైనాలో మాత్రం అమలవుతుందని ట్రంప్ చెప్పడాన్ని మరింత తీవ్రంగా పరిగణించింది. అమెరికాపై అంతకుముందు 84 శాతానికి పెంచిన సుంకాన్ని శుక్రవారం ఏకంగా 125 శాతానికి పెంచేసింది. అయితే ఇకపై మరింత పెంచే ఆలోచన లేదని పేర్కొంది. అమెరికా మరిన్ని అదనపు సుంకాలు విధించినా తాము పట్టించుకోబోమని స్పష్టం చేసింది. ఇప్పటికే తమ దేశంపై అసాధారణమైన రీతిలో సుంకాలు పెంచడం ద్వారా అంతర్జాతీయ, ఆర్థిక వాణిజ్య నిబంధనలను, ప్రాథమిక ఆర్థిక చట్టాలను అమెరికా పూర్తిగా ఉల్లంఘించిందని చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆరోపించింది. ఇది తమపై బెదిరింపులకు దిగడమేనని ఆక్షేపించింది.

సుంకాల యుద్ధంలో విజేతలు ఉండరు..

సుంకాల యుద్ధంలో ఎవరూ విజేతలు ఉండరని, కానీ.. దీనివల్ల అంతర్జాతీయ సమాజం మొత్తం స్వీయ నిర్బంధంలోకి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. ఈ అంశంపై ఆయన తొలిసారి బహిరంగంగా స్పందించారు. అన్నారు. ఏడు దశాబ్దాలుగా చైనా కఠోర శ్రమతో ఎదిగిందని, ఎవరి దయాదాక్షిణ్యాలపైనా ఆధారపడలేదని తెలిపారు. పైగా తమను అకారణంగా అణచివేయాలని చూసినవారెవరికీ వెన్ను చూపలేదని స్పష్టం చేశారు. స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్‌తో బీజింగ్‌లో జరిగిన సమావేశంలో జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా.. అమెరికా ఏకపక్షవాదాన్ని, ఆర్థిక దౌర్జన్యాన్ని తిప్పికొట్టడంలో, అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చేందుకు యూరోపియన్ యూనియన్ తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. తద్వారా ఈయూ తమ హక్కులను, ప్రయోజనాలను కాపాడుకోవాలని అన్నారు. కాగా, స్పెయిన్‌కు, ఈయూకు చైనాతో వాణిజ్య లోటు ఉందని, దీనిని పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని శాంచెజ్ అభిప్రాయపడ్డారు. అయితే తమ బంధాన్ని బలోపేతం చేసుకునే క్రమంలో వాణిజ్యపరమైన ఆందోళనలు లేకుండా చూసుకోవాల్సి ఉంటుందన్నారు. మరోవైపు తమపై అమెరికా పన్నాగాలు పనిచేయవని చైనా విదేశాంగ శాఖ పేర్కొంది. తమతో సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని అమెరికా భావిస్తే ముందుగా బాధ్యతారహితమైన చర్యలను ఆపాలని హితవు పలికింది.

అమెరికా, ఈయూతో భారత్ ఒప్పందం: జైశంకర్

అమెరికా, యూరోపియన్ యూనియన్‌తో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను కొలిక్కి తెచ్చే విషయాన్ని భారత్ అత్యంత ఆవశ్యక అంశంగా పరిగణిస్తోందని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన గ్లోబల్ టెక్నాలజీ సమ్మిట్‌లో మాట్లాడుతూ.. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం గతంలో ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో నాలుగేళ్లపాటు చర్చలు జరిపామని, అయినా ఒప్పందం కుదరలేదని అన్నారు. ప్రస్తుతం పూర్తి సంసిద్ధంగా ఉన్నామని, ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నామని చెప్పారు. ఇక యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని జైశంకర్ ప్రస్తావిస్తూ.. ఈ విషయంలో 23 ఏళ్లుగా చర్చలు జరుగుతున్నాయంటున్నారని, కానీ.. అది నిజం కాదని అన్నారు. ఈయూతో ఒప్పందం విషయంలో కొన్ని అడ్డంకులున్నాయని, ఈసారి వాటిని అధిగమించాలనే కృతనిశ్చయంతో ఉన్నామని తెలిపారు.

లోకం తీరు



గూగుల్‌లో భారీగా ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: టెక్ కంపెనీల్లో లేఆఫ్‌ల పర్వం కొనసాగుతోంది. తాజాగా ప్రముఖ టెక్ సంస్థ గూగుల్ పెద్దఎత్తున ఉద్యోగులను తొలగించింది. తన ప్లాట్‌ఫాంలు, డివైజెస్ విభాగాల్లో పనిచేసే వందలాది మందికి ఉద్వాసన పలికింది. ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లు, క్రోమ్ బ్రౌజర్ విభాగాలకు చెందిన సిబ్బందిపై వేటు పడిందని 'ది ఇన్ఫర్మేషన్' మీడియా సంస్థ వెల్లడించింది. ఈ ఏడాది జనవరిలో ఉద్యోగులకు ప్రకటించిన స్వచ్ఛంద విరమణ కార్యక్రమానికి అనుగుణంగా ఈ తొలగింపులు జరిగాయని పేర్కొంది. గతేడాది ఆండ్రాయిడ్, క్రోమ్ బృందాలను పిక్సెల్ అండ్ డివైజెస్ గ్రూప్‌లో విలీనం చేయడంతో ప్రారంభమైన కంపెనీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు. విలీనం సమయంలో ఉమ్మడి యూనిట్లలో 20వేల మందికి పైగా ఉద్యోగులు ఉండేవారు. ప్లాట్‌ఫాంలు, డివైజెస్ బృందం సామర్థ్యాలను, క్రియాశీలతను పెంపొందించడమే లక్ష్యంగా పునర్వ్యవస్థీకరణను చేపట్టినట్లు గూగుల్ అధికార ప్రతినిధి తెలిపారు. అయితే అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా నియామకాలు కొనసాగుతున్నాయని కంపెనీ పేర్కొంది. ఇదిలా ఉండగా, యాక్సెంచర్, డెలాయిట్ వంటి ప్రముఖ సంస్థలతో 5.1 బిలియన్ డాలర్ల విలువైన ఐటీ సేవల ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు పెంటగాన్ ప్రకటించింది. వృథా ఖర్చులు తగ్గించడంతో పాటు రక్షణ శాఖ సిబ్బంది అంతర్గత సామర్థ్యాలను మెరుగుపరచడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా రక్షణశాఖ కార్యదర్శి పీట్ హెగ్సేత్ గురువారం జారీ చేసిన మెమోలో పేర్కొన్నారు. పెంటగాన్ ఉద్యోగులు నిర్వహించగలిగిన సేవల కోసం థర్డ్ పార్టీ కన్సల్టెంట్లకు అనవసరంగా చెల్లింపులు చేయడాన్ని అరికట్టడానికే తాజా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ చర్య 5.1 బిలియన్ డాలర్ల వృథా ఖర్చును అరికట్టడంతో పాటు దాదాపు 4 బిలియన్ డాలర్లు ఆదా అవుతాయని హెగ్సేత్ తెలిపారు.

వాళ్లకు ఇలా కావాల్సిందే!

- ముంబై మారణహోమం అనంతరం ఉగ్రవాది హెడ్లీతో రాణా వ్యాఖ్య
- తనకు పాక్ యుద్ధవీరుల అవార్డు 'నిషాన్ ఈ హైదర్' ఇవ్వాలన్న ఉగ్రవాది



న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: 'వాళ్లకు ఇలా కావాల్సిందే..'. 166 మంది మరణించి, 238 మంది గాయపడిన ముంబై మారణహోమం తర్వాత ఉగ్రవాది తహవ్వుర్ హుస్సేన్ రాణా చేసిన వ్యాఖ్య ఇది. అంతేకాదు.. ఈ దుష్కృత్యాన్ని విజయవంతంగా పూర్తిచేసినందుకు తనకు పాకిస్థాన్ అత్యున్నత యుద్ధవీరుల పురస్కారమైన 'నిషాన్ ఈ హైదర్' ఇచ్చి గౌరవించాలని కూడా ఈ కరుడుగట్టిన ఉగ్రవాది డిమాండ్ చేశాడు. తనతో కలసి నాటి దారుణానికి ఒడిగట్టిన ఉగ్రవాది డేవిడ్ హెడ్లీతో రాణా ఈ విషయాలు చెప్పినట్టు అమెరికా న్యాయశాఖ తెలిపింది. తహవ్వుర్ రాణాను భారత్‌కు అప్పగించిన సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. రాణా అప్పగింతతో ముంబై ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు న్యాయం చేసే రోజు వచ్చిందని అమెరికా విదేశాంగ మంత్రి రూబియో అన్నారు. ఇదిలా ఉండగా, పటియాలా హౌస్ ఎన్ఐఏ కోర్టు రాణాకు 18 రోజుల ఎన్ఐఏ కస్టడీ విధించింది. ప్రతి 24 గంటలకోసారి రాణాకు వైద్య పరీక్షలు చేయించాలని, రోజు విడిచి రోజు అతడి తరఫు న్యాయవాదిని కలిసేందుకు అనుమతించాలని అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు శుక్రవారం తెల్లవారుజామున రాణాను లోధీరోడ్‌లోని సీజీఓ కాంప్లెక్స్‌లో ఉన్న ఎన్ఐఏ ప్రధాన కార్యాలయానికి తరలించారు. రాణాను అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ప్రత్యేకమైన సెల్‌లో ఉంచినట్టు ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. 14 అడుగుల పొడవు, 14 అడుగుల వెడల్పు ఉన్న ఈ గదిలో 24 గంటలూ సీసీ కెమెరా నిఘా ఉంటుందని, గార్డులు నిరంతరం కాపలాగా ఉంటారని వెల్లడించాయి. ఆ గదిలోనే ఓ మూలన బాత్రూం, నేలపై బెడ్ ఉంటుందని వివరించాయి.

రాణాను తీసుకొచ్చిన విమానం విలువ 500 కోట్లు

అమెరికా నుంచి రాణాను భారత్‌కు తీసుకొచ్చేందుకు ఎన్ఐఏ అధికారులు గల్ఫ్‌స్ట్రీమ్ జీ550 విమానాన్ని వినియోగించారు. ఎక్కడా ఆగకుండా ఏకధాటిగా 12,500 కిలోమీటర్ల దూరం వెళ్లగలిగే సామర్థ్యం దీని సొంతం. దీనితోపాటు విశాలమైన క్యాబిన్, మంచి భద్రతకు కూడా ఈ జెట్ విమానాలు పేరుపొందాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా సంపన్నులు, ప్రభుత్వాధిపతులు ఈ విమానాలను వినియోగిస్తారు. ఇందులో 19 మంది ప్రయాణించవచ్చు. దీని విలువ రూ.500 కోట్లు. రాణాను తీసుకువచ్చేందుకు దీనికి సుమారు రూ.4 కోట్లు అద్దె చెల్లించినట్టు అంచనా.

మళ్లీ అన్నాడీఎంకే-బీజేపీ పొత్తు

- పళనిస్వామి సారథ్యంలో పనిచేస్తాం
- స్వయంగా ప్రకటించిన అమిత్ షా



కమలాలయంలో మీడియాతో మాట్లాడుతున్న అమిత్ షా, చిత్రంలో పళనిస్వామి, అన్నామలై

చెన్నై, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దక్షిణాదిపై దృష్టి పెట్టిన బీజేపీ.. వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడలతో ముందుకు సాగుతోంది. కర్ణాటకలో అధికారం కోల్పోయిన దరిమిలా.. ఏపీలో టీడీపీ, జనసేనలతో కలిసి పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన కమల నాథులు ఇప్పుడు తమిళనాడుపైనా ఇదే వ్యూహంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. నిన్న మొన్నటి వరకు ఒంటరిగానే ఎన్నికలకు వెళ్లేందుకు ప్రయత్నించినా.. త్రిభాషా ఉద్యమం, నీట్, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక విషయాల్లో డీఎంకే పార్టీ బీజేపీని కేంద్రంగా చేసుకుని యుద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఒంటరి పోరు సరికాదని గ్రహించిన బీజేపీ అగ్రనాయకత్వం.. ఒకప్పటి మిత్రపక్షం అన్నాడీఎంకేతో చేతులు కలిపింది. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అన్నాడీఎంకే-బీజేపీ మధ్య పొత్తు ఖరారైంది. సాక్షాత్తు బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెన్నై వచ్చి అన్నాడీఎంకే నేతలతో చర్చించిన తర్వాత ఈ పొత్తును స్వయంగా ప్రకటించారు. అంతేకాదు, నేరుగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్) నివాసానికి వెళ్లిన షా.. ఈపీఎస్ కుటుంబంతో కలిసి తేనీరు సేవించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుని తమ పార్టీ నుంచి నలుగురిని అసెంబ్లీకి పంపించిన బీజేపీకి.. ఈసారి ఒంటరిగా ఎన్నికలను ఎదుర్కొనే పరిస్థితి లేదు. ప్రస్తుతం బీజేపీతో తమిళ మానిల కాంగ్రెస్, పీఎంకే వంటి చిన్న పార్టీలు మాత్రమే కలసి నడుస్తున్నాయి. పరిస్థితి గ్రహించిన కమలనాథులు అన్నాడీఎంకేను దరి చేర్చుకున్నారు. ప్రస్తుత బీజేపీ చీఫ్ అన్నామలైని పక్కన పెడితేనే పొత్తుకు సిద్ధమని అన్నాడీఎంకే తేల్చిచెప్పడంతో.. బీజేపీ అధినాయకత్వం ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించడం గమనార్హం.

గురుమూర్తి సూచన మేరకే..

తమిళ పత్రిక 'తుగ్లక్' సంపాదకుడు, ఆర్ఎస్ఎస్ క్రియాశీల నాయకుడిగా పేరొందిన ప్రముఖ ఆడిటర్ గురుమూర్తితో భేటీ అయ్యాకే అన్నాడీఎంకేతో పొత్తును అమిత్ షా ప్రకటించడం గమనార్హం. కూటమి ఏర్పాటు గురించి జాప్యం చేయవద్దన్న గురుమూర్తి సూచన మేరకు ఈపీఎస్‌ను తను ఉన్న హోటల్‌కు పిలిపించుకున్న అమిత్‌షా.. ఆయనతో గంటపాటు చర్చించారు. అనంతరం నేరుగా బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చి పొత్తుపై ప్రకటన చేశారు. అన్నాడీఎంకే నేతృత్వంలోనే తమ కూటమి పని చేస్తుందని, ఈ పొత్తుకు ఎలాంటి షరతుల్లేవని అమిత్‌షా చెప్పారు. శుక్రవారం సాయంత్రం బీజేపీ తమిళనాడు ప్రధాన కార్యాలయమైన కమలాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో మోదీ నేతృత్వంలో, రాష్ట్రస్థాయిలో పళనిస్వామి నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ఎన్నికలకు వెళ్తుందని చెప్పారు. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. కాగా, తమిళనాడులో బీజేపీ, అన్నాడీఎంకే చేతులు కలపడం ఆహ్వానించదగిన పరిణామమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు.

నాగేంద్రన్‌కు బీజేపీ పగ్గాలు

తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా తిరునల్వేలి ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ పదవికి నాగేంద్రన్ మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక లాంఛనమైంది. దక్షిణ తమిళనాడులో దేవర్ల ప్రాబల్యం అధికంగా ఉన్న నేపథ్యంలో ఆ సామాజిక వర్గానికి చెందిన నాగేంద్రన్‌ను బీజేపీ ఎంపిక చేయడం గమనార్హం. ఇప్పటి వరకు పార్టీని నడిపించిన అన్నామలై శుక్రవారం నాజీనామా చేశారు. పార్టీ తరఫున అన్నామలై శక్తికిమించి పనిచేశారని షా అన్నారు.

మరో 114 రాఫెల్ విమానాలు!

(మొదటిపేజీ తరువాయి)

అనుభవం ఉన్న భారతీయ కంపెనీతో కలిసి భారత్‌లో ఓ కేంద్రాన్ని నెలకొల్పుతుంది. విమాన విడిభాగాలు, ఇతర కీలకమైన యంత్రసామగ్రి తయారీ ప్రక్రియలో స్థానిక కంపెనీలకు కూడా భాగస్వామ్యం కల్పించనున్నట్లు సమాచారం. కనీసం 100 విమానాలు కొనుగోలు చేస్తేనే భారత్‌లో తయారీకేంద్రాన్ని నెలకొల్పుతామని దసో ఏవియేషన్ షరతు విధించింది. ఇప్పటికే 36 రాఫెల్ యుద్ధవిమానాలను దసో నుంచి కొనుగోలు చేయగా.. నౌకాదళం కోసం రూ.68,236 కోట్ల వ్యయంతో 26 మెరైన్ రాఫెల్ ఫైటర్ జెట్‌ల కొనుగోలుకు ఇటీవల ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన భద్రతా వ్యవహారాల కేంద్ర క్యాబినెట్ కమిటీ ఆమోద ముద్ర వేసింది. ఫ్రాన్స్ రక్షణమంత్రి త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. ఆయన పర్యటన సందర్భంగా కొనుగోలు ఒప్పందంపై సంతకాలు జరగనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వీటికి అదనంగా మరో 114 విమానాల కొనుగోలుకు తాజాగా కసరత్తు నడుస్తోంది. వీటి కోసం టెండర్ల దాఖలుకు ఆహ్వానం పలుకగా అమెరికా, యూరప్, రష్యా దేశాలకు చెందిన పలు కంపెనీలు పోటీపడ్డాయి. వీటిలో దసో రాఫెల్ ఎంపికైంది. కాగా, భారత్‌కు ఎఫ్35 విమానాలను విక్రయిస్తామని ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అయితే అది సాధ్యమయ్యే పని కాదని పేర్కొంటూ 'ఆంధ్రజ్యోతి' అప్పట్లో ఒక విశ్లేషణాత్మక కథనాన్ని ప్రచురించింది. తాజా పరిణామాలు దీనినే రుజువు చేయడం విశేషం.

రైల్వేలో 9,970 అసిస్టెంట్ లోకో పైలెట్ పోస్టులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: దేశవ్యాప్తంగా రైల్వే రీజియన్లలో 9,970 అసిస్టెంట్ లోకో పైలెట్ పోస్టుల భర్తీకి రైల్వే శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. టెన్త్‌తోపాటు ఐటీఐ చేసినవారు, సంబంధిత రంగంలో డిప్లొమా, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ చేసిన వారు ఈ పోస్టులకు అర్హులు. 2025 జూలై 1 నాటికి 18-30 ఏళ్ల మధ్య వయసున్న అర్హులైన అభ్యర్థులు మే 11లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయో పరిమితిలో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంది. మరోవైపు, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 98 టెక్నీషియన్ పోస్టులతోపాటు గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్ పోస్టుల కోసం దరఖాస్తులు కోరుతున్నారు. టెక్నీషియన్ పోస్టుల్లో డిప్లొమా టెక్నీషియన్(మెకానికల్) 20, డిప్లొమా టెక్నీషియన్(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్) 26, ఆపరేటర్(ఫిట్టర్) 34, ఆపరేటర్(ఎలక్ట్రీషియన్), ఆపరేటర్(మెషినిస్ట్)3, ఆపరేటర్(షీట్ మెటల్ వర్కర్)1 ఉద్యోగాలు ఉన్నాయి. పోస్టును బట్టి డిప్లొమా, ఐటీఐ పాసైన వారు అర్హులు. ఈనెల 18 లోగా అప్లై చేసుకోవచ్చు.

పార్టీ పదవి నుంచి తమిళ మంత్రి పొన్ముడి ఔట్



చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన తమిళనాడు అటవీ శాఖ మంత్రి కె.పొన్ముడిని డీఎంకే అధినేత, సీఎం స్టాలిన్ పార్టీ పదవి నుంచి తప్పించారు. ఆయన్ను డీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి స్థానం నుండి తొలగిస్తూ శుక్రవారం ఒక ప్రకటన చేశారు. అయితే ఇందుకు కారణాలను అందులో చెప్పలేదు. డీఎంకే ప్రభుత్వం నిరుపేద గృహిణులకు ప్రతినెలా రూ.1,000 నగదును వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేసే 'కలైంజర్ మహిళా సాధికారిక పథకం' గురించి ఓ సభలో వివరిస్తూ పొన్ముడి మహిళలపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఒక సెక్స్ వర్కర్ గురించి మాట్లాడే క్రమంలో హిందూ మత చిహ్నాలను లైంగిక భంగిమలతో పోలుస్తూ ఆయన చేసిన వివాదాస్పద జోక్ రాష్ట్రంలో రాజకీయ దుమారానికి కారణమైంది. డీఎంకే ఎంపీ కనిమొళి సహా విపక్ష పార్టీల నేతలు ఆయనపై మండిపడ్డారు.

మా నినాదం అందరి వికాసం

- వారికి కుటుంబమే సర్వస్వం.. విపక్షాలపై ప్రధాని ఆగ్రహం
- వారాణసీలో రూ.3,880 కోట్ల పథకాలకు శంకుస్థాపన



వారాణసీలో గ్యాంగ్ రేప్ బాధితురాలి వివరాలను ఎయిర్‌పోర్టులోనే ఆరా తీస్తున్న ప్రధాని మోదీ

వారాణసీ, ఏప్రిల్ 11: ప్రతిపక్షాలు కుటుంబ పార్టీలంటూ ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అందరి సమగ్రాభివృద్ధే లక్ష్యంగా.. 'సబ్‌కా వికాస్.. సబ్‌కా వికాస్' నినాదంతో తమ ప్రభుత్వం పనిచేస్తుంటే.. అధికార కాంక్షతో విపక్షాలు తమ కుటుంబాలను ప్రోత్సహించడమే పనిగా పెట్టుకున్నాయన్నారు. యూపీలోని తన నియోజకవర్గం వారాణసీలో శుక్రవారం ఆయన పర్యటించారు. 2014లో ప్రధానిగా పగ్గాలు చేపట్టాక ఇది ఆయనకు 50వ అధికారిక పర్యటన. ఈ సందర్భంగా రూ.3,880 కోట్ల విలువ చేసే 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. కొన్ని ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగించారు. జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలేకు నివాళులర్పించారు. 2036 ఒలింపిక్ క్రీడలు మన దేశంలో నిర్వహించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. మోదీ వారాణసీలో అడుగుపెట్టగానే.. ఇటీవల తన నియోజకవర్గంలో 19 ఏళ్ల యువతిపై జరిగిన గ్యాంగ్‌రేప్‌పై ఆరా తీశారు. పోలీసు కమిషనర్, డివిజనల్ కమిషనర్, కలెక్టర్ వివరాలు తెలియజేశారు. 23 మంది నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ప్రధాని ఆదేశించారు.

పెద్ద పెద్ద కార్పొరేట్లకు మేలుతో యువతకు ఉద్యోగాలొస్తాయా?

- ఎన్నికలప్పుడు చెప్పిన ఈఎల్ఐ స్కీమ్ ఏదీ?.. ప్రధానిపై రాహుల్ ధ్వజం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పనపై ప్రధాని మోదీకి ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మూడు ప్రశ్నలు సంధించారు. పెద్దపెద్ద కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చి.. చిన్న పరిశ్రమలను పక్కనపెడితే ఉద్యోగాల కల్పన ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 2024 ఎన్నికల ముందు ప్రధాని ఆర్భాటంగా ప్రకటించిన ఉపాధి ఆధారిత రాయితీ (ఈఎల్ఐ) పథకం ఏమైందని నిలదీశారు. దేశ యువతకు అత్యవసరమైన ఉపాధి కల్పనపై ఆయనకు నిర్మాణాత్మక ప్రణాళిక ఉందా.. లేక ఇది కూడా శుష్క వాగ్దానమేనా అని శుక్రవారం 'ఎక్స్'లో ప్రశ్నించారు. ఈఎల్ఐ స్కీంపై కార్యాచరణే సిద్ధం కాలేదని.. నియమ నిబంధనలు రూపొందించలేదని.. బడ్జెట్‌లో దానికి కేటాయించిన రూ.10 వేల కోట్లు ఎక్కడకు వెళ్లాయని నిలదీశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంలో ఆయన చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. స్వదేశీ పెట్టుబడులను మోదీ ప్రభుత్వం నాశనం చేసిందని.. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) కూడా దాదాపు అంతరించే దశలో ఉన్నాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఆరోపించారు. భయపెట్టడం, మోసగించడం, బెదిరించడం అనే విధానాల వల్లే ఈ దుర్గతి పట్టిందని 'ఎక్స్'లో ధ్వజమెత్తారు.



స్వర్ణరథంపై మలయప్ప

తిరుమలలో కన్నులపండువగా వసంతోత్సవం

తిరుమల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం తిరుమలలోని వసంత మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉదయం స్వర్ణరథంలో దర్శనమిచ్చారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు అత్యంత వైభవంగా జరిగిన ఈ స్వర్ణరథోత్సవంలో భక్తులు వేలాదిగా పాల్గొని గోవిందనామాలు, కర్పూర హారతులతో ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. వసంతమండపంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆ తర్వాత స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. చివరి రోజైన శనివారం భూదేవి సమేత మలయప్పస్వామితో పాటు రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి, సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులకూ వసంతమండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు.



జస్టిస్ హరిహరనాథశర్మ, జస్టిస్ లక్ష్మణరావులకు అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి

శ్రీబగళాముఖి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తులు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం చందోలు గ్రామంలోని శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయాన్ని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టున్యాయమూర్తులు జస్టిస్ ఎ.హరిహరనాధశర్మ, జస్టిస్ వై.లక్ష్మణరావు దర్శించి అమ్మవారికి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు న్యాయమూర్తులకు వేద ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

ఏపీ నిట్‌లో ఎంటెక్ పునఃప్రారంభం

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో ఎంటెక్ కోర్సులను పునః ప్రారంభిస్తున్నారు. ఐదేళ్ల క్రితమే ఏపీ నిట్‌లో ఎంటెక్ కోర్సులు ఉన్నప్పటికీ తాత్కాలికంగా నిలిపివేశారు. అధ్యాపక సిబ్బంది కొరతతో ఈ కోర్సు అందుబాటులో లేకుండా పోయింది. ఇటీవల అధ్యాపకులను నియమించారు. రెగ్యులర్ పోస్టులను భర్తీ చేశారు. ప్రొఫెసర్ల నియామకం పూర్తి చేసారు. మొత్తంమీద 65 మంది అధ్యాపక సిబ్బంది అదనంగా భర్తీ కావడంతో ఎంటెక్ కోర్సులను పునః ప్రారంభించేందుకు ఏపీ నిట్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేసి, ఈ ఏడాది అడ్మిషన్లు నిర్వహించనున్నారు. కంప్యూటర్ సైన్స్ ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్, బయో టెక్నాలజీ, మెటలర్జీ విభాగంలో 95 ఎంటెక్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. మరో వైపు బీటెక్ ఇంజనీరింగ్ విభాగాలలోనూ సీట్ల సంఖ్య పెంపుపై తర్జన భర్జన పడుతున్నారు. గత ఎన్‌డీఏ ప్రభుత్వంలో ఏపీ నిట్‌లో బీటెక్ సీట్ల సంఖ్య 750 కు చేరింది. అధ్యాపక సిబ్బంది కొరత ఉందన్న కారణంతో సీట్ల సంఖ్యను 480కి కుదించారు. బీటెక్‌లో సీట్లు పెంచాలంటే మరికొంత ఫ్యాకల్టీ అవసరం ఉందని భావిస్తున్నారు.

కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ సస్పెన్షన్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కోపూరి ఆనందరావును సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. తునికి చెందిన ఓ గ్యాస్ ఏజెన్సీ ఆస్తి పేరు మార్చడానికి లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ గతనెల 28న ఆనందరావు ఏసీబీకి పట్టుబడ్డారు.

శిక్షమాఫీ దరఖాస్తుపై నిబంధనల మేరకు నిర్ణయం

- చిలకలూరి పేట బస్సు దహనం కేసులో దోషికి రాష్ట్రపతి క్షమాభిక్ష పెట్టారు
- మరణశిక్షను జీవిత ఖైదుగా మార్చారు
- రెమిషన్ కోసం ఆనాటి పాలసీని పరిగణనలోకి తీసుకోవాలి
- చలపతిరావు కేసులో రాష్ట్ర ప్రభుత్వం, జైళ్లశాఖ డీజీకి హైకోర్టు ఆదేశం



అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట బస్సు దహనం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఎస్.చలపతిరావు శిక్ష మాఫీ(రెమిషన్) కోసం చేసుకొనే దరఖాస్తు విషయంలో చట్టనిబంధనలకు అనుగుణంగా తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం, జైళ్ల శాఖ డీజీని హైకోర్టు ఆదేశించింది. శిక్ష మాఫీకి దరఖాస్తు చేసుకొనే విషయాన్ని చలపతిరావుకే వదిలేసింది. చలపతిరావుకు గతంలో కోర్టు విధించిన మరణశిక్షను రాష్ట్రపతి జీవిత ఖైదుగా మారుస్తూ క్షమాభిక్ష పెట్టారని గుర్తు చేసింది. ఆ క్షమాభిక్ష నాటికి ఉనికిలో ఉన్న పాలసీకి అనుగుణంగా శిక్ష మాఫీ కోసం చలపతిరావు సమర్పించే దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం ఈనెల 9న తీర్పు ఇచ్చింది. గుంటూరు జిల్లాలో 1993 మార్చి 7న ఆర్టీసీ బస్సును దోపిడీ చేసే క్రమంలో పెట్రోల్ పోసి దహనం చేయగా.. మొత్తం 23మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో గుంటూరు మూడో అదనపు సెషన్స్ కోర్టు చలపతిరావుతో పాటు మరొకరికి మరణశిక్ష విధిస్తూ 1995 సెప్టెంబర్‌లో తీర్పు ఇచ్చింది. తీర్పును సవాల్ చేస్తూ వీరిద్దరు సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఊరట లభించలేదు. తదనంతరం మరణశిక్షను జీవిత ఖైదుగా మారుస్తూ 1998 మే 21న రాష్ట్రపతి క్షమాభిక్ష పెట్టారు. ప్రస్తుతం చలపతిరావు నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్నారు. కుటుంబ బాధ్యతలు నిర్వర్తించే నిమిత్తం తన తండ్రి శిక్షను మాఫీ చేసి విడుదల చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ చలపతిరావు కుమార్తె స్వప్న 2018లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది డి.సురేష్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఏపీ ప్రిజన్ రూల్ 320(ఏ) ప్రకారం జీవిత ఖైదు అంటే 20 ఏళ్ల మాత్రమే అన్నారు. చలపతిరావు 30 ఏళ్లకు పైగా జైలు శిక్ష అనుభవిస్తున్నారన్నారు. సత్ప్రవర్తన కారణంగా చలపతిరావు విడుదలకు అర్హుడని చెప్పారు. రాష్ట్రపతి క్షమాభిక్ష పెట్టేనాటికి అమల్లో ఉన్న పాలసీకి అనుగుణంగా చలపతిరావు శిక్షను మాఫీ చేయాల్సి ఉంటుందని వివరించారు. నెల్లూరు కేంద్రకారాగారం సూపరింటెండెంట్ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేస్తూ.. జీవిత ఖైదు శిక్ష పడిన ఖైదీలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు ప్రకారం శిక్ష మాఫీకి అర్హులన్నారు. మరణశిక్షపడి తదనంతరం జీవిత కారాగార శిక్షగా మారిన ఖైదీల విషయంలో రెమిషన్ సాధ్యపడదని తెలిపారు. కారాగారంలో పిటిషనర్ ప్రవర్తన సంతృప్తికరంగా లేదన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. జీవిత ఖైదు అంటే మిగిలిన జీవిత కాలం మొత్తం కారాగారంలో ఉండడమేనని పేర్కొంది. ఇదే విషయాన్ని స్పష్టం చేస్తూ సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని గుర్తు చేసింది. ఏపీ ప్రిజన్ రూల్ 320(ఏ), ఐపీసీలోని సెక్షన్ 57 పరిశీలించినా జీవిత ఖైదు అంటే 20 ఏళ్లకు పరిమితం చేసినట్లు లేదని తెలిపింది. చట్టనిబంధనలకు అనుగుణంగా రెమిషన్ దరఖాస్తును పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేసింది.

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మరింత చౌక ధరల్లో మందులు

- ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఫార్మా రంగంలోకి కృత్రిమ మేధ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశించడంతో భవిష్యత్తులో మరింత చౌక ధరల్లో మందులు తయారయ్యే అవకాశం ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వి. వీరపాండియన్ తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ మేనేజ్‌మెంట్ (బెంగళూరు) ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరులోని ఒక హోటల్‌లో జరిగిన ఫార్మా టెక్ కన్వర్జ్ 2025లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భారత్ జనరిక్ మందులు, వ్యాక్సిన్లను పాశ్చాత్య దేశాలకు తక్కువ ధరలకే ఎగుమతి చేస్తున్నట్టు వివరించారు. ఫార్మాలో ఏపీ బలంగా ఉందని, బయోటెక్నాలజీ రంగంలో కర్నాటకకు మంచి గుర్తింపు ఉందన్నారు. కర్నాటకతో కలసి ఫార్మా, బయో టెక్నాలజీ రంగాల్లో పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

అంతర్జాతీయ విపణిలో దేశీయ పసుపునకు భారీ డిమాండ్

- జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భారత్‌లో ఉత్పత్తయ్యే పసుపునకు అంతర్జాతీయ విపణిలో భారీ డిమాండ్ ఉందని జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి చెప్పారు. రాజమహేంద్రవరంలోని సీటీఆర్ఐ జాతీయ వాణిజ్య పరిశోధన సంస్థలో శుక్రవారం ఏర్పాటు చేసిన పసుపు పంట భాగస్వామ్య సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పసుపు ఎగుమతుల ద్వారా రూ.1,876 కోట్ల ఆదాయం వస్తోందని, వచ్చే ఐదేళ్లలో దీన్ని రూ.6,000 కోట్లకు పైగా పెంచడానికి బోర్డు కృషి చేస్తోందని తెలిపారు. పసుపు వినియోగం పెరిగిందని, రైళ్లు, విమానాల్లో గోల్డెన్ మిల్క్ పేరుతో పసుపు కలిపిన పాలను ప్రయాణికులకు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. పాడేరు, లంబసింగి ప్రాంతాల్లో పసుపు సాగుకు అనుకూలమైన వాతావరణం ఉందని, అధిక కురుకుమిన్ శాతం కలిగిన పసుపు రకాలను ఆ ప్రాంతాల్లో రైతులు సాగు చేసేందుకు జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ కృషి చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దౌత్య విజయం

ముంబై ఉగ్రదాడి నిందితుడు తహవ్వుర్ రాణా అమెరికా జైలు నుంచి ఎన్ఐఏ కస్టడీలోకి వచ్చాడు. 26/11 మారణకాండకు పదిహేడేళ్లవుతున్న తరుణంలో భారతదేశం ఇతడిని విచారించేందుకు సిద్ధపడుతోంది. అప్పగింతను అడ్డుకోవడానికి అమెరికాలో తనకున్న అన్ని అవకాశాలను ఆయన వాడుకున్నాడు. ఆ దేశాధ్యక్షుడితో పాటు అక్కడి న్యాయస్థానాలు కూడా సహాయనిరాకరణ చేయడంతో ఇతడు అంతిమంగా భారత్ చేరక తప్పలేదు. రాణాను హింసించబోమని, ప్రాణాలకు ప్రమాదం రానివ్వబోమని, కేసుకు పరిమితమై మర్యాదగా ప్రశ్నిస్తామని మాట ఇచ్చి తెచ్చుకున్నదానికి అనుగుణంగానే ఇక్కడి ఏర్పాట్లు కూడా ఉన్నాయి. అప్పగింతలు మొదలు, ఆయన ప్రయాణించిన విమానం, అది వచ్చిన దారి, ఇక్కడి న్యాయస్థానాల్లో ఎన్ఐఏ అభ్యర్థనలు ఇత్యాది వివరాలు విశేషాలతో టెలివిజన్ చానెళ్ళు హోరెత్తిపోతున్నాయి. రాణా చెప్పబోయేది ఏమిటి, విప్పబోయే గుట్టుతో పాకిస్థాన్ పని అయిపోయినట్టేనా, భారతదేశంలో సైతం కొందరికి సమస్యలు తప్పవా ఇత్యాది ప్రశ్నలతో మీడియా హడావుడిపడుతోంది. రాణాను రప్పించిన ఘనతమాదేనని, మోదీ ప్రభావ ప్రాభవాల వల్లే ఇది సాధ్యమైందని బీజేపీ నాయకులు అదేపనిగా అంటూండటంతో కాంగ్రెస్‌కు ఆగ్రహం కలిగింది. మన్మోహన్‌సింగ్ కాలంలోనే ఈ ప్రక్రియకు పునాదిపడిందని ఆ పార్టీ గుర్తుచేసింది. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా పర్యటన ఆరంభించకముందే, ఆ దేశంనుంచి ఇంధన, ఆయుధ కొనుగోళ్ళకు, అమెరికా ఉత్పత్తులపై సుంకాల సడలింపులూ రాయితీలకు సిద్ధపడి, వాటికి బదులుగా ఈ వృద్ధ ఉగ్రవాదిని తెచ్చుకున్నారని గిట్టనివారు ఆడిపోసుకున్నారు కూడా. ఈ విమర్శలను అటుంచితే, 170మంది ప్రాణాలను బలితీసుకున్న ఒక ఉగ్రవాదిని ఇలా రప్పించి, ఈ దేశ చట్టాలకు అనుగుణంగా, ఈ భూమిమీద శిక్షించడానికి మార్గం సుగమం చేసుకోవడం కచ్చితంగా స్వాగతించాల్సిన అంశం.

తెలీదు, గుర్తులేదు అంటూ నిన్నటిమొన్నటి కేసుల్లోనే నిందితులు, సాక్షులు తేల్చేస్తూంటే తహవ్వుర్ రాణానుంచి ఇప్పుడు కొత్తగా రాబట్టగలిగేది, తవ్వితీయగలిగేది ఏమైనా ఉంటుందా అన్నది ప్రశ్న. ఉగ్రదాడుల కుట్రలు, పన్నాగాలకు సంబంధించి అదనంగా ఓ నాలుగు విషయాలు చెప్పగలిగినా ఆయన సహాయకుడు మాత్రమేనన్నది వాస్తవం. లష్కరే తోయిబా అధినేత హఫీజ్ సయీద్, దాని కార్యకలాపాల అధినేత లఖ్వీ, డేవిడ్ హ్యాడ్లీ వంటివారు సూత్రధారులు, పాత్రధారులుగా సాగిన ఈ విధ్వంసంలో హ్యాడ్లీ నేరుగా సంభాషిస్తూ వచ్చిన ఐఎస్ఐ అధికారి ఇక్బాల్ కూడా కీలకభూమిక నిర్వహించిన విషయం తెలిసిందే. డేవిడ్ హ్యాడ్లీ అనే దావూద్ గిలానీ తన మిత్రుడైన రాణాను వాడుకొని పనిచక్కబెట్టుకున్న దశలో ఈయనకు అదనంగా తెలిసింది ఎంత, అందులో ఇప్పుడు చెప్పబోయేది ఎంత అన్నది చూడాలి. మొత్తం గొలుసుకట్టులో రాణా స్థానం ఎక్కడ అన్నది ప్రధానం. ఈ అపనమ్మకం కారణంగానే ఇతడిని బిర్యానీ ఖైదీ అని కూడా కొందరు తీసిపారేస్తున్నారు. అమెరికాకు నిజంగానే ముంబైఘోరం విషయంలో పట్టింపు, బాధిత కుటుంబీకులపట్ల సానుభూతి ఉండివుంటే భారత్‌కు అప్పగించబోనని హామీ ఇచ్చి డేవిడ్ హ్యాడ్లీతో ఒప్పందం చేసుకొనేది కాదు. ఇక, హఫీజ్ సయీద్‌కు సంబంధించిన సమాచారానికి 2012లో భారీ పారితోషికం ప్రకటించిన అమెరికా ఆ తరువాత అతడు పాకిస్థాన్‌లో బహిరంగంగా తిరుగుతున్నా, సభల్లో ప్రసంగాలు చేస్తున్నా పట్టించుకోలేదు. ఆరుగురు అమెరికన్లతో సహా బాధితులందరికీ న్యాయం దక్కడానికి రాణా కీలకమని వ్యాఖ్యానిస్తూ ఆయనను పాకిస్థాన్ మూలాలున్నవాడిగా అమెరికా ఇప్పుడు ప్రత్యేకంగా గుర్తుచేస్తోంది. ఇరవైయేళ్ళుగా అతడితో తనకు సంబంధం లేదని విడుదల రోజునే పాకిస్థాన్ చేతులు దులిపేసుకుంది. ముంబై ఉగ్రదాడుల కుట్రలమీద గతంలో ఇచ్చిన విస్తృత సమాచారాన్ని కూడా అది అవహేళన చేసి, అటకెక్కించేసింది. రాణా భారత్ రాక, ఇక్కడి విచారణ పాకిస్థాన్‌మీద ఒత్తిడిపెంచి, హఫీజ్ సయీద్ సహా లష్కర్ కమాండర్లను శిక్షించేందుకు దారితీస్తుందని కొందరి నమ్మకం. ముంబై ఉగ్రదాడి బాధిత కుటుంబాలవారికి ఇప్పటివరకూ దక్కిన ఉపశమనమల్లా అజ్మల్ కసబ్‌ను ప్రత్యక్షంగా పట్టుకొని, విచారించి, సంఘటన జరిగిన నాలుగేళ్ళలోనే మనం ఉరితీయగలగడం. ఎంతో కష్టపడి, ఇంతకాలానికి దేశానికి తెచ్చుకోగలిగిన తహవ్వుర్ రాణా విషయంలో మనం ఎంతవేగంగా, ఏ మాత్రం చేయగలుగుతామో చూడాలి.

జార్జి రెడ్డి జ్ఞాపకాలు

జార్జిరెడ్డితో నా పరిచయం, నేను ఎం.ఏ. మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు (1971–72లో). జార్జిని నాకు ఎవరు పరిచయం చేశారో సరిగా గుర్తు లేదు. కానీ, అతన్ని చాలా తరచుగా, ఉస్మానియా యూనివర్సిటీ, మెయిన్ లైబ్రరీలో చూసే వాణ్ణి. జార్జితో పరిచయం అయ్యాక, అతనూ, ఇంకో నలుగురమూ కలిసి, ఉస్మానియా యూనివర్సిటీ కాంపస్, పీజీ హాస్టల్‌లోని ఒకతని రూంలో, వారం పదిరోజులకు ఒకసారి కలుసుకునేవాళ్ళం. అది ఒక రకమైన 'స్టడీ సర్కిల్' లాంటిదనుకోవచ్చు.

జార్జి లైబ్రరీలో చదువుతూ కనిపించినప్పుడు, ఆ సమయానికి అతను చదువుతున్న పుస్తకం గురించి, చాలా క్లుప్తంగా మాట్లాడుకున్న సందర్భాలున్నాయి. ఒకసారి 'బకూనిన్' పుస్తకం ఒకటి చదువుతూ కనిపించాడు. అప్పటికి నేను మార్క్సిజానికి సంబంధించిన పుస్తకాలు ఏవో కొన్ని మాత్రమే చదివాను. కానీ, 'బకూనిన్' గురించి విన్నాను. అతను 'అరాచకవాద సిద్ధాంతకర్త' అనీ, పార్టీనీ, రాజ్యాంగ యంత్రాంగాన్నీ ఒప్పుకోడనీ, మార్క్సు ఎంగెల్సులు అతన్ని వ్యతిరేకించారనీ– ఇలా, ఏవో, ఎవరో రాసిన పుస్తకాల్లో, పైపైన చదివినట్టు గుర్తు. అదే మాట జార్జితో అంటే, 'కాదు. బకూనిన్ కూడా కార్మిక ఉద్యమకారుడే. కాకపోతే, అతని సిద్ధాంతం వేరు'– అని ఏదో క్లుప్తంగా చెప్పాడు. నాదంతా, పైపైన చదివిన, పరిమిత జ్ఞానమే కాబట్టి, నేనేమీ వాదించలేదు. అరకొర జ్ఞానంతో అయినా, కొన్ని రకాల ప్రశ్నలు వచ్చేవి. ఒకసారి జార్జి, కాంగ్రెస్ పార్టీ వాళ్ళు పెట్టిన 'సోషలిస్ట్ యూత్ ఫోరం' అనుకుంటా, ఆ మీటింగుకి వెళ్ళి మాట్లాడినట్టు తెలిసింది. 'అదేమిటీ, వాళ్ళు బూర్జువాలు గదా? వాళ్ళతో కలవడం ఏమిటీ?' అన్నాను. దానికి జార్జి, 'అవును, వాళ్ళు బూర్జువాలే. రేపు సమయం వచ్చినప్పుడు, వాళ్ళు తుపాకులు మనవైపు తిప్పుతారు. ఇప్పుడున్న ప్రధాన శత్రువుని ఎదుర్కోవడానికి వీళ్ళకి మన అవసరం ఉంది. అలాగే, మనకి వాళ్ళ అవసరం ఉంది'– అనే ధోరణిలో సాగింది జార్జి వివరణ.



జార్జి హత్య జరిగిన రోజున, చీకటి పడుతున్న వేళ, ఆరూ, ఆరున్నర ప్రాంతంలో, 'ఏ' హాస్టల్ మెస్సులో, అన్నం తిని, రోజూ లాగే లైబ్రరీకి బైల్దేరాను. లైబ్రరీ మెట్లు ఎక్కుతుండగా, జార్జి, ఇంకో అతనితో ఎదురుపడ్డాడు. 'ఎక్కడికి' అని నేను అడిగితే, 'ఇంజినీరింగు కాలేజీ హాస్టల్‌లో, మన కుర్రాళ్ళని, ఎన్నికల్లో అవతలి పక్షం వాళ్ళు బెదిరిస్తున్నారని తెలిసింది. అక్కడికి వెళ్తున్నా' అన్నాడు. లైబ్రరీలో చదువుకుంటూ, ఒక గంట గడిచిందో లేదో, ఒక స్నేహితుడు పరిగెత్తుకుంటూ వచ్చి, 'జార్జిని స్టాబ్ జేసింద్రంట!' అని చెప్పాడు.

జార్జి హత్య జరిగిన రోజున (14-4-1972), చీకటి పడుతున్న వేళ, ఆరూ, ఆరున్నర ప్రాంతంలో, 'ఏ' హాస్టల్ మెస్సులో, అన్నం తిని, రోజూ లాగే లైబ్రరీకి బైల్దేరాను. లైబ్రరీ మెట్లు ఎక్కుతుండగా, జార్జి, ఇంకో అతనితో ఎదురుపడ్డాడు. 'ఎక్కడికి' అని నేను అడిగితే, 'ఇంజినీరింగు కాలేజీ హాస్టల్‌లో, మన కుర్రాళ్ళని, ఎన్నికల్లో అవతలి పక్షం వాళ్ళు బెదిరిస్తున్నారని తెలిసింది. అక్కడికి వెళ్తున్నా' అన్నాడు.

లైబ్రరీలో చదువుకుంటూ, ఒక గంట గడిచిందో లేదో, ఒక స్నేహితుడు పరిగెత్తుకుంటూ వచ్చి, 'జార్జిని స్టాబ్ జేసింద్రంట!' అని చెప్పాడు. వెంటనే, ఇంజినీరింగు కాలేజీ వెనక వున్న ఒక హాస్టల్‌కి పరిగెత్తి కెళ్తే, అక్కడ కొందరు పోలీసులున్నారు. నేల మీద రక్తం పడివుంది. జార్జి వేసుకునే రబ్బరు స్లిప్పర్స్ పడి వున్నాయి. జార్జిని గాంధీ హాస్పటల్ కి తీసుకెళ్ళారని తెలిసింది. బస్సు పట్టుకుని గాంధీ హాస్పటల్‌కి వెళ్తే, ఉస్మానియా హాస్పటల్‌కి పరీక్ష కోసం తీసికెళ్ళారని చెప్పారు. అక్కణ్ణించీ ఉస్మానియా హాస్పటల్‌కి వెళ్తే, అక్కడ మొదట్లోనే, ఒక పోలీసు అవుట్ పోస్టో, మార్చ్యురీనో ఏదో ఉంది. అక్కడ, చూస్తే జార్జి మృతదేహం నేల మీద, అడుగున చాపలాంటిది కూడా లేకుండా, పడి వుంది. ద్వారం దగ్గిర, రాజకీయ నాయకుడి డ్రెస్సులో ఒకరున్నారు. అతనెవరంటే, అప్పటి కాంగ్రెస్ పార్టీలో, ఎమ్మెల్యేనో, కార్మిక శాఖామంత్రో అనుకుంటాను, టి.అంజయ్య. నేను పెద్దగా ఏడుస్తూ, అంజయ్యతో, 'మీరంతా ఏమి చేస్తున్నారు, ఇలా జరుగుతూవుంటే..' అని ఏదేదో అంటున్నాను. అక్కడున్న ఇతర స్టూడెంట్స్ కూడా, నినాదాలిస్తూ, ఆవేదనతో ఉన్నారు.

జార్జి హత్య తరవాత, అతని మిత్రులందరమూ తరచూ, కలుసుకుంటూ వుండే వాళ్ళం. జార్జిని హత్య చేసిన తర్వాత, ప్రత్యర్థులు, అతని సన్నిహిత అనుచరుల మీద కూడా దాడులు చేస్తూ ఉండేవారు. అలాంటి సందర్భాలలో, జార్జికి సన్నిహితంగా ఉండిన ఒకరిద్దరు, అవతలి పక్షాన్ని ఖండిస్తూ కరపత్రాలు ఇంగ్లీషులో రాస్తూ ఉండేవారు. నేను పుస్తకాలు ఎక్కువగా చదువుతాననీ, చలం గారి గురించీ, కమ్యూనిజం గురించీ, హాస్టల్లో, వాదప్రతివాదాలు చేస్తాననీ తెలిసి, అలాంటి కరపత్రాల్ని తెలుగులోకి అనువదించమని నన్ను అడిగేవారు.



1973లో, జార్జి హత్య జరిగి ఒక ఏడాది కావస్తూండడంతో, ఒక సంస్మరణ సంచిక, తెలుగులో తేవాలని, అతని సన్నిహిత మిత్రులందరూ అనుకుని, ఆ పని నాకు అప్పగించారు. దానికోసం, జార్జి గురించి బాగా తెలిసినవాళ్ళని, వ్యాసాలు రాసి ఇవ్వమని అడిగాను. తెలుగువాళ్ళెవ్వరూ, తెలుగులో రాసి ఇవ్వడానికి చొరవ చూపలేక పోయారు. ముగ్గురు ఇతర భాషల వాళ్ళు ఇంగ్లీషులో రాసిచ్చారు. వాటిని, నేను యథాతథంగా కాక, స్వేచ్ఛానువాదం చేశాను. మధ్య మధ్యలో శ్రీశ్రీ 'మహాప్రస్థానం' నించీ కొన్ని కవితా పంక్తుల్నీ, ఆ కవితా సంకలనానికి చలం గారు రాసిన 'యోగ్యతాపత్రం'లో నించీ కొన్ని పదబంధాల్నీ, ఆ సందర్భానికి అవసరం అనుకుని, వాటిని వాడుతూ అనువదించాను.

ఈ పుస్తకంలో ఒక ముందు మాటా, చిన్నవీ, పెద్దవీ కలిసి 5 వ్యాసాలూ ఉన్నాయి. 'జార్జి వ్యక్తిత్వం' అనే వ్యాసం, జార్జితో సన్నిహితంగా మెలిగిన 'విజయ్ కులకర్ణి' అనే అతను ఇంగ్లీషులో రాసిచ్చినట్టు గుర్తు. 'నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం' అన్న వ్యాసాన్నీ, 'విద్యార్థి ఉద్యమాలు' అన్న వ్యాసాన్నీ, టెక్నాలజీ కాలేజీకి చెందిన 'భాస్కర్' అనే అతను రాసిచ్చాడు. 'దోపిడీ వ్యవస్థలో స్త్రీలు' అనే వ్యాసాన్ని, ఆర్ట్స్ కాలేజీలో, లింగ్విస్టిక్స్ పాఠాలు చెప్పే మా లెక్చరర్ లక్ష్మీబాయి గారు రాశారు. ఈ పుస్తకంలో చివరిలో ఉన్న చిన్న వ్యాసం, 'ఏది హింస?' అన్నది నేను రాసినదే. ఆత్మరక్షణ కోసం ప్రజలు చేసే పోరాటాన్ని హింస అనకూడదనే వాదన ఉన్న ఈ వ్యాసానికి, ఎలాగోలా, అహింసావాదిగా పేరుపొందిన గాంధీని గుర్తు చెయ్యాలని, 'మోహన్ గాంధీ' అని ఆ వ్యాసకర్త పేరుగా పెట్టాను. 'ముందుమాట' కూడా నేనే రాశాను. దాన్నిండా, 'మహాప్రస్థానానికి' చలం గారు రాసిన ముందుమాటలో రాసిన మాటలే, భావాలే! ముందు అట్టమీద, జార్జి ఫోటో కింద, సందర్భానికి తగినట్టు ఉండాలని, శ్రీశ్రీ, తన మిత్రుడు 'కొంపెల్ల జనార్దనరావు' కోసం రాసిన, నివాళి కవితలో నించీ, కొన్ని మాటలు తీసి పెట్టాను. వెనక అట్టమీద, వరవరరావు గారు జార్జిరెడ్డి మీద, ఈ పుస్తకానికి అని కాకుండా, అంతకు ముందే రాసిన కవితని వేశాను.

ఇకపోతే, ప్రత్యేకంగా చెప్పవలిసింది, ఈ పుస్తకంలో, ఇచ్చిన కొటేషన్ల గురించి. శ్రీశ్రీ, చలం గార్ల మాటల్ని ఇచ్చాను. అవి ఎక్కువగా ఇవ్వడానికి ముఖ్య కారణం, నేను బియ్యేలో ఉన్నప్పటి (1967–70) నించే, చలం గారి రచనల్లోనించీ, ఆయన కమ్యూనిజం గురించి అనుకూలంగానూ, అపార్థంగానూ చెప్పిన మాటల్ని, కొన్ని కాయితాల మీద రాసుకునే వాణ్ణి. కమ్యూనిజానికి సంబంధించిన పుస్తకాలేవీ అంతకు ముందు చదవకపోయినా, చలం గారి రచనల వల్లనే, 'కమ్యూనిజం' గొప్ప సిద్ధాంతం అనే అభిప్రాయం బియ్యేలోనే నాకు ఏర్పడింది. ఎంత గట్టిగా అంటే, కమ్యూనిజానికి వ్యతిరేకంగా, చలం గారు రాసిన మాటల్ని కూడా పట్టించుకోనంతగా, ఇష్టపడ్డాను. తర్వాత రోజుల్లో, చలం గారికి రాసిన ఉత్తరాల్లో, కమ్యూనిజం గురించీ, జార్జి రెడ్డి హత్య గురించీ, సాయుధ పోరాటం గురించీ, చాలా ప్రస్తావనలు వచ్చాయి. అవి చదివి, చలం గారు, 'ఇది వరకు నీ ఉత్తరాలలో, తెల్లగడ్డి పూలూ, కాంపస్ సౌందర్యమూ కనిపించేవి. ఈ మధ్య తెల్లగడ్డి పూలు పూయడం లేదా మీ కాంపస్‌లో? సాయుధ పోరాటం అంటున్నావు?' అనే రకంగా రాశారు, కొంత విమర్శతో.

○ బి.ఆర్. బాపూజీ

(ఏప్రిల్ 14: జార్జి రెడ్డి వర్ధంతి)

ట్రంప్ : మన కాలం పరాజితుడు!



■ పి. చిదంబరం

'పళని' పలుకు

నిఘంటువుల ప్రకారం 'టారిఫ్' (సుంకం) అనే పదం ఒక నామవాచకం. ఒక దేశంలోకి ఇతర దేశాల నుంచి వచ్చే సరుకులపై విధించే ఒక పన్ను. కొన్ని సమయాలలో ఎగుమతులపై కూడా ఒక పన్ను విధిస్తారు. చాలా అరుదుగా మాత్రమే 'టారిఫ్'ను ఒక క్రియగా ఉపయోగించడం జరుగుతుంది. అయితే ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ పుణ్యమా అని ఆ పదాన్ని క్రియగా ఉపయోగించడం అధికమయింది. కేవలం పెంగ్విన్ పక్షులు మాత్రమే ఉండే హేయర్డ్, మెక్ డోనాల్డ్ అనే దీవులతో సహా ప్రపంచ దేశాలు అన్నిటినీ ట్రంప్ మహాశయుడు దిగ్భ్రాంతికరంగా సుంకాలకు గురి చేశారు. పెంగ్విన్ పక్షులు అమెరికాకు ఎగుమతి చేసేవి ఏమి ఉంటాయని అవి ఉండే దీవులపై ట్రంప్ సుంకాలు విధించాడు? ప్రపంచ ప్రజలు నవ్వుకుంటున్న ట్రంప్ చర్య ఇది.

అమెరికాకు దిగుమతి అయ్యే సరుకులపై కఠిన, భారీ సుంకాలు అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా రూపొందిస్తాయని (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఏప్రిల్ 2, 2025న సకల దేశాలపై విధించిన సుంకాల వివరాలను ట్రంప్ ప్రకటించారు. సుంకాలను ప్రకటిస్తున్న సమయంలో ఆయన ఒక పెద్ద చార్ట్‌ను చూపించారు. సుంకాల సూక్ష్మాలు వెర్రిబాగులవాళ్లకు కూడా అర్థమయ్యే విధంగా ఒక సరళ సూత్రం ప్రాతిపదికన ఆ సుంకాలను అంచనా కట్టి ఉంటారని స్పష్టమయింది. సదరు సూత్రం ఏదైనా దేశంతో అమెరికాకు ఉన్న వాణిజ్య లోటును లెక్కించారు. ఆ వాణిజ్య లోటును ఆ దేశం నుంచి అమెరికా దిగుమతి చేసుకునే వస్తువుల మొత్తం విలువతో భాగించారు. ఆ వచ్చిన సంఖ్యను రెండుతో భాగించగా వచ్చిన ఫలితమే ట్రంప్ విధించిన సుంకం. కాగా కొన్ని దేశాల విషయంలో ఈ సరళ సూత్రాన్ని ఉపయోగించలేదు.

2024 అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికలలో ఒక ప్రశ్నకు ఎనలేని ప్రాధాన్యం లభించింది: ఏడు స్వింగ్ స్టేట్స్‌నూ లేదా వాటిలో ఎక్కువ రాష్ట్రాలను ఎవరు గెలుచుకుంటారు? ఇవీ ఆ ఏడు రాష్ట్రాలు: అరిజోనా, జార్జియా, మిచిగాన్, నేవడా, ఉత్తర కరోలినా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్. ఈ ఏడు రాష్ట్రాలనూ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ గెలుచుకున్నారు. తద్వారా 93 ఎలెక్టోరల్ ఓట్లను ఆయన స్వాయత్తం చేసుకున్నారు. ఈ ఏడు రాష్ట్రాలలో గెలుపు డోనాల్డ్ ట్రంప్ రెండో రాకడకు విశేషంగా దోహదం చేసింది. ఈ ఏడు రాష్ట్రాలకూ కొన్ని ఉమ్మడి లక్షణాలు ఉన్నాయి. అవి పారిశ్రామిక కార్యకలాపాలు చెప్పుకోదగిన స్థాయిలో లేకపోవడం, నిరుద్యోగిత భారీగా ఉండడం, ప్రజా చర్చలు అన్నీ ద్రవ్యోల్బణం వలసలు తదితర అంశాలపైనే జరగడం. ఈ ఏడు రాష్ట్రాలలోనూ తిరుగులేని విజయం సాధించిన ట్రంప్, ఆ రాష్ట్రాల ప్రజలను కలవర పెడుతున్న సమస్యలే సమస్త అమెరికా ప్రజలను చికాకు పరుస్తున్నాయని భావించారు. ఈ కారణంగా ఆయన ఆ సమస్యలను తొలగించేందుకు సంకల్పించారు.

ద్వితీయ ప్రపంచ యుద్ధం ముగిసి ఎనభై సంవత్సరాలు గడిచి పోయాయి. ఈ ఎనిమిది దశాబ్దాలలో కార్మిక శ్రేణుల, సరుకుల, సేవల స్వేచ్ఛా గమనం వల్ల ప్రపంచం బాగా లబ్ధి పొందింది. ఇతోధికంగా ప్రయోజనం పొందిన దేశం నిస్సందేహంగా అమెరికాయే. అమెరికా మహా సంపన్న దేశం. మహాశక్తిమంతమైన దేశం. వైజ్ఞానిక, సాంకేతిక నవకల్పనలు అన్నీ ఆ దేశ ప్రతిభా ఫలాలే. ప్రపంచ అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, ప్రయోగశాలలు, ఉత్కృష్ట కంపెనీలు అమెరికా లోనే ఉన్నాయి. అమెరికా డాలర్ రిజర్వ్ కరెన్సీగా ప్రపంచ దేశాల ఆమోదం పొందింది. అమెరికా గ్రీన్ కార్డ్, అమెరికా పాస్‌పోర్ట్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది ఆకాంక్షిస్తున్న డాక్యుమెంట్లు. చైనా, ఇండియాతో సహా అనేక దేశాలు తమ విదేశ మారక ద్రవ్య నిల్వలలో అత్యధిక భాగాన్ని అమెరికా బాండ్ల రూపంలో భద్రపరచుకుంటున్నాయి. ప్రపంచంలో ద్రవ్యలోటు లేని ఏకైక దేశం అమెరికాయే గనుక ఆ దేశ బాండ్లు తమకు ఆర్థిక భద్రత సమకూరుస్తాయని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. దురదృష్టవశాత్తు ఈ ఉత్కృష్ట ఘనతలు ఏవీ తమ జీవితాలకు ఎలాంటి లబ్ధిని సమకూర్చడం లేదని ట్రంప్‌ను గెలిపించిన ఏడు రాష్ట్రాల ప్రజలు భావిస్తున్నారు. ట్రంప్ మహాశయుడు వాస్తవాలను ఉపేక్షించి అతన విజయానికి దోహదం చేసిన ఆ ఏడు రాష్ట్రాల ఓటర్లను విశ్వసించారు.

అమెరికా అధ్యక్షుడుగా రెండో సారి పదవీ ప్రమాణ స్వీకారం చేసిన తరువాత డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు, చర్యలు సంచలనం కలిగిస్తున్నాయి. వాటి పర్యవసానాలు సుదీర్ఘకాలం అమెరికా సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయనున్నాయి. దేశదేశాల నుంచి ప్రతిభావంతుల వలసలు అమెరికాకు నిలిచిపోనప్పటికీ తగ్గుముఖం పడతాయి. సరుకుల వాణిజ్యానికి గణనీయమైన విఘాతం కలుగుతుంది. సరఫరా గొలుసుల అంతరాయాలు పెరుగుతాయి. సేవల వాణిజ్యానికి సైతం కనీసం తాత్కాలికంగా నష్టం వాటిల్లుతుంది పెట్టుబడుల ప్రవాహాలు కొత్త సుంకాలు, ప్రతి సుంకాలకు అనుగుణంగా సర్దుబాటు అయ్యేందుకు కొంత కాలం పడుతుంది.

ట్రంప్ విధానాల పర్యవసానాలను ఎదుర్కోవడంలో చాలా సంపన్న దేశాలు చాలా సంయమనంతో వ్యవహరిస్తున్నాయి. ట్రంప్ ఏవో భ్రమలతో దబాయిస్తున్నారని అందరికీ అర్థమవుతుంది. అమెరికాలోకి దిగుమతి అవుతున్న సరుకులపై భారీ సుంకాలతో సంభవించే ధరల పెరుగుదలను అమెరికా ప్రజలు భరించలేరు. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతుంది. లక్షలాది ప్రజలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదమున్నది. ఇటువంటి పరిస్థితులను అమెరికా ప్రజలు సహించరు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్‌ను విశ్వసిస్తున్న అమెరికన్లు కూడా ద్రవ్యోల్బణం తాకిడికి తీవ్రంగా గురవుతారు. ఇప్పటికే అమెరికా వ్యాప్తంగా అన్ని పెద్ద నగరాలలోను వేలాది ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత పెరిగినప్పుడు (ఇది ఖాయం) మరింత మంది ప్రజలు వీధుల్లోకి వెల్లువెత్తుతారు. అమెరికా ప్రజల ఆగ్రహావేశాలకు ట్రంప్ ఎలా ప్రతిస్పందించనున్నారు? తన విధానాల కొనసాగింపుపై వెనకడుగు వేస్తారు, సందేహం లేదు. ఏప్రిల్ 9న సుంకాల అమలును నిలిపివేసినట్టే ఇదీ జరుగుతుంది. కొన్ని అనూహ్య పరిణామాలు కూడా చోటు చేసుకునే అవకాశమున్నది మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ సిద్ధాంతాన్ని సమర్థిస్తున్న వారు సుంకాల పర్యవసానాలకు ఎలా ప్రతిస్పందిస్తారు, అమెరికా బాండ్లపై వడ్డీ రేట్ల తీరుతెన్నులను ఆయన తప్పక పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది.



> ట్రంప్ సుంకాలతో ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెడుతోందని ఆర్థికవేత్తలు చాలా మంది గట్టిగా అభిప్రాయపడుతున్నారు. ఇండియా పరిస్థితి ఏమిటి? మాంద్యం, ద్రవ్యోల్బణం, ఎగుమతుల తగ్గుదల, తక్కువ ఎఫ్‌పిఐ, ఎఫ్‌డిఐ ఒకేసారి సంభవిస్తే వాటిల్లే హాని కంటే అధికంగా మన ఆర్థిక వ్యవస్థ అధ్వానమవుతుంది. అంతిమంగా అర్థ శాస్త్ర సూత్రాలు ట్రంప్ విధానాలను ఓడిస్తాయి. ఆ విజయోత్సవ వేళ, భారత్ పరాజితుడి పక్షాన నిలిచిందనే భావన ఎవరికీ కలగ కూడదు.

సరే, ట్రంప్ సుంకాల దెబ్బను ముఖ్యమైన దేశాలు కొన్ని ఎలా ప్రతి స్పందిస్తున్నాయో చూద్దాం. కెనడా, యూరోప్ గట్టిగా నిలబడ్డాయి, దృఢంగా ప్రతిఘటిస్తున్నాయి. అదే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నాయి. అమెరికాపై భారీ సుంకాలు విధించేందుకు చైనా గట్టి పట్టుదలతో ఉన్నది. సుంకాల సమరాన్ని అమెరికా అనివార్యం చేస్తే, చైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. రాజీ లేని పోరుకు బీజింగ్ సమాయత్తమై ఉన్నది. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధంపై భారత్ ఇంతవరకూ ఎటువంటి వ్యాఖ్య చేయలేదు. అమెరికాతో ఒక వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. మంచిదే. అయితే ట్రంప్ ధాటికి ఇండియా హడలి పోతున్నదనే భావన ప్రపంచానికి కలిగించ కూడదు. మోదీ ప్రభుత్వం ఈ విషయమై జాగరూకతతో వ్యవహరించాలి. ట్రంప్ సుంకాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏమి సంభవించినా తాము కలత చెందమనే భావంతో ఉండిపోకూడదు. ట్రంప్ నిర్ణయాలు, చర్యలపై న్యూఢిల్లీ కచ్చితంగా ఒక స్పష్టమైన వైఖరి తీసుకోవాలి. యూరోపియన్ నాయకులు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, కెయిర్ స్టార్మెర్, కెనడా ప్రధానమంత్రి కార్నే తదితర నాయకులు అనుసరిస్తున్న విధానాలను స్ఫూర్తిగా తీసుకోవాలి. వారితో కలిసి నడవడం శ్రేయస్కరం.

ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో అందరూ సంతోషిస్తున్నారు. ఈ యుద్ధ విరామంతో, ఆయనను ఆర్థిక వివేకం ప్రభావితం చేయగలదనే ఆశాభావం ఎంతైనా కలుగుతోంది. అయితే ఈ 'నిలిపివేత'ను ఉపసంహరించి, ఏప్రిల్ 2న ప్రకటించిన సుంకాలను ట్రంప్ మళ్లీ విధిస్తే జరిగేదేమిటి? ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తలకిందులు అవుతుంది, సందేహం లేదు. ట్రంప్ విధానాలతో ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెడుతోందని ఆర్థికవేత్తలు చాలా మంది గట్టిగా అభిప్రాయపడుతున్నారు. ఆర్థిక మాంద్యం ముంచుకు వస్తోందని కూడా పలువురు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇండియా పరిస్థితి ఏమిటి? మాంద్యం, ద్రవ్యోల్బణం, ఎగుమతుల తగ్గుదల, తక్కువ ఎస్‌పిఐ (విదేశీ ప్రైవేట్ పెట్టుబడులు), తక్కువ ఎఫ్‌డిఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు) ఒకేసారి సంభవిస్తే వాటిల్లే హాని కంటే కూడా మన ఆర్థిక వ్యవస్థ అధ్వానమవుతుంది. భారత్ తన మిత్ర దేశాలను ఎంపిక చేసుకోవాలి. వాటితో వాణిజ్య సంబంధాలను పెంపొందించుకోవాలి అంతిమంగా అర్థ శాస్త్ర సూత్రాలు ట్రంప్ విధానాలను ఓడిస్తాయి. ఆ విజయోత్సవ వేళ, భారత్ పరాజితుడి పక్షాన నిలిచిందనే భావన ఎవరికీ కలగ కూడదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

సిక్కోలు విప్లవ సూరీడు

ఈ విప్లవాగ్నులు ఎచటవి అని అడిగితే శ్రీకాకుళం వైపు చూడమన్నారు. ఎరుపెక్కిన తూర్పు తీరం అమరుల త్యాగాల నెత్తుటి గురుతులు. అలాంటి త్యాగాల గడ్డపై పుట్టిన బిడ్డే పైలా వాసుదేవరావు. పంచాది కృష్ణమూర్తి, సుబ్బారావు పాణిగ్రహి, తామాడ గణపతి, ఆదిభట్ల కైలాసం, దేవినేని మల్లికార్జున్ లాంటి విప్లవోద్యమ రథసారథులలో పైలా వాసుదేవరావు ఒకరు. నూనూగు మీసాల నూత్న యవ్వనంలో కమ్యూనిస్టుగా మారాడు. కాశీబుగ్గకు మూడు కిలోమీటర్ల దూరంలోని రిట్టపాడు పల్లెలో పైలా వాసుదేవరావు ఆగస్టు 11, 1932న జన్మించారు. విద్యార్థి దశనుంచే కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు ఏర్పడ్డాయి. విద్యార్థి దశలోనే అదే గ్రామానికి చెందిన డిబికే చౌదరి ద్వారా 1952 నాటికి కమ్యూనిస్టు పార్టీకి పరిచయమయ్యారు. పైలా తన 21వ ఏట 1953లో ఆనాటి సిపిఐ కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. కాశీబుగ్గ హైస్కూల్లో ఎస్.ఎస్.ఎల్.సి చదివి, సర్వేయర్‌గా మందసా సమితిలో ఉద్యోగం సంపాదించారు. ఆనాడు మందసా సమితి కమ్యూనిస్టు పార్టీ బలపరిచిన అభ్యర్థిగా మజ్జి తులసీదాసు సమితి అధ్యక్షులుగా ఉన్నారు. మజ్జి తులసీదాస్ గ్రామీణ ప్రాంతాల్లో విప్లవోద్యమం విస్తరణకు ఉపాధ్యాయులు అవసరమని భావించి వాసుదేవరావుని ఉపాధ్యాయ రంగంలోకి తీసుకువచ్చారు. సోంపేట దగ్గర జీడిపుట్ట గ్రామంలో పైలా తొలిసారి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. ఆనాటికే బొడ్డపాడు కేంద్రంగా పంచాది కృష్ణమూర్తి, తామాడ గణపతి తదితర నాయకులు ఉద్దానం ప్రాంతంలో విప్లవకార్యక్రమాల్ని ప్రారంభించారు. బొడ్డపాడు పక్కగ్రామమైన మాకన్నపల్లికి పైలాని బదిలీపై తీసుకొచ్చింది పార్టీ. అక్కడే పగలు పాఠాలు నేర్పారు. రాత్రుళ్ళు విద్యార్థులను, యువకులను, రైతులను కూడగట్టి విప్లవపాఠాలు నేర్పారు పైలా. మట్టి పాకలో ఉన్న పాఠశాల స్థానంలో గ్రామప్రజల సహకారంతో పక్కా భవనం నిర్మించారు. పాఠశాల భవన నిర్మాణంలో పైలా వాసుదేవరావు తాపీ పనివారికి సహకారంగా తను ఒక కూలివాడిగా మారారు. చుక్కనీరు లేక జనం అల్లాడిపోతున్న సమయంలో ప్రమాదకరమైన పాడుబడ్డ బావిలోకి ప్రాణాలకు తెగించి దిగి, పూడిక తీసి మాకన్నపల్లి యువతరాన్ని తట్టిలేపారు పైలా మాష్టారు. తరువాత ఉపాధ్యాయ వృత్తికి కూడా రాజీనామా చేసి ఉద్యమంలో మమేకమయ్యారు. అనతి కాలంలోనే మాకన్నపల్లి లోనూ, చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలకు తలలో నాలుకలా మారారు పైలా మాష్టారు.

పార్టీ పూర్తికాలం కార్యకర్తగా మారిన పైలా వాసు, గొరకల రాంబాబు టీ కొట్టు కేంద్రంగా రాజాం పరిసర ప్రాంత ప్రజలను ఆర్గనైజ్ చేశారు. నందిగాం, టెక్కలి, మెలియాపుట్టి, వజ్రపు కొత్తూరు మండలాల ప్రజలను పార్టీ కార్యక్రమాల వైపు తిప్పారు. వ్యవసాయ కూలి రంగంలో పనిచేస్తున్న క్రమంలో మిలిటెంట్ ఉద్యమ నిర్మాణానికి పార్టీ పిలుపునిచ్చింది. ఆ క్రమంలోనే 1968 నవంబర్ 25న శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటం ప్రారంభమయింది. గిరిజన రైతాంగ పోరాటం ప్రారంభంలో అజ్ఞాతవాసంలోకి వెళ్ళిన పైలా మరణించే వరకూ 42 సంవత్సరాల పాటు రహస్య జీవితాన్ని గడిపారు. ఆనాటికి దళ సభ్యురాలైన చంద్రక్కను 1970లో వివాహమాడారు. ఎమర్జెన్సీ కాలంలో పట్టుబడ్డ సహచరి చంద్రమ్మ జైలులో ఉంది. పుట్టిన బిడ్డను అమరుడు అత్తలూరి మల్లికార్జునరావు కుటుంబానికి ఇచ్చేసి పేగు బంధం కన్నా విప్లవ బంధమే గొప్పదని రుజువు చేశారు పైలా సహచరులు. వెయ్యి కత్తి వేట్లకు సైతం చలించని మొండి మనిషి పైలా.

నక్సల్బరీకి సమాంతరంగా సాగిన శ్రీకాకుళ గిరిజన సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచం దృష్టిని ఆకర్షించిందనడంలో అతిశయోక్తి లేదు. శ్రీకాకుళ పోరాటం భారతదేశ విముక్తికి దారితీస్తోందన్న చైనా అధికారిక మాధ్యమం పెకింగ్ రేడియో ప్రకటనే ఆ ఉద్యమ తీవ్రతకు తార్కాణం. ఉద్యమాల వనం ఉద్దానంలో రాజుకున్న నిప్పురవ్వ తెలుగు రాష్ట్రాన్నే కాదు యావత్ దేశాన్నీ కదలించింది. డాక్టర్లు, ఇంజనీర్లు మహా మహా మేధావులెందరినో శ్రీకాకుళం వైపు పరుగులు తీసేలా చేసింది. 1970 ప్రాంతానికి శ్రీకాకుళ ఉద్యమం తీవ్రమైన అణచివేతకు గురైంది, తీవ్రమైన నష్టాలు చవి చూసింది. పార్టీ అగ్ర నాయకులైన వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, తామాడ గణపతి, సుబ్బారావు పాణిగ్రహి, పంచాది కృష్ణమూర్తి, నిర్మల అంకమ్మ, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ భాస్కరరావు వంటి ముఖ్య నాయకులు అమరులయ్యారు. రాజాం గ్రామానికి చెంది పొందాల బాలకృష్ణ, నిరంజన్ సాహూ వంటి ఇంజనీర్లు, లాయర్లు, డాక్టర్లు అమరులయ్యారు. పచ్చపచ్చని శ్రీకాకుళం అడవుల్లో వెచ్చని నెత్తురు పారుతున్న కాలమది.



> కనిపిస్తే కాల్చివేతలు కొనసాగుతున్న కాలంలో పైలా వాసుదేవరావు పార్టీ పునర్‌నిర్మాణం కోసం సాహసోపేతంగా కృషిచేశారు. మేరంగిలో ఇద్దరు కొరియర్ల సహకారంతో పార్వతిపురం ప్రాంతంలో గొర్ల కాపరి వేషధారణలో గోచిపోతా కట్టుకొని, భుజాన కావిడి పెట్టుకుని, చేత కర్ర పట్టుకొని గ్రామగ్రామాలు తిరిగారు. ఆదివాసి ప్రాంతంలో ఆదివాసి వేషధారణతో తిరిగి అక్కడ దళాలను కాంటాక్ట్ అయ్యారు. 1971 నాటికి మిగిలి ఉన్న అందర్నీ కూడదీసి పార్టీని పునర్‌నిర్మించారు.

అటువంటి విప్లవోద్యమం పోలీసు నిర్బంధాలకు గురైనప్పుడు, కనిపిస్తే కాల్చివేతలు కొనసాగుతున్న కాలంలో పైలా వాసుదేవరావు పార్టీ పునర్‌నిర్మాణం కోసం సాహసోపేతంగా కృషిచేశారు. మేరంగిలో ఇద్దరు కొరియర్ల సహకారంతో పార్వతిపురం ప్రాంతంలో గొర్ల కాపరి వేషధారణలో గోచిపోతా కట్టుకొని, భుజాన కావిడి పెట్టుకుని, చేత కర్ర పట్టుకొని గ్రామగ్రామాలు తిరిగారు. ఆదివాసి ప్రాంతంలో ఆదివాసి వేషధారణతో తిరిగి అక్కడ దళాలను కాంటాక్ట్ అయ్యారు. ఆరిక సోములను, రాజారాం రెడ్డిని కలుసుకొని శ్రీకాకుళం రీజనల్ కమిటీని ఏర్పాటు చేశారు. 1971 నాటికి మిగిలి ఉన్న అందర్నీ కూడదీసి పార్టీని పునర్‌నిర్మించారు.


కేజీ సత్యమూర్తిని కలిసారు. చారుతో విభేదించి బయటకు వచ్చి 1973లో చంద్ర పుల్లారెడ్డితో చర్చలు కొనసాగించారు. 1975లో సీపీ వర్గంతో విలీనమయ్యారు. నీలం రామచంద్రయ్య అమరులైన తర్వాత 1976లో సిపిఐ-ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శిగా పైలా ఎన్నికయ్యారు. 1989 వరకు రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగారు. ఆయన త్యాగానికి, ఆదర్శాలకు, నిబద్ధతకు నిలువెత్తు దర్పణం. పైలా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. మచ్చలేని మహానాయకుడు, విప్లవోద్యమమే ఊపిరిగా శ్వాసించి, జీవితాంతం ప్రజల కోసమే పరితపించిన నిస్వార్థనాయకుడు. పార్వతీపురం కుట్ర కేసులో అరెస్టు కాకుండా గెలిచి నిలిచిన అజ్ఞాత విప్లవ సూరీడు. నిజాయితీ, నిబద్ధత, ఆత్మవిశ్వాసంతో ఆరు దశాబ్దాలు అవిరామంగా ప్రజల కొరకు పని చేసిన నిఖార్సైన విప్లవకారుడు పైలా. ఆయన జీవితం భవిష్యత్ తరాల విప్లవకారులకు ఆదర్శనీయం.

■ వంకల మాధవరావు

సిపిఐ-ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు


(ఏప్రిల్ 13: పలాసలో పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభ)

నవభారత పథనిర్దేశకుడు



"శీలం లేని వ్యక్తి ప్రజావిశ్వాసానికి పాత్రుడు కాలేడు". "విద్య ప్రజాబాహుళ్యానికి పూర్తిగా విస్తరించనిదే జాతీయాభ్యున్నతి లేదు". "శీలం లోపించినా, క్రమశిక్షణ కొరవడినా... కార్యదక్షత విధిగా కుంటుపడుతుంది" అని మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన ఆత్మకథ "మెమోయిర్స్ ఆఫ్ మై వర్కింగ్ లైఫ్"లో భాషించారు. కనుకనే ఇంత కాలం ఆయన్ని దేశం గుర్తుపెట్టుకుంది. ఆయన పుట్టినరోజుని 'ఇంజనీర్స్ డే'గా భారత ప్రభుత్వం ప్రకటించింది. 1909లో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేయమని విశ్వేశ్వరయ్యకు మైసూర్ మహారాజు నుంచి ఆహ్వానం వచ్చినప్పుడు కేవలం ఇంజనీర్‌గానే నా సేవలు కావాలా? పరిశ్రమలు పెంచటం, సాంకేతిక విద్యని విస్తరించటం లాంటి విషయాల్లో నా సేవలు వినియోగించటానికి అవకాశం ఇస్తారా? అని అడిగి మరీ తన సమ్మతి తెలియజేసిన ఆయన, ఆ తర్వాత దివాన్ పదవి స్వీకరించమన్నప్పుడు దైనందిన కార్యక్రమాల్లో తన శక్తిని వృథా చేయటం కంటే విద్య, పరిశ్రమల అభివృద్ధికి తన శక్తిని వినియోగిస్తానని చెప్పి, అలాగే చేసిన వ్యక్తి. మైసూర్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా అనేక విద్యాలయాల్ని ప్రారంభింపజేశాడు. విద్య– ప్రత్యేకించి సాంకేతిక విద్య లేని జాతికి అభివృద్ధి లేదని ఆయన విశ్వాసం, ఆ చర్యల కారణంగా ఈ రోజు దేశం అభివృద్ధి ఫలాల్ని అనుభవిస్తున్నది. అసంఖ్యాక పురస్కారాలే గాక, 1955లో భారతరత్న అందుకున్నారు విశ్వేశ్వరయ్య. 102 సంవత్సరాల 6 నెలలు జీవించి, 1962 ఏప్రిల్ 14న మరణించారు.

– సి. సృజన





యాప్‌రే..!

బెట్టింగ్ కేసుల్లో పోలీసులకు సవాల్‌గా యాప్‌లు



- టెక్నాలజీతో మభ్య పెడుతున్న బెట్టింగ్‌బాబులు
- చేతిలో డబ్బు కనిపించకుండా పందేలు
- కీలకమైన యాప్‌ల సృష్టి.. వాటిద్వారా లావాదేవీలు
- మూలాలు వెతికే పనిలో పోలీసులు

రూ.లక్షల్లో బెట్టింగ్‌లు కడతారు.. అంతకు రెట్టింపు సంఖ్యలో గెలుస్తారు.. కొందరేమో ఓడిపోతారు.. అయినా ఎవరి జేబులోనూ రూపాయి కనిపించదు. క్రికెట్ బెట్టింగ్ కేసుల్లో పోలీసులకు ఈ అంశం సవాల్‌గా మారింది. సాంకేతికతను చక్కగా ఉపయోగించుకుంటున్న బెట్టింగ్‌బాబులు ఎక్కడికక్కడ నగదు రూపంలో కనిపించకుండా, యాప్‌ల రూపంలో లావాదేవీలు నిర్వహిస్తుండటంతో ఆ మూలాలు పసిగట్టే పనిలో పోలీసులు తలమునకలయ్యారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పోలీసుల వేట ఎక్కువయ్యే సరికి క్రికెట్ బెట్టింగ్ గ్యాంగ్‌లు రూటు మార్చాయి. పోలీసులకు చిక్కినా చిల్లిగవ్వ దొరక్కుండా టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నాయి. ఇదే ఇప్పుడు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. ఇప్పటి వరకు చట్టాలు, సెక్షన్ల కోసం పుస్తకాలను తిరగేసిన పోలీసులు ఈ బెట్టింగ్ కేసులతో సైబర్ ఫోరెన్సిక్ పుస్తకాలను పట్టుకుంటున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుట్టురట్టు చేసిన బుకీలు, ప్లంటర్లను సంబంధిత పోలీస్‌స్టేషన్లలో అప్పగిస్తున్నారు.

సాంకేతిక మూలాలు ఎక్కడ?

టాస్క్‌ఫోర్స్ పోలీసులు తాజాగా ఎనిమిది మంది బెట్టింగ్‌బాబులను అరెస్టు చేసి పటమట పోలీసులకు అప్పగించారు. వీరంతా రాధే ఎక్స్ఛేంజ్ యాప్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు తేలింది. ఇటీవల అవనిగడ్డకు చెందిన ఐదుగురిని అరెస్టు చేయగా, వారంతా పార్కర్ ఎక్స్ఛేంజ్ యాప్‌లో పందేలు కడుతున్నట్టు గుర్తించారు. ఇలా బెట్టింగ్‌లు నిర్వహించే ప్రధాన బుకీలు ప్రత్యేకంగా యాప్‌ను తయారు చేయించుకుంటున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇలా ఒక్కో బుకీ సొంత యాప్‌ల ద్వారా క్రికెట్‌పై లక్షలాది రూపాయలను వెనుకేసుకుంటున్నారు. ఇప్పటి వరకు పోలీసులకు బుకీల్లో మూడు, నాలుగు దశల్లో ఉన్నవారే దొరుకుతున్నారు. వారికి డబ్బు వసూలు చేసి ఇచ్చే ఏజెంట్లు చిక్కుతున్నారు. ప్రధాన బుకీలు మాత్రం చిక్కడం లేదు. ఏ యాప్ ద్వారా పందేలు జరుగుతున్నాయో తేలినా వాటికి సంబంధించిన సాంకేతిక మూలాలు దొరకడం పోలీసులకు కష్టసాధ్యంగా మారుతోంది. అయినా వాటి గురించి తెలుసుకుంటున్నారు.

కమీషన్ రూపంలో వసూలు

ప్రధాన బుకీలు ఎక్కడ ఉంటారో తెలియదు. వారి కింద మాత్రం దశలవారీగా సబ్‌బుకీలు ఉంటారు. ఈ సబ్‌బుకీల దిగువన ప్లంటర్లు పనిచేస్తున్నారు. బెట్టింగ్‌లో పాల్గొన్నవారు ఎంత ఇవ్వాలి, గెలిచిన వారికి ఎంత చెల్లించాలి.. అనే లెక్కలు మొత్తం యాప్‌ల్లో ఉంటున్నాయి. ఓడిన వారి నుంచి డబ్బు వసూలు చేసే బాధ్యతలను ప్లంటర్లు తీసుకుంటున్నారు. ఆటగాళ్ల దగ్గర నుంచి డబ్బు వసూలు చేసి సబ్‌బుకీలకు ఇచ్చిన వారికి లక్షకు రూ.1,000 కమీషన్ చెల్లిస్తున్నారు. ఆటగాళ్లందరి నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బు వసూలు చేసి అప్పగించిన వారికి లక్షకు రూ.3 వేలు చెల్లిస్తున్నారు. ఈ డబ్బును వెంటవెంటనే ఖాతాల్లో జమ చేసుకుని ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.

విదేశాల్లో కాకినాడ బుకీ?

గన్నవరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసిన ఎనిమిది మంది సబ్‌బుకీలకు యాప్‌లో ప్రవేశాలకు అనుమతి ఇచ్చిన కాకినాడకు చెందిన ప్రధాన బుకీ పండును పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. విదేశాల్లో ఉంటూ బెట్టింగ్ వ్యవహారాన్ని నడిపిస్తున్నాడని సమాచారం. ఈ పండునే.. రాధే ఎక్స్ఛేంజ్ యాప్ ద్వారా బెట్టింగ్ నడుపుతున్నాడు. ఈ యాప్‌కు అనుసంధానమైన కొంతమందిని వరంగల్ పోలీసులు పట్టుకున్నట్టు తెలిసింది. ఆ దెబ్బకు పండు విదేశాలకు చెక్కేశాడని అనుమానిస్తున్నారు.

● కల్యాణం.. కమనీయం..

విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శుక్రవారం రాత్రి ఆది దంపతుల కల్యాణం కనులపండువగా జరిగింది. చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గంగా సమేత దుర్గామల్లేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానాచార్యుడు శివప్రసాద్‌శర్మ, ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, మల్లేశ్వరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు. - ఇంద్రకీలాద్రి

దొంగబిల్లులు రద్దు

ఆంధ్రజ్యోతి కథనంతో నిలిచిన దొంగబిల్లుల ఆమోదం


మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

- పూర్తి వివరాలు లేవని తిరస్కరించిన మేయర్
- మారుమాట్లాడని స్టాండింగ్ కమిటీ సభ్యులు
- అధికారులే ఈ ప్రతిపాదనలు పెట్టారని ఎదురుదాడి
- 38 అంశాలకు గానూ 34 అంశాలు ఆమోదం

కార్పొరేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు దొంగబిల్లుల ఆమోద ప్రతిపాదనలను కార్పొరేషన్ పాలకపక్షం రద్దు చేసింది. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన 'దొంగ బిల్లుల దోపిడీ' కథనంపై పాలకపక్షం అప్రమత్తమైంది. తేలు కుట్టిన దొంగలా వ్యవహరించింది. శుక్రవారం సాయంత్రం మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్థాయీసంఘ సమావేశంలో ఈ దొంగబిల్లులను తిరస్కరించారు. శాని టేషన్ పనులకు సంబంధించి పూర్తి వివరాలు లేనందున బిల్లులను రద్దు చేయటం జరిగిందని తీర్మానించారు. తమ తప్పేమీ లేదన్నట్టుగా పాలకపక్షం వ్యవహరించటం గమనార్హం.

ఇది రెండోసారి

ఈ బిల్లులను ఇప్పటికి రెండుసార్లు స్థాయీసంఘం ముందుకు తీసుకొచ్చినా తిరస్కరించారు. మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర కూడా పలుమార్లు పక్కన పెట్టారు. ఈ బిల్లులను స్టాండింగ్ కమిటీ సమావేశంలో అధికారులే ప్రవేశపెట్టారని వైసీపీ పాలకపక్ష సభ్యులు ఎదురుదాడి చేశారు. దొంగతనం బయటపడుతుందన్న ఉద్దేశంతో అధికారులను నిలదీయడం విమర్శలకు తావిచ్చింది. ఈ విషయం కమిషనర్ ధ్యానచంద్ర దృష్టికి కూడా వెళ్లడంతో ఆయన ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది.

ఆడిటింగ్ చేయరా?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బిల్లులపై ఆడిటింగ్ చేయించాల్సిన పాలకపక్షం వాటిని పట్టించుకోవట్లేదు. నాడు పారిశుధ్య కార్మికులు ఎంతమంది పనిచేశారు, వాటి ఆధారాలేంటి? ఎంతమంది మస్తర్లు వేశారు? వాటిలో శాస్త్రీయత ఎంత? ఎక్కడెక్కడ పనులు చేశారు? జియోట్యాగింగ్ చేశారా? వారికేమైనా తాత్కాలిక ఐడీలు ఇచ్చారా? ఆ ఐడీల ప్రకారం సంస్థ అంతర్గత సర్వర్ల ద్వారా ఏమైనా డేటా లభించే అవకాశముందా? నిర్దేశిత ప్రాంతాల్లో విధులు కేటాయించిన వారు ఎక్కడెక్కడ పనిచేశారన్నదానికి సీసీ ఫుటేజీ పరిశీలన వంటివి చేయించాల్సిన పాలకపక్షం ప్రతిసారీ అడ్డదారిలో బిల్లులు పెట్టించేలా వ్యవహరించటంపై విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. కాగా, ఈ స్టాండింగ్ కమిటీ సమావే శంలో మొత్తం 38 అంశాలపై చర్చ జరగ్గా, 34 అంశాలకు ఆమోదముద్ర వేశారు. ఒక అంశం రికార్డు చేయడంతో పాటు పరిపాలనాపరమైన అంశాలకు సంబంధించి ఒక అంశాన్ని ధ్రువీకరించారు. పార్కింగ్, కర్మల భవనాలకు సంబంధించిన అంశాలను ఆమోదించారు.



వరద దుర్భేద్యం

- అమరావతిలో శరవేగంగా ముంపు నివారణ పనులు
- ప్రారంభమైన కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్ విస్తరణ
- సమాంతరంగా రిజర్వాయర్ల పనులు.. కాల్వల అనుసంధానం

8లో

స్పీడు పెంచండి

- విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూ సేకరణ జరిగింది 60 శాతమే
- మిగిలిన భూములను త్వరగా అప్పగించాలంటూ ఎన్‌హెచ్ లేఖ



గన్నవరంలో పిచ్చిమొక్కలు, పొదలతో నిరుపయోగంగా ఉన్న సబ్‌స్టేషన్

రూ.కోట్లు వృథా!?

సబ్ స్టేషన్ల నిర్మాణంలో ట్రాన్స్‌కో తీవ్ర నిర్లక్ష్యం

- గన్నవరంలో రూ.15 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణం
- వినియోగంలోకి తేకపోవడంతో అడవిని తలపిస్తున్న ఆవరణ
- కేసరపల్లి మేథ టవర్ దగ్గర రూ.132 కోట్లతో పనులు ప్రారంభం
- ఆ తర్వాత ఆగిపోయిన పనులు..గోప్యంగా వివరాలు
- ప్రణాళిక లేని పనులతో ప్రభుత్వ ఖజానాకు తూట్లు!
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో సబ్‌స్టేషన్ల దుస్థితిపై వ్యక్తమవుతున్న విమర్శలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఒక ప్రణాళిక లేకుండా పనులు చేయటం ట్రాన్స్‌కో అధికారులకు పరిపాటిగా మారింది. వారు చేస్తున్న పనుల వల్ల కోట్ల రూపాయలు వృథా అవుతున్నాయి తప్ప ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో చేపట్టిన సబ్‌స్టేషన్లలో కొన్ని ఎందుకు చేపడుతున్నారో మిగతా 6లో..

పకడ్బందీగా యూపీఎస్సీ పరీక్షలు

» రేపు నగరంలో జరిగే పరీక్షల ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష 6లో

వైకుంఠపురం-దాములూరు బ్యారేజీ ఎప్పుడు?

వైకుంఠపురం-దాములూరు బ్యారేజీ కోసం నందిగామ, జగ్గయ్యపేట, పెదకూరపాడు నియోజకవర్గాల ప్రజలు, రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాజధాని అమరావతి తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు ఈ మూడు నియోజకవర్గాల్లో తాగు, సాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు గతంలో టీడీపీ హయాంలో బ్యారేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, వైసీపీ ప్రభుత్వం తొక్కిపెట్టింది. తిరిగి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మెట్టప్రాంతాలకు వరప్రదాయినిగా ప్రతిపాదించిన బ్యారేజీ నిర్మాణంపై దృష్టి పెట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

జగ్గయ్యపేట, నందిగామ, పెదకూరపాడు నియోజకవర్గాలకు వరప్రదాయిని

- సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
- గతంలో టీడీపీ హయాంలో శంకుస్థాపన
- రూ.2,169 కోట్లతో నిర్మాణానికి శ్రీకారం
- వైసీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులు
- కూటమి ప్రభుత్వం రాకతో రైతుల్లో ఆశలు


బ్యారేజీ నిర్మాణానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన (ఫైల్ ఫొటో)

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల) : భవిష్యత్తులో అమరావతికి తాగునీటి ఇబ్బందులు రాకుండా గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పల్నాడు జిల్లా వైకుంఠపురం, ఎన్టీఆర్ జిల్లా దాములూరు మధ్య కృష్ణానదిపై బ్యారేజీని నిర్మించాలని నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువన 23 కిలోమీటర్ల దూరంలో, పులిచింతల ప్రాజెక్టుకు 60 కిలోమీటర్ల దిగువన పల్నాడు జిల్లా వైకుంఠపురం, ఎన్టీఆర్ జిల్లా దాములూరు మధ్య కృష్ణానదిపై దీనిని నిర్మించాలని యోచించారు. రూ.2,169 కోట్లతో 10 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ బ్యారేజీ నిర్మాణానికి 2018, ఫిబ్రవరి 13న వైకుంఠపురం వైపున శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టు సంస్థ నిర్మాణ పనులు కూడా ప్రారంభించింది. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ బ్యారేజీ నిర్మాణాన్ని పక్కన పెట్టేసింది. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బ్యారేజీ నిర్మాణంపై మెట్టప్రాంత ప్రజలు, రైతులు ఆశలు పెంచుకుంటున్నారు.

నీటి కష్టాలు తీరే దారి

ప్రకాశం బ్యారేజీ వద్ద కేవలం రెండు నుంచి మూడు టీఎంసీలకు మించి నీరు నిల్వ చేయటానికి వీలుపడట్లేదు. పులిచింతల ప్రాజెక్టు దిగువన కృష్ణానదిలో కలుస్తున్న మునేరు, పాలేరు, వైరాయేరు, కట్లేరు, యేనుగుగడ్డవాగు, పల్నాడు జిల్లాలో కలుస్తున్న బయ్యారం వాగు, మద్దూరు వాగు, ఇతరత్రా వాగులు, వంకల వరద నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది. ఈ నీటిని నిల్వ చేసి, రాజధానికి తాగునీరు అందించాలన్న లక్ష్యంతో గతంలో చంద్రబాబు.. ఈ బ్యారేజీ నిర్మాణానికి బీజం వేశారు. దీనివల్ల నందిగామ, జగ్గయ్యపేట, పెదకూరపాడు నియోజకవర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రాంతాల్లో కృష్ణానది, మునేరుతో పాటు పలు వాగులు, వంకలు ప్రవహిస్తున్నప్పటికీ సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పట్లేదు. చందర్లపాడు, కంచికచర్ల మండలాల వైపు కృష్ణానదిలో నీటి ప్రవాహం ఉండట్లేదు. వరదలొచ్చినపుడు మాత్రమే మిగతా 6లో..

పకడ్బందీగా యూపీఎస్సీ పరీక్షలు

» ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష



పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 13న నిర్వహించనున్న నేషనల్ డిఫెన్స్ అకాడమి (ఎన్‌డీఏ), నావెల్ అకాడమి (ఎన్ఏ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్షలను సూక్ష్మ పర్యవేక్షణలో నిర్వహించాలని, ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) ద్వారా నిర్వహించే పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో లైజన్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్‌వైజర్‌లు, లైజన్ కమ్ ఇన్‌స్పెక్టింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 13న ఎన్డీఏ, ఎన్ఏ, సీడీఎస్ పరీక్షలను యూపీఎస్సీ నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1,791 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, వీరిలో సీడీఎస్‌కు 577 మంది, ఎన్డీఏ, ఎన్ఏ పరీక్షలకు 1,214 మంది హాజరుకానున్నట్టు చెప్పారు. ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్డీఏ, ఎన్ఏ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందన్నారు. సీడీఎస్ పరీక్షలు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. పరీక్షల నిర్వహణకు 170 మంది ఇన్విజిలేటర్లు, ఆరుగురు వెన్యూ సూపర్‌వైజర్లు, ఆరుగురు లైజన్ అధికారులను నియమించినట్టు చెప్పారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు 30 నిమిషాలకు ముందుగానే చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. స్టేట్ అబ్జర్వర్ కె.ప్రశాంత్‌కుమార్, యూపీఎస్సీ అబ్జర్వర్ ఎన్.రాజేశ్వరరావు, బీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


చంద్రబాబుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న చలసాని ఆంజనేయులు

ఆలయ ప్రతిష్ఠ మహోత్సవానికి రండి

» ముఖ్యమంత్రికి చలసాని ఆహ్వానం

గన్నవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండలం వీరవల్లిలోని కృష్ణామిల్క్ యూనియన్-ప్రాజెక్టు కామధేను ప్రాంగణంలో నిర్మించిన సీతారామ లక్ష్మణ సమేత దాసాంజనేయస్వామి ప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని కోరుతూ సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వాన పత్రికను శుక్రవారం అందజేశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి ప్రజా వేదిక కార్యక్రమానికి విచ్చేసిన సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 16న జరిగే దాసాంజనేయస్వామి ప్రతిష్ఠ మహోత్సవానికి ఆహ్వానించారు. సీఎం సానుకూలంగా స్పందించినట్టు ఆంజనేయులు తెలిపారు.


ఈవోకు బంగారు హారాన్ని అందజేస్తున్న దాత దేవినేని సురేంద్ర, కుటుంబసభ్యులు

దుర్గమ్మకు బంగారు హారం కానుక

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మకు హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన దేవినేని సురేంద్ర 110 గ్రాముల బంగారుహారాన్ని కానుకగా ఈవో కె.రామచంద్రమోహన్‌కు శుక్రవారం అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు దాతలకు వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

నేడు గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి : ప్రతి పౌర్ణమినాడు జరిగే గిరిప్రదక్షిణ మాసవారీ ఉత్సవం శనివారం నిర్వహిస్తున్నట్టు దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులోని టోల్ గేట్ వద్ద కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఘాట్‌రోడ్ అమ్మవారిగుడి, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుంచి తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుతుందని ఈవో పేర్కొన్నారు.

పొన్నవరం సందర్శించిన విశ్రాంత సీజే ఎన్వీ రమణ



వీరులపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ శుక్రవారం తన స్వగ్రామమైన పొన్నవరాన్ని సందర్శించారు. తొలుత ఆయన తెలంగాణ రాష్ట్రంలోని జమలాపురంలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామానికి విచ్చేశారు. కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు, బంధువులతో ముచ్చటించారు. స్వగ్రామానికి రావడం సంతోషంగా ఉందన్నారు.

జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో నేత్ర వైద్య శిబిరాలు

» రేపు ప్రారంభించనున్న మంత్రి సత్యకుమార్

» ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ నేత టీడీ జనార్దన్ వెల్లడి


మాట్లాడుతున్న టీడీ జనార్దన్

జగ్గయ్యపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జయప్రద ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో ఉచితంగా నేత్ర వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత తొండెపు దశరథ జనార్దన్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎల్ఎస్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2018లో 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' నినాదం స్ఫూర్తితో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇటీవల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాల్లో అధికశాతం కంటి సమస్యలు ఉన్నట్టు తేలిందని, చిన్న పిల్లల్లో దృష్టి లోపాలు కనబడుతున్నాయని దీంతో శంకర్ నేత్రాలయంతో కలిసి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈనెల 13న జగ్గయ్యపేటలో వైద్య శిబిరాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభిస్తారని చెప్పారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, శంకర్ నేత్ర చికిత్సాలయ గ్రూప్ ఆఫ్ హస్పిటల్స్ ఎండీ డాక్టర్ నాదెళ్ల స్వాతి, రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతి విజయ్ చెన్నుపాటి, చైర్మన్ రంగాపురం రాఘవేంద్రలు హాజరవుతారన్నారు. అన్నిగ్రామాల్లో శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఉచిత పరీక్షలు, అవసరమైనవారికి మందులు, కళ్లజోళ్లు, శస్త్రచికిత్సలు ట్రస్టు ద్వారా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నేడు పనిచేయనున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నేడు అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేయనున్నాయి. రెండో శనివారం సెలవు దినం అయినప్పటికీ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశాల మేరకు నేడు అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేయనున్నాయి. రాష్ట్రస్థాయి కార్యాలయాలతో పాటు జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ పనిచేస్తాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రిజిస్ట్రేషన్ కార్యాలయాల సేవలు అందుబాటులో ఉండనున్నాయి. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవు కావటంతో.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండటం కోసం రెండో శనివారం పనిదినంగా ఉన్నతాధికారులు నిర్ణయించారు. అత్యవసరంగా రిజిస్ట్రేషన్లు చేయించుకునేవారు శనివారం రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

నాబార్డు, బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరు చేయించండి

వన్‌టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నాబార్డు, బ్యాంక్‌ల ద్వారా అర్హులైన వారికి రుణాలు ఇప్పించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య కాన్ఫరెన్స్ హాల్‌లో డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన రైతు ఉత్పత్తిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు మార్కెటింగ్ ఎలా నిర్వహించాలో వివరించారు. పాడి పశువులు, గొర్రెలు, మేకలను పెంచవచ్చని తెలిపారు. పత్తి, మిర్చి పండిస్తున్న రైతులు ప్రత్యామ్నాయ హార్టికల్చర్ పంటలు పండించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై యాక్షన్ ప్లాన్ తయారు చేయమని సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయానికి టెక్నాలజీ (డ్రోన్స్) ఉపయోగించమని తెలిపారు. ఈనెలలో జిల్లాలోని అన్ని మండలాల రైతు, ఉత్పత్తిదారుల సంస్థ అధికారులతో వర్క్‌షాప్‌ను నిర్వహించాలన్నారు. ఈ వర్క్‌షాప్‌కు కన్వర్జెన్స్‌కు సంబంధించిన విభాగ అధికారుల భాగస్వామ్యంతో కొత్త కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత విభాగాల అధికారులు, నాబార్డు ఏజీఎం, తదితరులు పాల్గొన్నారు.



రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్టుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.


కళాకారుల నృత్యం


పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు




ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం


ఎదుర్కోలు దృశ్యం


సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

వెనుకబడిన వర్గాల ఆర్థిక వృద్ధి లక్ష్యం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న లక్ష్మీశ

వన్‌టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన వర్గాల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కల్పిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక పురోగతిని సాధించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు ఆటోలు, ఆర్థిక సహాయం చెక్కులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీ, కాపు కార్పొరేషన్లు, ఆర్థికంగా వెనకబడిన తరగతుల లబ్ధిదారులకు సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 400 మంది లబ్ధిదారులకు రూ.8 కోట్ల 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించటం జరిగిందన్నారు. ఇందులో బీసీ కార్పొరేషన్ ద్వారా 200 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్ల 2 లక్షల బ్యాంక్ రుణాలను అందజేయటం జరిగిందన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద 150 మంది లబ్ధిదారులకు కోటి 50 లక్షల బ్యాంకు రుణాలను అందజేశామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకం లబ్ధిదారులు 50 మందికి 50 లక్షల రూపాయల బ్యాంకు రుణాలను అందించటం జరిగిందన్నారు. వెనుకబడిన వర్గాల వారు స్వయం ఉపాధి పథకాలకు ముందుకు వస్తే అర్హులైన ప్రతిఒక్కరికీ సబ్సిడీని మంజూరు చేసి బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారులు ఆటోలు, చిరు వ్యాపారాలు, జనరిక్ మెడికల్ షాపులు నిర్వహించుకునేందుకు వెనుకబడిన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రుణాలను మంజూరు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రజల్లో దాన స్ఫూర్తిని వినియోగించుకుని ప్రభుత్వం, ప్రైవేటు, పబ్లిక్ పీపుల్స్ భాగస్వామ్యంతో పీ4 విధానం ద్వారా రాబోయే ఐదేళ్లలో పేదరికాన్ని నిర్మూలించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ పరిపాలనా అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి కె.లక్ష్మీదేవమ్మ, సహాయ సంక్షేమ అధికారి పి.శ్రీనివాసరావు, బీసీ కార్పొరేషన్ ఏఈవో కె.రాజేంద్ర బాబు, రాష్ట్ర వెల్ఫేర్ ఆఫీసర్లు రజనీ కుమారి, హేమ ప్రియ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే సిద్ధాంతాలు ఆదర్శప్రాయం : లక్ష్మీశ



బెంజిసర్కిల్ : సమసమాజ స్థాపనకు అహర్నిశలు కృషిచేసిన సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే అని, ఆయనను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు.

రూ.కోట్లు వృథా!?

(5వ పేజీ తరువాయి)

కూడా అర్థం కాకుండా ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో గన్నవరంలో రూ.15 కోట్ల వ్యయంతో 2016-17లో 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఒక ఎకరంపైగా విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దీని గురించి పట్టించుకోలేదు. దీంతో సబ్‌స్టేషన్ మొత్తం పిచ్చి మొక్కలు, పొదలతో నిండిపోయింది. టవర్ల అంత ఎత్తు తీగ మొక్కలు పాకి కమ్ముకుపోయాయి. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికే రూ.10 కోట్లు ఖర్చు చేసినట్టుగా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. మరో రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు లైన్లు, ఇతర ఎక్విప్‌మెంట్‌కు ఖర్చు చేశారని తెలుస్తోంది. ఇప్పటికీ పాత సబ్‌స్టేషన్‌నే వినియోగిస్తున్నారు తప్ప కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌ను మాత్రం వినియోగంలోకి తీసుకురావటం లేదు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇలా మూలన పడేయటంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.కోటి వరకు ఖర్చు చేసి వదిలేశారు..

కేసరపల్లి మేధా టవర్ దగ్గర రూ.132 కోట్లతో మరో 220 /132 కేవీ సబ్‌స్టేషన్ అని హడావుడి చేశారు. పనులు కూడా మొదలు పెట్టారు. రూ.కోటి వరకు ఖర్చు చేసినట్టు ప్రాథమిక సమాచారం. ఎంత ఖర్చు చేశారన్న వివరాలు మాత్రం ట్రాన్స్‌కో అధికారులు అత్యంత రహస్యంగా ఉంచుతున్నారు. మేధ టవర్ దగ్గర సబ్‌స్టేషన్ పనులు మొదలు పెట్టి దానిని కూడా మధ్యలో వదిలేశారు. కాగా, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు పురోగతిలో ఉన్నాయి. మరి గన్నవరంలో కట్టిన సబ్‌స్టేషన్, కేసరపల్లి మేధ టవర్ దగ్గర నిర్మించి వదిలేసిన సబ్‌స్టేషన్ పనులు ఎందుకు చేపట్టారన్నది ఇప్పటికీ మిస్టరీగా ఉంది. ఎయిర్ పోర్టు దగ్గర చేపడుతున్న సబ్‌స్టేషన్‌ను అయినా పూర్తి స్థాయిలో చేపడతారా ? మధ్యలో వదిలేస్తారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

రూ.కోట్ల విలువైన భూమి ఇలా..

గన్నవరంలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ స్థలం ఎకరానికి పైగా ఉంది. గన్నవరం పట్టణంలో ఎకరం భూమి ధర కోట్ల రూపాయల్లోనే ఉంటుంది. ఈ స్థలాన్ని కూడా దేనికీ పనికి రాకుండా చేశారు. సబ్‌స్టేషన్‌ను మూలనపెట్టడంతో దీని స్థలం కూడా నిరుపయోగంగా ఉంటోంది.

మొగల్రాజపురం సబ్ స్టేషన్‌లోనూ..

విజయవాడ నగరంలో ప్రధానంగా మొగల్రాజపురంలో 132/33 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ (జీఐఎస్) సబ్‌స్టేషన్‌ను రూ.100 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశారు. ఇది వినియోగంలోకి వచ్చినప్పటి నుంచి రెగ్యులర్‌గా ట్రిప్ అవుతోంది. ఇండోర్ కేబుల్స్ సరిగా చేయకపోవటం వల్ల అంతరాయం ఏర్పడుతోందని తెలుస్తోంది. సీపీడీసీఎల్ డిస్ట్రిబ్యూషన్ వాళ్లు దీనిని వినియోగించటానికి ఇష్టపడటం లేదు.

ఉయ్యూరు, బంటుమిల్లిలో అసంపూర్తి పనులు

ఉయ్యూరులో 132/33 కేవీ సబ్‌స్టేషన్ కూడా అసంపూర్తిగానే వదిలేశారు. అప్పట్లో టెండర్లు కూడా పిలిచారు. పనులు కూడా ప్రారంభించారు. పనులు ఎందుకు ఆగిపోయాయో తెలియదు. బంటుమిల్లిలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు కూడా మధ్యలో ఆపేశారు. దాదాపుగా ఐదారేళ్లుగా నిరుపయోగంగా ఉంటోంది.

బ్యారేజీ ఎప్పుడు?

(5వ పేజీ తరువాయి)

నదిలో నీరు కనిపిస్తోంది. గుడిమెట్ల దాటిన తర్వాత నీటి ప్రవాహమంతా అమరావతివైపే వెళ్తుంది. దీనివల్ల నదిపై ఉన్న ఎత్తిపోతల పథకాల ఆయకట్టుకు సజావుగా సాగునీరు అందట్లేదు. రైతులు అధిక వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. కళ్ల ముందే మిర్చి, మొక్కజొన్న ఇతరత్రా పంటలు, పశుగ్రాసం ఎండుతున్నా నీరందించలేని దుస్థితి. తాగునీటికి ఇబ్బందులు తప్పట్లేదు. సామూహిక రక్షిత పథకాల ద్వారా అరకొరగానే తాగునీరు అందుతోంది. ఇసుకలో కాల్వలు తీసి నీటి ప్రవాహాన్ని తాగునీటి పథకాల వద్దకు మళ్లించాల్సి వస్తోంది. పలు పథకాలకు ఊటనీరే దిక్కవుతోంది. ఈ బ్యారేజీ నిర్మాణం వల్ల అమరావతి తాగునీటి అవసరాలు తీరటంతో పాటు నందిగామ, జగ్గయ్యపేట, పెదకూరపాడు నియోజకవర్గాల్లో తాగు, సాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి.

పుష్కలంగా నీరు

ఈ బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 10 టీఎంసీలు కావటంతో ఎగువన 25 నుంచి 30 కిలోమీటర్ల వరకు బ్యాక్ వాటర్ నిల్వ ఉంటుంది. దీనివల్ల ఇప్పటికే కృష్ణానది, మునేటిపై నందిగామ నియోజకవర్గంలో ఉన్న 51 సాగునీటి ఎత్తిపోతల పథకాల ద్వారా 63,438 ఎకరాల ఆయకట్టుకు, జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 39 ఎత్తిపోతల పథకాల ద్వారా 21,742 ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందుతుంది. వేదాద్రి-కంచెల ఎత్తిపోతల పథకం ఆయకట్టు 15,366 ఎకరాలకు నీటి కొరత ఉండదు. తాగునీటి ఇబ్బందులు కూడా తొలగిపోతాయి. ఏడాది పొడవునా నీరు పుష్కలంగా అందుతుంది. కృష్ణాడెల్టాలోని 13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఇది దోహదపడుతుంది. రెండు రోజుల క్రితం చందర్లపాడు మండలం కాసరబాదలో జరిగిన ఎత్తిపోతల పథకాల చర్చావేదికలో వైకుంఠపురం-దాములూరు బ్యారేజీ నిర్మించాలని ప్రజలు, రైతులు ముక్తకంఠంతో కోరారు. ఎత్తిపోతల పథకాల మనుగడ ప్రశ్నార్థకంగా మారటంతో బ్యారేజీ నిర్మాణమే శరణ్యమంటూ ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు దృష్టి కేంద్రీకరించి, బ్యారేజీని సత్వరమే నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బంధం భగ్గుమంది!

» పెట్రోలు పోసుకొని ఇరువురి ఆత్మహత్యాయత్నం

» పరిస్థితి విషమం.., బాపట్లలో ఘటన


మంటల్లో లక్ష్మీనారాయణ రావు

బాపట్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బాపట్ల రైల్వేస్టేషన్ వద్ద జరిగిన ఒక ఘోర దుర్ఘటన జనం భయంతో వణికిపోయేలా చేసింది. పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ, ఆమెను కాపాడబోయి తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చేసిన ఆర్తనాదాలతో జనం భీతిల్లారు. ఘటనకు సంబంధించి పట్టణ సీఐ ఆర్ రాంబాబు తెలిపిన వివరాలు... బాపట్ల రైల్వేస్టేషన్‌లో టిక్కెట్ బుకింగ్ క్లర్క్‌గా పనిచేసి పదవీవిరమణ చేసిన తులాబందుల లక్ష్మీ నారాయణరావు (68), బ్యుటిషియన్‌గా పనిచేస్తున్న నల్లమోతు మాధవితో 25 సంవత్సరాల నుంచి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. వీరికుటుంబాలు విజయలక్ష్మీపురంలోని త్యాగరాయ్‌నగర్‌లో ఉంటాయి. ప్రస్తుతం మాధవి సూర్యలంకరోడ్డులో సూపర్‌మార్కెట్, హోటల్ నిర్వహిస్తుండగా.., లక్ష్మీనారాయణరావు రైల్వేస్టేషన్ ఎదుట ప్రైవేట్ టూర్స్ అండ్ ట్రావెల్స్ బుకింగ్ కౌంటర్ నిర్వహిస్తున్నారు. లక్ష్మీనారాయణరావు భార్య వారిని తిట్టగా మనస్తాపానికి గురయ్యారు. శుక్రవారం ఉదయం రైల్వేస్టేషన్ దగ్గర బుకింగ్ కౌంటర్‌లో ఉన్న లక్ష్మీనారాయణరావు దగ్గరకు మాధవి పెట్రోల్ బాటిల్‌తో వచ్చారు. షాపులోకి వెళ్లి తన ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పుపెట్టుకున్నారు. ఆపే ప్రయత్నం చేసిన లక్ష్మీనారాయణరావుపై కూడా పెట్రోల్ పడింది. ఇరువురూ కాలిపోతుండటంతో చుట్టుపక్కలవారు వచ్చి మంటలు ఆర్పి ఏరియా వైద్యశాలకు తరలించారు. మాధవి 85 శాతం కాలిపోగా, లక్ష్మీనారాయణరావు 65 శాతం కాలినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన గురించి కోర్టుకు సమాచారం ఇవ్వగా జడ్జి రేణుక లత వచ్చి ఆసుపత్రిలో వారిని పరిశీలించి వివరాలు నమోదు చేశారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇదిలాఉండగా వారి మధ్య ఆర్థికలావాదేవీలు ఉన్నట్టు తెలుస్తోంది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128,137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ఘనంగా కుంకుమ పూజ



రాణిగారితోట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోటలోని శ్రీ కోదండరామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శుక్రువారం కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాయి రంగమ్మ, శ్రీను, బాలయ్య, వేముల దుర్గారావు, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంధకారంలో ఆటోనగర్

● వీధి దీపాలు వెలగని దుస్థితి ● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పారిశ్రామికవాడ

(ఆటోనగర్, ఆంధ్రజ్యోతి)

పగలంతా వేలాది మంది కార్మికులు, యాజమానులతో కళకళలాడే పారిశ్రామికవాడలో రాత్రయితే వెలుగు జాడలు కరువవుతున్నాయి. నగరం నడిబొడ్డులో ప్రతిష్టాత్మకమైన ఆటోనగర్‌లో కారు చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఇదే అదునుగా అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఆటోనగర్‌లో లారీ బిల్డింగ్ యూనిట్లు, మెకానిక్ షెడ్లు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, స్టీలు సామగ్రి తయారీ కంపెనీలు, పెద్ద సంఖ్యలో పరిశ్రమలు న్నాయి. లక్ష మందికిపైగా కార్మికులు ఇక్కడ పని చేస్తున్నారు. అలాంటి పారిశ్రామికవాడలో మౌలిక వసతుల కల్పనలో ఐలా కళ్లకు గంతలు కట్టుకుని చూస్తోందని కార్మికులు అంటున్నారు. ప్రస్తుతం ఐలా పాలకవర్గం గడువు ముగియడంతో ఆ విధులన్నీ జోనల్ మేనేజర్ పర్యవేక్షిస్తున్నారు. రోడ్లు, తాగునీరు, వీధి దీపాల తదితర సదుపాయాల కల్పనలో జోనల్ మేనేజర్ అంటీముట్టనట్టే వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఆటోనగర్ యూనిట్ల నుంచి వేలకు వేలు పన్నులు వసూల్ చేస్తున్నా రహదారులన్నీ చీకటి కమ్ముకుంటు న్నాయని విమర్శిస్తున్నారు. 9 గంటలు దాటితే చాలు రహదారులు కనిపించవు. ప్రధాన రహదారిలోనూ అక్కడక్కడ వీధి దీపాలు వెలుగుతున్నట్లు కనిపిస్తాయి. ఒకటి వెలిగితే రెండోది వెలగదు. అంతర్గత రహదారులకు వెళ్తే ఏదో తెలియని మాయా ప్రపంచానికి వెళ్లినంత పనవుతోంది.



వెలగని వీధి దీపాలు



స్టాలిన్ బిల్డింగ్ వద్ద చిమ్మచీకట్లు

అసాంఘిక శక్తుల అడ్డా

రాత్రిపూట ఆటోనగర్‌లో అసాంఘిక శక్తులు పెరిగిపోతున్నాయి.

ఒంటరిగా కనిపిస్తే దాడులు, బెదిరింపులు, ఫోన్లు, నగదు లాక్కుంటారు. గుట్టుచప్పుడు కాకుండా గుట్కా గోదాములోకి సరుకు లోడింగ్, అన్‌లోడింగ్ అవుతాయి. గంజాయి బాబులు బేరాలు కుదిరేది, డెలివరీ జరిగేదిక్కడే. రేషన్ మాఫియా జంట జిల్లాల పరిధిలోని ఆటోనగర్ కేంద్రంగా దందాలు చేస్తుంటాయి. మినీ వాహనాల్లో తీసుకొచ్చి లారీల్లో ఎక్కించి బల్లెం వారి వీధి మీదుగా బోర్డర్ దాటుతాయి.



ఎమ్మెల్యే గద్దెకు వినతిపత్రం ఇస్తున్న ఆర్పీలు

ఆర్పీల సమస్యలు పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ

పటమట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మెప్మాలో పని చేస్తున్న రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీ)ల సమస్యలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. శుక్రవారం కార్యాలయంలో తనను కలిసి వినతిపత్రం ఇచ్చిన ఆర్పీలకు ఆయన హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా పని చేస్తున్న ఆర్పీలకు గతంలో టీడీపీ హయాంలో రూ.3 వేలు వేతనం ఇచ్చామని, వేతన పెంపుతో పాటు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆర్పీలు శ్రీదేవి, నాగలక్ష్మి, విజయలక్ష్మి, సలోని, కల్యాణి పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న గద్దె క్రాంతి కుమార్

జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

పటమట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాణిగారి తోట సెంటర్లో గుడ్ మార్నింగ్ హోటల్ ఎదుట మాదిగ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ నూతన విగ్రహ ఏర్పాటుకు టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ ఆర్థికసాయం అందించారు. శుక్రవారం అశోక్‌నగర్ తూర్పు టీడీపీ కార్యాలయంలో ఆయన కమిటీ వారికి రూ. 50 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేల్పుల శౌరి, చింతా బుజ్జిబాబు, పాతకోటి బాబురావు, వేల్పుల సురేష్, దుర్గా ప్రసాద్, రెడ్డిపొంగు మధు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రభుత్వాసుపత్రి: 6వ డివిజన్ బ్రహ్మానంద రెడ్డి నగర్ ఒకటవ లైన్‌లో శుక్రవారం జరిగిన అయ్యప్ప స్వామి జన్మదినోత్సవ పూజా కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ పాల్గొని విజయవాడ ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడుతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదానానికి ఆయన రూ.5 వేలు వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు గుడాల త్రినాథ్, పడాల గంగాధర్, గార్లపాటి గోపి, శ్రీనివాస్, పడాల నాగు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధే అజెండాగా పనిచేయాలి

● శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయాలని, క్రీడల అభివృద్ధే అజెండాగా అంకితభావంతో పనిచేయాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. శాప్ కార్యాలయంలో శుక్రువారం శాప్ అధికారులతో క్రీడల అభివృద్ధి, సమ్మర్ క్యాంపుల నిర్వహణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్రీడా సంఘాలను సమన్వయం చేసుకుని రాష్ట్రంలో పెద్ద ఎత్తున క్రీడాపోటీలను నిర్వహించేందుకు అధికారులు కృషి చేయా లని, స్పోర్ట్స్ ఫెడరేషన్లు నిర్వహించే క్రీడలను రాష్ట్రంలోనే నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే నిర్వహించనున్న సమ్మర్ క్యాంపులను సమర్థవంతంగా నిర్వహించాలని, ఈ నెల 20 నాటికి అన్ని జిల్లాల డీఎస్‌డీవోల కు సమగ్ర సమాచారాన్ని పంపించాలని అధికారులకు సూచించారు. సమ్మర్ క్యాంపులోని క్రీడా కార్యక్రమాలన్నీ క్రీడాయాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మానవతావాది జ్యోతిబా పూలే

టీడీపీ జిల్లా కార్యాలయంలో నేతల నివాళి

వన్‌టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మొదటిసారిగా మహాత్ముడు అని పిలిపించుకున్న గొప్ప సామాజిక తత్వవేత్త, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మానవతావాది జ్యోతిరావు పూలే అని టీడీపీ నేతలు కొనియాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం శుక్రవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ యాదవ్‌లు పాల్గొని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే ఆశయ సాధన కోసం టీడీపీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సింగం వెంకన్న, పి.కిషోర్, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కార్యాలయంలో...

గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు కరిముల్లా, బీసీ సెల్ జిల్లా నాయకులు యు.రాము, తదితరులు పాల్గొన్నారు.

'అదొక్కటే ముగింపు' పుస్తకావిష్కరణ

విజయవాడ లీగల్ : జ్యోతీరావ్ పూలే జయంతి వేడుకలు శుక్రవారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కె.బాషా, కేవీ నారాయణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సూరాబత్తుల మల్లేశ్వరరావు, డాక్టర్ పి.వి నయ్‌కుమార్ పూలేకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి, న్యాయవాది, స్వర్గీయ జస్టిస్ పి.శివశంకర్‌చే రచింపబడిన 'అదొక్కటే ముగింపు' పుస్తకాన్ని శివశంకర్ తనయుడు డాక్టర్ వినయ్‌కుమార్, న్యాయవాదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు, బాషా, వి.గురునాథం మాట్లాడుతూ దేశంలోని న్యాయవ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ వంటి బలహీనవర్గాల ప్రజల ఉన్నతికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి పి.శివశంకర్ ఆత్మకథ అయిన 'అదొక్కటే ముగింపు' పుస్తక పరిచయం బెజవాడ బార్‌లో జరగడం మనందరికీ ఆనందంగా ఉందన్నారు. న్యాయవాదులు పడవల ఏడుకొండలు, పిళ్లా శ్రీనివాసరావు, శ్రీనివాస్, కోటేశ్వరరావు, పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

సెలవు రోజుల్లోనూ బిల్లులు చెల్లించొచ్చు

కార్పొరేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజుల్లోను క్యాష్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయని, పన్నులు చెల్లించేవారు వీటిని వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయలపై 50శాతం వడ్డీ రాయితీ, 2025-26 కు ఇంటి పన్ను ఖాళీ స్థలాల పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. నగర పరిధిలో 13 క్యాష్ కౌంటర్లు, 286 సచివాలయాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని ప్రజలు పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌లో, పురమిత్ర యాప్ ద్వారా కూడా చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 30 వరకు ఉందని, ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన కోరారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు క్షేత్రస్థాయి పరిశీలన

గుణదల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి నిడమానూరు వరకు తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఏరకమైన చర్యలు తీసుకోవాలన్న దానిపై ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్న కుమార్ క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలన చేశారు. రామవరప్పాడు రింగ్ వద్దనుంచి ఆయన కాలి నడకన నిడమానూరు వరకు వెళ్లి ఎక్కడెక్కడ ఏరకమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉందన్నది ముందుగా పరిశీలించారు. రోడ్డు వెడల్పు తక్కువగా ఉన్న చోటనే ప్రమాదాలు జరుగుతున్నట్లుగా గుర్తించారు. కొన్ని చోట్ల పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా ఫుట్‌పాత్‌లపై హాకర్లు ఆక్రమించడాన్ని ఆయన గమనించారు. ద్విచక్రవాహనదారుల అభ్యర్థన మేరకు రామవరప్పాడు సాయిబాబా గుడి వద్ద యూటర్న్‌ను వాడుకలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. రామవరప్పాడు కాల్వకట్ట మీద నుంచి రింగ్‌రోడ్డుకు చేరుకునే వారు రైవస్ కాల్వకట్ట వెంబడి నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డు మార్గంలో వెళ్లేలా చర్యలు తీసుకుం టామని తెలిపారు. ట్రాఫిక్ సీఐలు బాల మురళీకృష్ణ, కిషోర్ బాబు, రమేష్‌బాబు, ఎస్ఐ ఆదినారాయణ పాల్గొన్నారు.

మెట్రో కోచ్ ఏర్పాటుకు అధికారుల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మెట్రో రైల్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రంగారావు, ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

గన్నవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గన్నవరం రైతు బజార్ నుంచి కేసరపల్లి జంక్షన్ వరకూ మెట్రో కోచ్ ఏర్పాటుకు జాయింట్ ఇన్‌స్పెక్షన్‌ను అధికారులు శుక్రవారం నిర్వహించారు. మెట్రోట్రైన్ చీఫ్ ఇంజనీర్ రంగారావు, గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం ఆర్‌అండ్‌బి, విద్యుత్ శాఖ అధికారులతో కలసి గన్నవరం నుంచి కేసరపల్లి వరకూ పరిశీలన చేశారు. 4.5 కిలోమీటర్లు మెట్రో కోచ్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ తదితర అంశాలను చర్చించారు. గన్నవరం, బుద్ధవరం బస్టాండ్, హెచ్‌సీఎల్, కేసరపల్లి జంక్షన్ వద్ద మొత్తం నాలుగు స్టేషన్‌లు ఏర్పాటు చేయనున్నారు. రైతు బజారు సమీపంలో మెట్రో డిపో ఏర్పాటుకు సుమారు 60 ఎకరాలు భూమి అవసరమవుతుందని, నాలుగు స్టేషన్‌లు కలిపి సుమారు మరో పదెకరాలు అవసరం అవుతుందని భావిస్తున్నారు. మెట్రో ప్రాజెక్టుకు సుమారు రూ.400 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు వేశారు. తహసీల్దారు కేవీ శివయ్య, మండల సర్వేయర్ మాధవరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ బలరాం, విద్యుత్ శాఖ ఏఈ వెంకటరాజు పాల్గొన్నారు.

ముగిసిన ఎల్‌ఐపీ ప్రాజెక్ట్

లబ్బీపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ (బీడీసీఈ), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్‌ఐపీ) పైలెట్ ప్రాజెక్టు ముగింపు కార్యక్రమం శుక్రవారం పటమట హైస్కూల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సమగ్రశిక్షణ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు నలంద కళాశాల విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి ఈ ప్రాజెక్టుకు నలంద డిగ్రీ కళాశాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కళాశాల నుంచి 26మంది విద్యార్థులు ప్రేరణమిత్ర యాప్ ద్వారా రిజిష్టరు చేసుకుని 13 ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, లాంగ్వేజెస్‌పై అవగాహన కల్పించి అనంతరం పరీక్ష నిర్వహించారని తెలిపారు. గత 16వారాలుగా విద్యార్థులకు పలు అంశాల్లో బోధించారు. అనంతరం నిర్వహించిన పరీక్షలలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీడీసీఈ సెక్రటరీ అండ్ సీఈవో ఎంఎల్ఎస్.దేవకుమార్, ఎడ్యుకేషన్ స్పెషలిస్టు శేషగిరి మధుసూదనరావు, శిక్షణ ఫౌండేషన్ డైరెక్టర్ రమా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు

స్టెల్లా కళాశాలలో స్టార్ మీట్-2025 నేడు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మారిస్ స్టెల్లా కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం(అలుమిని అసోసియేషన్) ఆధ్వర్యంలో శనివారం కళాశాలలోని ఆడిటోరియంలో స్టార్ మీట్-2025 కార్యక్రమం జరగనుంది. ఉదయం 11గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వవిద్యార్థిని, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏజీపీ ఓరుగంటి సాయమ్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు పాల్గొని తమ విద్యా అనుభవాలను పంచుకోనున్నారు.



కళ్యాణోత్సవానికి పట్టువస్త్రా తీసుకువెళ్తున్న చలసాని కుటుంబీకులు

ఘనంగా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం

కంకిపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలవెన్ను చెన్న మల్లేశ్వరస్వామి దేవాలయంలో మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు చలసాని సురేష్, చలసాని అరుణ ప్రసాద్, చలసాని కిషోర్, చలసాని పూర్ణ, చలసాని వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా స్వామి వారులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అదే విధంగా ఈ నెల 12న ఉదయం 8.30 నుంచి 12.30 గంటల వరకు వీరభద్ర పూజలు, వీరభద్ర పళ్లెం వీరంగాలు, ఊరేగింపు నిప్పులగుండం వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు బస్వేశ్వరరావు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడండి: జాస్తి

భారతీనగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవిలో డివిజన్‌లోని ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని నాల్గో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు వీఎంసీ అధికారులను కోరారు. నాలో డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని పరిటాల ఓంకార్ కళ్యాణ మండపంలో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ఆధ్వర్యంలో శుక్రవారం వీఎంసీ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని డివిజన్ పరిధిలోని వాటర్ పైపులకు లీకులు లేకుండా, రిజర్వాయర్లు పూర్తి నీటితో నిండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి రెడ్డి, ఈఈ సామ్రాజ్యం, వాటర్ వర్క్స్ లైన్‌మెన్లు ,కాంట్రాక్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నయనానందకరం!

రామవరప్పాడు రింగ్‌లో లవ్ మన విజయవాడ సర్కిల్ ఉంది. అందులో ఫౌంటెయిన్, గ్రీనరీ నగర వాసులకు ఆహ్లాదాన్ని పంచుతుంటాయి. ఆ సర్కిల్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో నూతనంగా ఓ ఎగురుతున్న గుర్రం విగ్రహాన్ని అందులో ఏర్పాటు చేశారు. నయనానందకరంగా ఉన్న ఆ విగ్రహం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. -విజయవాడ, ఆంధ్రజ్యోతి



ర్యాలీలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

తల్లిని సంరక్షించుకుందాం

- జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవ ర్యాలీలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు

భారతీనగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రసవ సమయంలో ఏ ప్రమాదం జరగకుండా ప్రతి తల్లిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నాలుగో డివిజన్‌లోని ఏపీసీసీ కాలనీలోని పట్టణ ఆరోగ్యకేంద్రం వద్ద జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆధ్వర్యంలో జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీని శుక్రవారం వారు ప్రారంభించారు. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి గురునానక్ రోడ్డు వరకు నర్సింగ్ విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. వివాహం అనంతరం కాబోయే తల్లులకు సాధారణ డెలివరీ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారని కలెక్టర్ అన్నారు. గర్భధారణ, ప్రసవం, ప్రసవానంతర కాలంలో మహిళలకు ఆరోగ్య సంరక్షణ విధానాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. పాత ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్.శోభ, సీడీపీవో ఎం.మంగమ్మ, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ మోతి బాబు, డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ శ్రావణి, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.





గ్రావిటీ కెనాల్, కొండవీడు వాగులో పనులు చేస్తున్న యంత్రాలు

వరద దుర్భేద్యం

అమరావతిలో శరవేగంగా
ముంపు నివారణ పనులు

- ప్రారంభమైన కొండవీటివాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్ విస్తరణాభివృద్ధి
- సమాంతరంగా రిజర్వాయర్ల పనులు.. వాటికి కాలువల అనుసంధానం





పనులను పరిశీలిస్తున్న ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథి, పాలవాగులో జరుగుతున్న పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతికి శాశ్వతంగా వరద ముంపు తలెత్తకుండా అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీఎల్) నేతృత్వంలో భారీ ఎత్తున రాజధానిలో వరద ముంపు నివారణ పనులు జరుగుతున్నాయి. దుర్భేద్యమైన వరదనీటి కాలువలు, రిజర్వాయర్లను నిర్మించడం ద్వారా ఎంత భారీ వర్షం కురిసినా నీరు అమరావతి నగరాన్ని ముంచెత్తకుండా విస్తరాణాభివృద్ధి పనులు చేస్తున్నారు. నీరుకొండ, పాలవాగు, గ్రావిటీ కాలువల విస్తరణాభివృద్ధి పనులతో పాటు ఏకకాలంలో 3 ప్రధాన రిజర్వాయర్ల పనులు మొదలయ్యాయి. కొండవీడు వాగు విస్తరాణాభివృద్ధి పనులు ముందుగా ప్రారంభమయ్యాయి. 20 ఎక్స్‌కవేటర్లతో శరవేగంగా ఈ పనులు సాగుతున్నాయి. 80 లారీలు ఇక్కడి నుంచి తవ్విన మట్టిని తరలిస్తున్నాయి. అనంతవరం నుంచి ఉండవల్లి వరకు వచ్చే కొండవీడువాగు ప్రస్తుతం కొన్ని చోట్ల 10 అడుగులు మరికొన్ని చోట్ల 4 అడుగుల లోతున ఉందని ఇటీవల ఏడీసీ సీఎండీ ప్రకటించిన సంగతి తెలిసిందే. కొండవీడు వాగులో 75 మీటర్ల లోతు, 115 మీటర్ల వెడల్పుతో విస్తరణాభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం శాఖమూరు నుంచి ఈ పనులు జరుగుతున్నాయి. ఐనవోలు గ్రామం పరిధిలో కూడా కాలువ విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ కాలువను నీరుకొండ దగ్గర అభివృద్ధి పరిచే రిజర్వాయర్‌కు అనుసంధానం చేస్తారు. కొండవీడు కాలువ నీరుకొండ రిజర్వాయర్‌కు అనుసంధానమయ్యేలా ప్రస్తుతం పనులు చేపడుతున్నారు. నీరుకొండలోనూ రిజర్వాయర్ పనులు ప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నారు. పాలవాగు విస్తరణాభివృద్ధి పనులు కూడా సమాంతరంగా మొదలయ్యాయి. పాలవాగు దొండపాడు నుంచి కృష్ణాయపాలెం మీదుగా కొండవీడు వాగులో కలుస్తుంది. పాలవాగు పనులు ప్రస్తుతం ఎన్-9 రోడ్డు బ్రిడ్జి ఎడమ వైపున జరుగుతున్నాయి. ఇక్కడ 8 ఎక్స్‌కవేటర్లు మట్టిని తవ్వుతుండగా..మొత్తం 30 లారీలు తవ్విన మట్టిని తరలిస్తున్నాయి. గ్రావిటీ కెనాల్ పనులను కూడా కాంట్రాక్టు సంస్థ చేపట్టింది. గ్రావిటీ కెనాల్ వైకుంఠపురం వెంబడి వెళుతుంది. భారీ సంఖ్యలో ఎక్స్‌కవేటర్లు, లారీలను దించి కాంట్రాక్టు సంస్థ చకచకా కాలువ విస్తరణాభివృద్ధి పనులు చేపడుతోంది.

నీరుకొండ దగ్గర 0.4 టీఎంసీల సామర్థ్యం రిజర్వాయర్ పనులు ఇప్పటికే జరుగుతున్నాయి. కృష్ణాయపాలెం దగ్గర 0.1 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్, శాఖమూరు దగ్గర 0.01 టీఎంసీ సామర్థ్యంతో రిజర్వాయర్, వైకుంఠపురం దగ్గర 0.03 టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్, రాజధాని బయట కూడా మరో 0.03, 0.2 టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లను అభివృద్ధి చేయనున్నారు.

వైభవోపేతంగా..

నంది వాహనంపై గంగాపార్వతీ సమేత మల్లేశ్వరుల ఊరేగింపు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా నాలుగో రోజు శుక్రవారం నంది వాహనంపై గంగా పార్వతీ(దుర్గ) సమేత మల్లేశ్వరులు నగర వీధుల్లో వైభవంగా ఊరేగారు. ఉదయం వేద పండితులు, అర్చకులు మూల మంత్ర హవనములు నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఔపాసన, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, ఇతర వైదిక కార్యక్రమాలతో పాటు ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి మల్లేశ్వర మహామండపం నుంచి గంగా పార్వతి సమేత మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన నంది వాహనంపై ఊరేగారు. సంప్రదాయ కళలైన తప్పెట్లు, మహిళల కోలాట నృత్యాలు, చిన్నారుల కోలాట ప్రదర్శన, తాళం భజన ప్రదర్శన ముందుకు సాగుతుండగా, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నంది వాహన సేవ శ్రేణి కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కొత్తపేట, సామారంగం చౌక్, మెయిన్ బజార్ మీదుగా తిరిగి కొండపై వరకు ఊరేగింపు కొనసాగింది. ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



నంది వాహన సేవలో పాల్గొన్న ఉద్యోగులు

సంప్రదాయబద్ధంగా ఎదుర్కోలు ఉత్సవం

మల్లేశ్వర స్వామి ఆలయం శుక్రవారం రాత్రి వద్ద ఎదుర్కోలు ఉత్సవం(రాయబారం) సంప్రదాయబద్ధంగా జరిగింది. వధూవరులైన పార్వతీ(దుర్గ), శ్రీమల్లేశ్వరుల గొప్పతనాన్ని కవి పండితులు రెండు బృందాలుగా విడిపోయి పద్య రూపం లో వర్ణించారు. కవిపండితులు దూళిపాళ రామకృష్ణ, ఉపద్రష్ట వెంకట రమణమూర్తి, కప్పగంతు రామకృష్ణ, పైడిపాటి ఉమానాధశర్మ, వలివేటి శివరామకృష్ణ, చల్లా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆలయ అధికారులు కవి పండితులను తాంబూలాలతో ఘనంగా సత్కరించారు. దేవస్థానం స్థానాచార్యుడు శివప్రసాద్, ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, మల్లేశ్వరశాస్త్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.సత్యనారాయణ ప్రసాద్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్, ఆంధ్రజ్యోతి పబ్లిషర్ కోగంటి వెంకట శేషగిరిరావు

న్యాయవాదుల సేవలు అభినందనీయం

సత్యనారాయణపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సమాజంలో న్యాయవాదులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యుడు, ఆల్‌ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. న్యాయవాద వృత్తిలో అవిర్నేని శ్రీనివాస్ శ్యామ్‌సుందర్ పాతికేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, అమరావతి లీగల్ అకాడమీ 5వ వార్షికోత్సవం, అవిర్నేని శ్రీనివాస్ శ్యామ్‌సుందర్ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం మానేపల్లి వారి వీధిలోని ఓ హోటల్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. అవిర్నేని శ్రీనివాస్ న్యాయవాదిగా పాతికేళ్లుగా సమాజానికి సేవచేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారని వక్తలు పేర్కొన్నారు. లాభాపేక్ష లేకుండా పాతికేళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉంటూ, అమరావతి లీగల్ అకాడమీ ద్వారా జూనియర్ లాయర్లకు ఆన్‌లైన్‌లోను, ఫిజికల్‌గా, న్యాయమూర్తి పరీక్షలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయం అని ఆంధ్రజ్యోతి పబ్లిషర్ కోగంటి వెంకట శేషగిరిరావు అన్నారు. అవిర్నేని శ్రీనివాస్ శ్యామ్‌సుందర్‌ను సన్మానించారు. ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.సత్యనారాయణ ప్రసాద్, కేఎల్‌యూఎఫ్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ పవన్‌కుమార్, ఎంఏయం లా కాలేజీ ప్రిన్సిపాల్ వీరబ్రహ్మయ్య, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా పాల్గొన్నారు.



ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం

- ప్రజలందరూ భాగస్వాములవ్వండి
- సీపీఎం నేత సీహెచ్ బాబూరావు పిలుపు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని, పార్టీలకతీతంగా ప్రజలందరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. సీపీఎం నగర కమిటీ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్‌లో నిర్వహించారు. సమావేశానికి బి.రమణరావు అధ్యక్షత వహించారు. నగర ప్రజల సమస్యలపై చర్చ జరిపారు. ఇళ్ల పట్టాలు, మంచినీరు, డ్రైనేజీ, పౌర సమస్యలు, కాలుష్యం, గంజాయి, మత్తు పదార్థాలు, ప్రజలపై భారాలు తదితర సమస్యలపై భవిష్యత్తులో ఉద్యమాలు నడపాలని సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ మీటర్లను తిప్పి కొట్టాలని సీహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. దీనిపై ఇంటింటికీ స్టిక్కర్లు, కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల రూపంలో ప్రజలపై భారాలు వేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.కాశీనాథ్, కె.శ్రీదేవి, నగర నేతలు బోయి సత్యబాబు, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పీడు పెంచండి

విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూ సేకరణ జరిగింది 60 శాతమే

- మిగిలిన భూములను త్వరగా అప్పగించాలంటూ ఎన్‌హెచ్ లేఖ
- త్వరగా పెండింగ్ గజిట్‌లు పూర్తి చేసి భూములు అప్పగించాలని అభ్యర్థన
- మరో 20 శాతం భూములు ఇస్తేనే పనులు చేపట్టడానికి అవకాశం
- ఇప్పటికే ఖరారైన ప్యాకేజీ-3 పనులు .. మేఘా సంస్థకు దక్కిన కాంట్రాక్టు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి భూ సేకరణలో ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉంది. త్వరితగతిన మాకు భూములు అప్పగించాలంటూ ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగానికి ఖమ్మం జిల్లాకు చెందిన ఎన్‌హెచ్ అధికారులు లేఖలు రాసే పరిస్థితి వచ్చింది. ఇప్పటి వరకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అప్పగించాల్సిన 245 ఎకరాల్లో 60 శాతం భూములను మాత్రమే సేకరించి ఇచ్చింది. ఇంకా 40 శాతం భూములను సేకరించి ఇవ్వాలి. కనీసం మరో 20 శాతం మేర భూములను అయినా సేకరించి ఎన్‌హెచ్ అధికారులకు అప్పగించగలిగితే.. 80 శాతం భూములు వచ్చాయన్న క్లాజ్‌లో కాంట్రాక్టు సంస్థ పనులు మొదలు పెట్టడానికి అవకాశం ఉంది. ఖమ్మం జిల్లా నుంచి విజయవాడ జక్కంపూడి వరకు 30 కిలోమీటర్ల దూరానికి పనులు చేపట్టాల్సి ఉంది. విజయవాడ-నాగ్‌పూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ రహదారి అత్యంత ప్రాముఖ్యత పోషించనుంది. నాలుగు వరసలతో నిర్మించే ఈ హైవే ప్రాజెక్టుకు ఇంతకు ముందే టెండర్లు కూడా పిలిచారు. మేఘా సంస్థ ఈ పనులను దక్కించుకుంది. పనులు చేపట్టాలంటే 80 శాతం భూ సేకరణ జరగాలి. ఇప్పటికే విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భాగంగా ఖమ్మం జిల్లాలో రెండు ప్యాకేజీల పనులు త్వరితగతిన జరుగుతున్నాయి. ఎటొచ్చీ ఎన్టీఆర్ జిల్లాలోనే ప్యాకేజీ-3 పనులు మిగిలిపోయాయి. తాజాగా ఎన్‌హెచ్ అధికారులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు రాసిన లేఖలో రైతుల నుంచి భూములను తీసుకోవటానికి వీలుగా తాము రూ.74.49 కోట్లను కేటాయించామని త్వరితగతిన స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా 9.24 హెక్టార్ల భూమిని అప్పగించాలని కోరారు. జక్కంపూడి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న 3ఏ గెజిట్ ప్రచురణను వేగంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో 9.04 హెక్టార్ల 3డీ గజిట్ ప్రచురణ కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు.

కళారత్న పురస్కార గ్రహీతలకు సత్కారం



దామోదర గణపతిరావు, రామకూరి (రంగం) రాజేష్, డాక్టర్ కమ్ముల శేషుకుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తెలుగు కళావాహిని, జీ ఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళా భారతి, రాగ సుధామయి క్రియేషన్స్ నిర్వహణలో కౌతా వారి కళా వేదికపై శుక్రవారం సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో కళారత్న పురస్కార గ్రహీతలు దామోదర గణపతి రావు, రామకూరి (రంగం) రాజేష్, డాక్టర్ కమ్ముల శేషుకుమార్‌ను సత్కరించారు. కళలకు కాణాచి విజయవాడలో కూటమి ప్రభుత్వ పాలనలో కళా ప్రదర్శనలు ఊపందుకున్నాయని, కళలు విలసిల్లిన చోట సుభిక్షంగా ఉంటుందని అమరావతి సచివాలయం ఓఎస్డీ డాక్టర్ ప్రభాకర్ అన్నారు. చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు పాల్గొన్నారు.

అగ్నివీర్ ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పొడిగింపు

విద్యాధరపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భారత సైనిక దళంలో అగ్నివీర్ ద్వారా చేరుటకు ఆన్‌లైన్ గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు అమ్మ కాన్సెప్ట్ ఫౌండర్, సీఈవో ఎల్.కె.చిన్నప్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అగ్నివీర్ ద్వారా భారత సైన్యంలో చేరాలనే ఆసక్తిగల యువతీ, యువకులకు 21 సంవత్సరాలు నిండి ఉండాలని తెలిపారు. 10వ తరగతి, 8వ తరగతి చదివి ఉండాలని ఆయన తెలిపారు. అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకునే వారికి సందేహాలు ఉంటే అమ్మ కాన్సెప్ట్ సంస్థ నిర్వాహకుల ద్వారా గానీ, 94402 51373, 88014 33611 నెంబర్లకు ఫోన్ చేసిగానీ సంప్రదించాలని ఆయన సూచించారు.

సెపక్ తక్రా పోటీలకు రాష్ట్ర విద్యార్థులు

విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-17 సెపక్ తక్రా పోటీలకు రాష్ట్ర విద్యార్థులు ఎంపికయ్యారని, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. ఈ నెల 15 నుంచి 21వరకు మణిపూర్‌లోని ఇంఫాల్ శాయ్ సెంటర్లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన బాలబాలికల జట్లకు కోచ్‌లుగా ఎస్.రమేష్, ఎం.సంతోషి కుమారి, డి.సుంకరరావు వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు అభినందించారు. విజయాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తదితరులు

పేదలకు సాయమందిద్దాం

- మార్గదర్శి - బంగారు కుటుంబం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు



విజయవాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దాంట్లో కొంత పేదలకు ఖర్చు చెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమానులో నిర్వహించిన మార్గదర్శులు - బంగారు కుటుంబం కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. సభలో పాల్గొన్న నగరానికి చెందిన పలువురు మార్గదర్శులు బంగారు కుటుంబాలకు చేయూతనందిస్తామన్నారు. అవి వారి మాటల్లోనే..

పిల్లలకు ఉచితంగా చదువు చెబుతాం

నేను స్థాపించిన హ్యాపీవ్యాలీ స్కూల్‌ను మీరే ప్రారంభించారు. వంద కోట్లు అప్పు చేసి స్కూలు కట్టించాను. ఆ అప్పంతా తీర్చాను. మేము 300 మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నాం. వారు మంచి జీవితాన్ని ప్రారంభించేదాకా బాధ్యత తీసుకుంటాం. మీరు ఇచ్చే పిలుపుతో మరిన్ని కార్యక్రమాలు చేపడతాం.

- గౌతమ్, హ్యాపీ వ్యాలీ స్కూల్ అధినేత

ఆణిముత్యాలకు అండగా ఉంటాం

ఈ కార్యక్రమం ద్వారా మట్టిలో ఆణిముత్యాలను వెలికి తీసి ఉద్యోగాలు ఇస్తాం. పిల్లలను చదివించేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. - నితిన్ కృష్ణ, నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్

ఉచిత చదువు అందించటానికి సిద్ధంగా ఉన్నాం

తోటపల్లిలో హీల్ ప్యారడైజ్ పాఠశాల ద్వారా వెయ్యి మంది అనాథ పిల్లలకు చదువు అందిస్తున్నాం. ఎవరైతే తమ పిల్లల్ని చదివించుకోలేని వారుంటారో వారికి ఉచితంగా చదువు చెప్పటానికి మేము సిద్ధంగా ఉన్నాం.

- పిన్నమనేని ధన ప్రకాశ్, మోడల్ డెయిరీ

పేద కుటుంబాలను దత్తత తీసుకుంటాం

నాకు చంద్రబాబే మార్గదర్శి. చంద్రబాబు చెప్పి చేసేవన్నీ చూసి నేర్చుకున్నాం. అరవై మందితో ప్రారంభమైన మా కాలేజీలో నేడు 6 వేల మంది చదువుకుంటున్నారు. ఎక్కువ కుటుంబాలను దత్తత తీసుకుని వారి బాగోగులను చూస్తాం.

- రావి వెంకటరావు, ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్

బీసీ మంత్రిత్వశాఖ లేకపోవడం శోచనీయం

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ ఆవేదన

గాంధీనగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీసీ వ్యక్తి ప్రధానిగా ఉన్నప్పటికి కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సంఘం కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు దాటుతున్నా నేటికీ బీసీలు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారన్నారు. బీసీ కులగణన చేపట్టాలని, బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా షేక్ నాగుల్‌మీరాను నియమించి నియామకపత్రాన్ని అందజేశారు. తనకు బాధ్యతలు అప్పగించిన వెంగళరావు యాదవ్‌కు నాగుల్‌మీరా కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పిల్లలను ఏసీ గదిలో పడుకోబెడుతున్నారా..?



ఎండాకాలంలో వేడి, ఉక్కపోతల కారణంగా చిన్న పిల్లలు చికాకుగా ఏడుస్తూ అసలు నిద్రపోరు. దీంతో తల్లిదండ్రులు వాళ్లని ఏసీ గదిలో పడుకోబెడుతూ ఉంటారు. చల్లని గాలి తగలడంతో పిల్లలు హాయిగా నిద్రపోతారు. ఇలా పసి పిల్లలను ఏసీ గదిలో పడుకోబెట్టేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి తెలుసుకుందాం.

- చిన్న పిల్లల శరీరం చాలా సున్నితంగా ఉంటుంది. కాబట్టి వాళ్లకి చలి పుట్టకుండా హాయిగా ఉండేలా చూసుకోవాలి. గది ఉష్ణోగ్రత 24 నుంచి 26 డిగ్రీల మధ్య ఉండేవిధంగా ఏసీని నియంత్రిస్తే సరిపోతుంది.
- పసి పిల్లలకు రోగనిరోధక శక్తి బలహీనంగా ఉంటుంది. కాబట్టి ఏసీ గాలి నేరుగా పిల్లలకు సోకకుండా చూసుకోవాలి. చల్లటి గాలి వల్ల పిల్లలకు తలనొప్పి, జలుబు, కండరాల వాపు లాంటి సమస్యలు ఏర్పడవచ్చు. ఏసీ గాలి దిశను మార్చి గదిలో చల్లదనం వ్యాపించేలా చూడాలి.
- ఏసీ గదిలో ఉండడం వల్ల పిల్లలకు దాహంగా అనిపించదు కానీ వాళ్ల శరీరంలో తేమ శాతం తగ్గుతూ ఉంటుంది. దీనివల్ల పిల్లల్లో నిర్జలీకరణ సమస్యలు వస్తాయి. ఇలా కాకుండా తరచూ పిల్లలకు మంచినీళ్లు, కొబ్బరినీళ్లు లేదా పండ్ల రసాలు తాగిస్తూ ఉండాలి.
- చాలామంది.... ఏసీ గాలి లేదా చల్లదనం బయటికి వెళ్లిపోతున్నాయనే ఉద్దేశంతో గది తలుపులు, కిటికీలు పూర్తిగా మూసేస్తూ ఉంటారు. దీనివల్ల గదిలోని గాలి కలుషితమై పిల్లలకు శ్వాసకోశ సమస్యలు వస్తాయి. ఏసి గదిలో కిటికీ లేదా వెంటిలేటర్‌ను కొద్దిగా తెరచి ఉంచడం మంచిది. దీనివల్ల బయటి నుంచి తాజా గాలి లోనికి ప్రవేశిస్తుంది.
- పిల్లలను ఏసి గదిలో పడుకోబెట్టేటప్పుడు వాళ్లకి పలుచని కాటన్ దుస్తులు వేయాలి. వీటికి ఉండే సన్నని రంధ్రాల నుంచి చల్లని గాలి పిల్లల చర్మానికి సోకుతుంది. దీంతో పిల్లలు చికాకు పడకుండా హాయిగా పడుకుంటారు.
- ఏసీ ఫిల్టర్లలో ఎక్కువగా దుమ్ము, ధూళి చేరుతూ ఉంటాయి. వీటిని తరచూ శుభ్రం చేస్తూ ఉండాలి. లేకుంటే పిల్లలకు తుమ్ములు, దగ్గు, ముక్కు కారడం, డస్ట్ అలెర్జీ లాంటి సమస్యలు వస్తాయి.

జీడిమామిడి పండు అనగానే మనకు కమ్మని జీడిపప్పు గుర్తుకువస్తుంది. ఈ పండుకు కింది భాగంలో జీడి పిక్క వేలాడుతూ ఉంటుంది. దీనిని కాల్చి లోపలి నుంచి జీడిపప్పును బయటికి తీస్తారు. జీడిమామిడి పండు తియ్యగా పుల్లగా కొంచెం వగరుగా విభిన్న రుచిలో ఉంటుంది. చాలామంది దీనిమీద ఉప్పు, కారం చల్లుకుని తింటూ ఉంటారు. దీంతో కూర, పులుసు లాంటివి కూడా చేస్తూ ఉంటారు. అలాంటి నోరూరించే జీడిమామిడి రుచులు మీ కోసం..

జీడిమామిడితో విభిన్న రుచులు..

వంటిల్లు



జీడిమావిడి పండ్లలో ఔషధ గుణాలు అధికంగా ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్త హీనత తగ్గుతుంది. శిరోజాలు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. కంటి చూపు మెరుగుపడుతుంది. ఆర్థరైటిస్ సమస్యలు రావు. క్యాన్సర్ కారకాలను అడ్డుకోవడంలో జీడిమామిడి చక్కగా పని చేస్తుంది.

జీడిమామిడి కూర



కావాల్సిన పదార్థాలు

జీడిమామిడి పండ్లు- అయిదు, చింతపండు- పావు కప్పు, ఉల్లిపాయలు- రెండు, ఉప్పు- అర చెంచా, కారం- అర చెంచా నూనె- రెండు చెంచాలు, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, పచ్చిశనగపప్పు- అర చెంచా, మినప్పప్పు- ఒక చెంచా, ఇంగువ- చిటికెడు, పసుపు- పావు చెంచా, కరివేపాకు- రెండు రెమ్మలు, బెల్లం- రెండు చిన్న ముక్కలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం

- జీడిమామిడి పండ్లను పెద్ద ముక్కలుగా కోయాలి. చింతపండును నీళ్లలో నానబెట్టి గుజ్జు తీయాలి. ఉల్లిపాయలను చీలికల్లా కోయాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో జీడిమామిడి ముక్కలు వేసి అవి మునిగే వరకూ నీళ్లు పోసి చిటికెడు ఉప్పు వేసి అయిదు నిమిషాలు ఉడికించాలి. తరవాత నీళ్లు వంచేయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నూనె, ఆవాలు, జీలకర్ర, ఇంగువ, పసుపు, పచ్చిశనగపప్పు, మినప్పప్పు, కరివేపాకు వేసి బాగా వేపాలి. తరవాత ఉల్లిపాయ చీలికలు వేసి కలపాలి. అవి వేగాక ఉడికించిన జీడిమామిడి పండ్ల ముక్కలు, ఉప్పు, కారం, చింతపండు గుజ్జు, బెల్లం వేసి కలపాలి. మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత కొత్తిమీర చల్లి దించాలి. ఈ కూర అన్నం, చపాతీల్లోకి రుచిగా ఉంటుంది.

జాగ్రత్తలు

- ఉల్లిపాయలను లావుపాటి చీలికల్లా కోస్తే కూర రుచి బాగుంటుంది. వీటిని మరీ మెత్తగా మగ్గించకూడదు.
- చింతపండు గుజ్జును చిక్కగా తీయాలి. లేదంటే కూర ముద్దగా అవుతుంది.

జీడిమావిడి పండ్ల జ్యూస్

కావాల్సిన పదార్థాలు

జీడిమామిడి పండ్లు- పది, పంచదార- ఒక కప్పు, మిరియాల పొడి- ఒక చెంచా, ఉప్పు- అర చెంచా, నిమ్మ రసం- రెండు చెంచాలు, చల్లటి నీళ్లు- రెండు గ్లాసులు

తయారీ విధానం

- జీడిమామిడి పండ్లను శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కోయాలి.
- మిక్సీ గిన్నెలో ఉప్పు, పంచదార, మిరియాల పొడి, జీడిమామిడి పండ్ల ముక్కలు వేసి ఒక గ్లాసు చల్లటి నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత ఈ మిశ్రమాన్ని మరో గిన్నెలోకి వడబోయాలి. ఇందులో ఒక గ్లాసు చల్లటి నీళ్లు, నిమ్మరసం కలపాలి. ఇలా తయారు చేసిన జ్యూస్‌ని గాజు గ్లాసుల్లో పోసి సర్వ్ చేయాలి. వేసవి కాలంలో ఈ జీడిమామిడి పండ్ల జ్యూస్ తాగితే వడదెబ్బ తగలదు.



జాగ్రత్తలు

- పంచదారకు బదులు బెల్లం వేసుకోవచ్చు.
- జీడిమామిడి పండ్లు కొంచెం వగరుగా అనిపిస్తాయి కాబట్టి కొంచెం తేనె కలిపితే జ్యూస్ రుచి పెరుగుతుంది.

జీడిమామిడి పులుసు

కావాల్సిన పదార్థాలు

జీడిమామిడి పండ్లు- అయిదు, నూనె- రెండు చెంచాలు, ఆవాలు- అర చెంచా, మెంతులు- పావు చెంచా, ఎండు మిర్చి- నాలుగు, కొత్తిమీర- కొద్దిగా, ఇంగువ- పావు చెంచా, కరివేపాకు- కొద్దిగా, పసుపు- పావు చెంచా, చింతపండు- అర కప్పు, బెల్లం- కొద్దిగా, ఉప్పు- తగినంత, కారం- రెండు చెంచాలు, సాంబార్ పొడి- అర చెంచా, బియ్యప్పిండి- రెండు చెంచాలు

తయారీ విధానం

- జీడిమామిడి పండ్లను పెద్ద ముక్కలుగా కోయాలి. కొత్తిమీరను సన్నగా తరగాలి. చింతపండును ఒక గిన్నెలో వేసి నీళ్లు పోసి నానబెట్టి గుజ్జు తీయాలి. బియ్యప్పిండిలో కొన్ని నీళ్లు పోసి కలిపి ఉంచుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నెపెట్టి అందులో నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, మెంతులు, ఎండు మిర్చి, ఇంగువ, కరివేపాకు, పసుపు వేసి బాగా కలపాలి. ఇవి వేగిన తరవాత చింతపండు గుజ్జు, బెల్లం, ఉప్పు, కారం వేసి కలపాలి. ఒక నిమిషం తరవాత రెండు గ్లాసుల నీళ్లు పోసి సాంబార్ పొడి వేసి బాగా మరగనివ్వాలి. ఇందులో జీడిమామిడి పండ్ల ముక్కలు వేసి కలపాలి. ఇవి మగ్గిన తరవాత బియ్యప్పిండి, నీళ్లు కలిపిన మిశ్రమం పోసి కలపాలి. ఒక నిమిషం తరవాత కొత్తిమీర తరుగు వేసి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ పులుసు వేడి అన్నంలోకి బాగుంటుంది.



జాగ్రత్తలు

- జీడిమామిడి పండ్లు మెత్తగా ఉంటాయి. వీటిని ఎక్కువసేపు మగ్గించకూడదు.
- జీడిమామిడి పండ్ల ముక్కలను కొద్దిసేపు ఉప్పునీళ్లలో నానబెడితే వాటి వగరు పోతుంది.
- పులుసు చిక్కగా కమ్మగా కావాలనుకుంటే ఉడికించిన ఆలుగడ్డ ముక్కలు వేసుకోవచ్చు.

సాహసమే శ్వాసగా..!

ఆరు వరుసల రహదారులైనా... వంకర్లు తిరిగిన ఇరుకు రోడ్లయినా... ఎత్తయిన పర్వత ప్రాంతాల్లో అయినా... మార్గం ఎంతటి కఠినమైనదైనా వెనకడుగు వేయరు. ఆత్మవిశ్వాసమే అండగా... సాహసమే శ్వాసగా... మోటర్ సైకిళ్లపై దేశమంతా చుట్టేస్తున్నారు ఈ మహిళలు. అందరూ కలిసి ఒక బృందంగా మారి... 'సీఆర్‌ఎఫ్ ఉమెన్ ఆన్ వీల్స్' పేరుతో... కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు బైక్‌లపై దూసుకుపోతున్నారు. 'ఇది మాకు ఒక అభిరుచి మాత్రమే కాదు... మహిళలు ఎందులోనూ తక్కువ కాదనీ... సంకల్పిస్తే కట్టుబాట్లు దాటి, భయాలను అధిగమించి, కలలను ఛేదించగలమనే బలమైన సందేశం ఇవ్వాలనుకున్నాం' అంటారు బృందంలో ఔత్సాహిక సభ్యురాలైన **శేషారాణి**.

అభిరుచి



"ఎప్పుడూ మా అన్నయ్య బైక్ మీద వెనకాల సీటులో కూర్చొనే ప్రయాణించేదాన్ని. టూర్లకు కూడా వెళుతుండేదాన్ని. 'నేనెప్పుడు డ్రైవింగ్ సీటులో కూర్చొంటానో! హ్యాండిల్ ఎప్పుడు పట్టుకొంటానో!' అని అనుకొనేదాన్ని. నేనూ నడుపుతానంటే... "ఇది నీవల్ల కాదు" అంటూ విసుక్కొనేవాడు అన్నయ్య."

"దూర ప్రాంతాలకు బైక్‌లపై వెళ్లడమంటే ఒకప్పుడు మగవారికే పరిమితమైన అంశం. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. మహిళలు కూడా మేము సైతం అంటున్నారు. దేశవ్యాప్తంగా ఎంతోమంది అమ్మాయిలు తమ లోపల గూడుకట్టుకొని ఉన్న తమ ఆకాంక్షను నెరవేర్చుకొంటున్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ లాంటి హెవీ వెహికిల్స్‌ను ఎంతటి కఠినమైన రోడ్లమీదైనా నడపగలుగుతున్నారు. అలాంటివారందరి స్ఫూర్తితోనే కేరళలో 'సీఆర్‌ఎఫ్ ఉమెన్ ఆన్ వీల్స్' ఆవిర్భవించింది. 'సీఆర్‌ఎఫ్' అంటే 'కాలీకట్ రైడింగ్ ఫ్యామిలీ'. 2016లో ఇది ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు వెయ్యి మందికి పైగా మహిళలు కశ్మీర్, లద్దాఖ్ తదితర ప్రాంతాలకు బైక్‌పై వెళ్లాలన్న తమ కలలను నెరవేర్చుకున్నారు. ఇందులో పద్దెనిమిదేళ్ల యువతుల నుంచి ఐదు పదులు దాటిన వారు కూడా ఉన్నారు. వారిలో ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. కానీ ఒకటే కల... మోటర్ సైకిల్ నడుపుతూ దేశాన్ని చుట్టేయాలని. నాకు తెలిసి ఇంతమంది మహిళా రైడర్స్ ఉన్న క్లబ్ బహుశా మాది ఒక్కటేనేమో!

వెనక సీటు నుంచి...

నాకు కూడా చిన్నప్పటి నుంచి తీరని కల... బైక్ నడపాలని. ఎప్పుడూ మా అన్నయ్య బైక్ మీద వెనకాల సీటులో కూర్చొనే ప్రయాణించేదాన్ని. టూర్లకు కూడా వెళుతుండేదాన్ని. 'నేనెప్పుడు డ్రైవింగ్ సీటులో కూర్చొంటానో! హ్యాండిల్ ఎప్పుడు పట్టుకొంటానో!' అని అనుకొనేదాన్ని. నేనూ నడుపుతానంటే... "ఇది నీవల్ల కాదు" అంటూ విసుక్కొనేవాడు అన్నయ్య. అలా చాలా ఏళ్లు గడిచిపోయాయి. ఉద్యోగ నిమిత్తం అన్నయ్య విదేశాలకు వెళ్లిపోయాడు. దాంతో నన్ను బైక్ మీద తిప్పేవారే లేకుండాపోయారు. అప్పుడు తెలిసింది నాకు... 'సీఆర్‌ఎఫ్' గురించి. వెళ్లి శిక్షణ తీసుకున్నాను. మొదట్లో మా అమ్మానాన్న వద్దంటే వద్దన్నారు. నేను వినలేదు. నచ్చజెబితే చివరకు ఒప్పుకున్నారు. ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. వెనక సీటు నుంచి డ్రైవింగ్ సీటుకు వచ్చాను.

ఆత్మవిశ్వాసమే అండగా...

శిక్షణ తరువాత నాపై నాకు పూర్తి నమ్మకం కలిగింది. నాలుగు నెలల్లోనే మొదటి ప్రయాణం... కాసర్‌గోడ్ నుంచి కన్యాకుమారికి. అది మూడు రోజుల పర్యటన. నా 'ఆర్ఈ క్లాసిక్ 350' మీద వెళ్లాను. ఎలాంటి రోడ్లపై ఎలా నడపాలి? ప్రమాదాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? మహిళలకు ఎదురయ్యే సవాళ్లు ఏంటి?... ఇలా అనేక విషయాలు తెలుసుకోవడానికి ఆ ప్రయాణం ఒక పాఠంలా ఉపయోగపడింది. నా జీవితంలోనే అతిపెద్ద సాహస యాత్ర... బెంగళూరు నుంచి లద్దాఖ్ ట్రిప్. మొత్తం 17 రోజుల టూర్ అది. రెండు నెలల కిందట వెళ్లాం. అందరం మహిళలమే. భయంకరమైన మలుపులు, పర్వతాల అంచున సన్నని, ఏటవాలు మార్గాలు, అనూహ్యమైన వాతావరణ పరిస్థితులు... అడుగడుగునా సవాళ్లు ఎదురవుతాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. బృందాలుగా వెళితే రైడింగ్ అనుభూతే కాదు... అందరం కలిసి ఎన్నో అనుభవాలు పంచుకోవచ్చు. నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను. డెలాయిట్‌లో పని చేస్తున్నాను. ఉద్యోగం చేస్తూనే పర్యటనల కోసం కొన్ని రోజులు కేటాయిస్తున్నాను.



యాభై ఏళ్ల వయసులో...

మాతోపాటు లద్దాఖ్ వచ్చిన బృందంలో సీమా వారియర్ ఒకరు. ఆమెకు ఇప్పుడు 54 ఏళ్లు. రాయల్ ఎన్‌ఫీల్డ్ లాంటి బైక్‌లు నడపాలన్నది ఆమె చిరకాల కోరిక. "నాకు స్కూటర్, కారు ఉన్నాయి. కానీ మోటర్‌సైకిల్ నేను నడపలేను అనేది నా నమ్మకం. చాలాకాలం అదే అపనమ్మకంతో బతికేశాను. మనసులో ఆ వెలితి అలాగే ఉండిపోయింది. ఆగివున్న బుల్లెట్‌లు కనిపిస్తే వాటిపై కూర్చొని ఫొటోలు దిగి సరిపెట్టుకొనేదాన్ని. అయితే కొవిడ్ లాక్‌డౌన్ నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. నా అభిలాష తెలుసుకొని మావారు నా యాభయ్యవ పుట్టినరోజు బహుమతిగా 'రాయల్ ఎన్‌ఫీల్డ్ మెటోర్ 350' కొని ఇచ్చారు. దానికి నేను పెట్టుకున్న ముద్దు పేరు 'పంప్కిన్'. "యాభై ఏళ్ల వయసులో అంత బరువైన బైక్‌ను నువ్వెలా నడపగలవు? పక్కన పెట్టేసేయ్" అని చాలామంది అన్నారు. నేను పట్టించుకోలేదు. చిన్న చిన్న దూరాలకు దానిపై వెళుతూ నేర్చుకున్నాను" అంటూ మా బృందంతో కలిసిన సందర్భంగా సీమా ఎంతో ఉద్వేగంగా చెప్పారు. ఆవిడే కాదు... ఇలా దేశమంతా బైక్‌పై తిరగాలని కలలు గన్న వెయ్యి మందికి పైగా మహిళలు ఇప్పుడు మా కుటుంబ సభ్యులు. వారితో కలిసి సాహస యాత్రలకు వెళ్లినప్పుడు అద్భుతమైన అనుభూతికి లోనవుతాను. ఒక మహిళగా ఇది నేను సాధించిన విజయంగా భావిస్తాను."

నలుపును దాచేసేలా...

మేకప్

ఎండకు చర్మం నల్లబడడం సహజం. నల్లబడిన చర్మం మీద మునుపటిలాగే మేకప్ వేసుకుంటే ఎబ్బెట్టుగా ఉంటుంది. కాబట్టి ఇలాంటి సన్ ట్యాన్‌ను దాచడం కోసం మేకప్‌లో కొన్ని మెలకువలు అదనంగా పాటించాలి.

- **కలర్ కరెక్టర్:** ఎండకు ముఖమంతా సమంగా నల్లబడదు. చెక్కిళ్లు, నుదురు, ముక్కు, చుబుకం...ఇలా ఉబ్బెత్తుగా ఉండే ప్రదేశాలన్నీ కళ తగ్గి, నల్లబడతాయి. కాబట్టి ఈ ప్రదేశాల్లో కలర్ కరెక్టర్ ఉపయోగించాలి. దీన్ని అద్దుకుని, చర్మంలో కలిసిపోయేలా మర్దన చేసి, ఆ తర్వాతే మేకప్ పూర్తి చేసుకోవాలి.



- **కన్‌సీలర్:** ట్యాన్ తీవ్రతను తగ్గించడం కోసం కన్‌సీలర్‌ను కూడా వాడుకోవచ్చు. ఇందుకోసం లిక్విడ్ కన్‌సీలర్‌ను ఎంచుకుని, మచ్చల మీద అప్లై చేసుకోవాలి. అయితే ఈ కన్‌సీలర్ చర్మపు రంగు కంటే ఒకట్రెండు రెట్లు లేత రంగులో ఉండేలా చూసుకోవాలి. గులాబీ రంగు నీలం రంగుల కన్‌సీలర్లకు బదులుగా చర్మపు రంగుతో నప్పే కన్‌సీలర్‌ను వాడాలి.
- **ఫౌండేషన్:** అప్పటికే ఎండకు నల్లబడిన చర్మాన్ని మరింత జాగ్రత్తగా కాపాడుకోవాలి. కాబట్టి మాయిశ్చరైజర్, ఎస్‌పిఎఫ్ ఉండే ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి.
- **ట్రాన్స్‌ల్యుసెంట్ పౌడర్:** మేకప్ చెక్కు చెదరకుండా ఉండడం కోసం ఈ పౌడర్‌ను వాడుకోవాలి. పెద్ద బ్రష్‌తో ఈ పౌడర్‌ను ముఖం మీద పలుచగా అద్దుకోవాలి.

పాలకూర... శక్తిదాయకం

పాలక్యమీషత్కటుకం మధురం పథ్యశీతలమ్
రక్తపిత్తహరం గ్రాహి జ్ఞేయం సంతర్పణం పరమ్

పాలకూర... కొద్దిగా తీపి, కొద్దిగా కారం, సున్నితమైన రుచి కలిసిన మధురమైన శాకం. 'భోజన కుతూహలం' గ్రంథం దీన్ని శక్తిదాయకమైన, అన్ని వ్యాధుల్లోనూ తినదగిన శాకంగా పేర్కొంది. ఇది శీతల గుణంతో రక్తనాళాల సమస్యలు, జీర్ణవ్యాధుల నివారణలో సహాయపడుతుంది. రోగనిరోధకతను బలోపేతం చేస్తుంది. రక్తస్రావాన్ని, రక్తనాళాలపై ఒత్తిడిని తగ్గిస్తుంది. చలవ చేస్తుంది.

మలబద్ధకానికి ఉపశమనం

పాలకూర అత్యంత సురక్షితమైన ఆకు కూరల్లో ఒకటి. మలబద్ధకాన్ని తగ్గించి కాలవిరేచనం కలిగిస్తుంది. నీళ్ల విరేచనాలతో బాధపడేవారి దేహంలోని నీటి శాతం నియంత్రణకు తోడ్పడుతుంది.

సీరియల్ ప్రభావం

1930లలో వచ్చిన 'పొపేయి ది సైలర్ మ్యాన్' అనే కార్టూన్ పాత్ర, పాలకూర తింటూ అకస్మాత్తుగా బలాన్ని పొందే కథనం... ఈ కూరకు అమెరికా పిల్లలలో మంచి ఆదరణ తెచ్చింది. అది అతిశయోక్తి అయినా, పాలకూర శక్తిమంతమైనదనే నిజాన్ని చాటిచెప్పింది.

ఆధునిక వైద్య శాస్త్రం ఏమంటోంది?

పాలకూరలో ఉన్న ఆహార నైట్రేట్లు (డైటరీ నైట్రేట్స్) శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి, రక్తనాళాలపై ఒత్తిడిని తగ్గిస్తాయి. పాలకూరను రక్తపోటు నియంత్రించడంలో సహాయపడే ఆహారద్రవ్యంగా... 2021లో 'యూరోపియన్ జర్నల్ ఆఫ్ ఎపిడెమియాలజీ' పేర్కొంది. దీనిలో విటమిన్ బి9 (ఫోలేట్), మెగ్నీషియం, లూటీన్ లాంటి సూక్ష్మపోషకాలు మెదడు, కళ్ళ ఆరోగ్యాన్ని సమర్థంగా పెంపొందిస్తాయి. ఇది విద్యార్థులకు అవసరమైన మేధో వృద్ధి, జ్ఞాపకశక్తి మెరుగుదల కలిగించే ఆహారం. పాలకూరలో ఉండే ఎస్‌క్యూడీజీ అనే లిపిడ్లు వైరస్ పునరుత్పత్తి ప్రక్రియను నిరోధించగలవని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అవి కేన్సర్ కణాల అభివృద్ధిని కూడా అడ్డుకోగలవని చెబుతున్నాయి.

జాగ్రత్తలు అవసరం

పేగుల ఆరోగ్యానికి, కాలేయ సంరక్షణకు పాలకూర బాగా పనిచేస్తుంది. పాలకూర ఆకుల్లోని పత్రహరితంలో 'థైలాకోయిడ్' అనే పొర ఉంటుంది. ఇది కిరణజన్య సంయోగక్రియను పెంపు చేస్తుంది. అలాగే 'లిపేజ్' అనే జీర్ణ ఎంజైమ్ పనిని అడ్డగిస్తుంది. అందువల్ల పాలకూర తిన్నాక మళ్ళీ ఆకలి కలగటానికి ఎక్కువ సమయం పడుతుంది. అందుకే దీన్ని 'సంతర్పణ శక్తి కలిగిన శాకంగా 'భోజనకుతూహలం' అభివర్ణించింది. అయితే... పాలకూర వాతం, కఫం కొద్దిగా పెంచవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. దీన్ని ఎక్కువగా తినడం వల్ల మూత్రపిండంలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది. కాబట్టి వాత, కఫ దోషాలున్న వారు మితంగా తీసుకోవాలి.

భోజన కుతూహలం


పాలకూరలో పోషకాలు...

విటమిన్లు: ఎ, బి6, బి9, బి12, సి, ఇ, కె

ఖనిజాలు: మెగ్నీషియం, మాంగనీస్, ఇనుము, కాల్షియం, పొటాషియం

యాంటీఆక్సిడెంట్లు: లూటీన్, బీటా-కెరోటిన్, ఫ్లావనాయిడ్స్

ఆహార పీచు (ఫైబర్): జీర్ణకోశానికి మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది.



అపోహలూ, నిజాలూ

కొంతమంది ఆకుకూరలు నులిపురుగులకు కారణమని భావిస్తారు. కానీ పాలకూరలోని యాంటీఆక్సిడెంట్లు, డీటాక్సిఫైయింగ్ గుణాలు నులిపురుగుల పెరుగుదలను అడ్డుకుంటాయి. మద్యం సేవించడం వల్ల కాలేయం మీద కలిగే ఒత్తిడిని తగ్గించడంలో కూడా ఇది తోడ్పడుతుంది. ఉబ్బసం, జీర్ణ సంబంధ వ్యాధుల నివారణలో మంచి ప్రభావం చూపుతుంది.

• గంగరాజు అరుణాదేవి

ఖుషీ ఖుషీగా..

సుంకాల అమలు వాయిదాతో మార్కెట్లో జోరుగా కొనుగోళ్లు

- సెన్సెక్స్ 1,310 పాయింట్లు అప్
- మళ్లీ 75,000 ఎగువకు సూచీ

ముంబై: భారత్‌పై 26 శాతం అదనపు సుంకాల అమలును ట్రంప్ 90 రోజులు వాయిదా వేయడంతో స్టాక్ మదుపరుల్లో సంతోషం ఉప్పొంగింది. వారాంతం ట్రేడింగ్‌లో వారు అమితోత్సాహంతో కొనుగోళ్ల జరపడంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు భారీగా పుంజుకున్నాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,620.18 పాయింట్లు (2.19 శాతం) ఎగబాకి 75,467.33 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 1,310.11 పాయింట్ల (1.77 శాతం) లాభంతో 75,157.26 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 524.75 పాయింట్ల (2.34 శాతం) వృద్ధితో 23,000 స్థాయికి చేరువైంది. చివరికి 429.40 పాయింట్ల (1.92 శాతం) పెరుగుదలతో 22,828.55 వద్ద ముగిసింది. ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.7.85 లక్షల కోట్లు పెరిగి రూ.401.67 లక్షల కోట్లకు (4.66 లక్షలకోట్ల డాలర్లు) చేరింది. ఈ వారం మొత్తానికి మాత్రం సెన్సెక్స్ 207.43 పాయింట్లు, నిఫ్టీ 75.9 పాయింట్ల నష్టాన్ని చవిచూశాయి.

రూపీ హైజంప్: భారత కరెన్సీ విలువ భారీగా పుంజుకుంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్క రోజే 58 పైసలు బలపడి రూ.86.10 వద్ద ముగిసింది.

ఎన్ఎస్ఈ.. 22 కోట్ల ఇన్వెస్టర్ అకౌంట్లు

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) మరో రికార్డును నమోదు చేసింది. ఈ నెలలో ఎన్ఎస్ఈ ఇన్వెస్టర్ ఖాతాలు (యూనిక్ క్లయింట్ కోడ్స్) 22 కోట్ల మైలురాయిని దాటాయి. 2024 అక్టోబరులో ఎక్స్ఛేంజీ ఇన్వెస్టర్ల ఖాతాలు తొలిసారిగా 20 కోట్లకు చేరుకోగా.. ఆరు నెలల్లోనే మరో 2 కోట్ల మేర పెరగడం విశేషం. కాగా, ఈ మార్చి 31 నాటికి ఎన్ఎస్ఈ రిజిస్టర్డ్ ఇన్వెస్టర్ల సంఖ్య 11.3 కోట్లకు చేరుకుంది.

ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడులు..
11 నెలల కనిష్ఠం

ఈ ఏడాది మార్చిలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పథకాల్లోకి పెట్టుబడులు 11 నెలల కనిష్ఠ స్థాయి రూ.25,082 కోట్లకు తగ్గాయి. సుంకాల దెబ్బకు స్టాక్ మార్కెట్లు తీవ్ర ఊగిసలాటలకు లోనవుతుండటం ఇందుకు కారణం. ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడుల ప్రవాహం తగ్గడం వరుసగా ఇది మూడో నెల. ఈ ఫిబ్రవరితో పోలిస్తే గత నెలలో పెట్టుబడులు 14 శాతం మేర తగ్గాయి. కాగా, మార్చిలో క్రమానుగుత పెట్టుబడుల పథకాల్లో (సిప్)కి పెట్టుబడులు 4 నెలల కనిష్ఠ స్థాయి రూ.25,925 కోట్లకు పరిమితమయ్యాయి.



ఓలా ఎలక్ట్రిక్.. రోడ్‌స్టర్ ఎక్స్ బైక్
ప్రారంభ ధర రూ.84,999

న్యూఢిల్లీ: విద్యుత్ టూ వీలర్ల దిగ్గజం ఓలా ఎలక్ట్రిక్ తమిళనాడులోని కృష్ణగిరి ప్లాంట్ నుంచి తొలి రోడ్‌స్టర్ ఎక్స్ మోటార్ సైకిల్‌ను విడుదల చేసింది. ఈ బైక్ దేశంలో విద్యుత్ వాహనాల విప్లవాన్ని మరో మెట్టు పైకి ఎక్కిస్తుందని కంపెనీ చైర్మన్, ఎండీ భవిష్ అగర్వాల్ అన్నారు. ఈ బైక్ విక్రయాలు ఈ నెలలోనే ప్రారంభం కానున్నాయి. ఈ రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్ సర్వీసింగ్‌కు అనుకూలమైన బ్యాటరీ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (బీఎంఎస్) కలిగి ఉంటుంది. మూడు వేరియెంట్లలో అందుబాటులో ఉండే ఈ బైక్ ధరలు వరుసగా రూ.84,999, రూ.94,999,రూ.1,04,999గా ఉన్నాయి. ఇవి కాకుండా టాప్ వేరియెంట్ రోడ్‌స్టర్ ఎక్స్+4.5 కిలోవాట్ల బ్యాటరీతో కూడిన బైక్ ధర రూ.1,14,999గా ఉండగా రోడ్‌స్టర్ ఎక్స్+9.1 కిలోవాట్ల బ్యాటరీ (4680 భారత్ సెల్)తో కూడిన ధర రూ.1,84,999గా ఉంది.

పసిడి రూ.96,000 దాటి..

- ఒక్కరోజే రూ.6,250 పెరుగుదల
- రూ.96,450కి చేరిన 10 గ్రాముల ధర
- సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి ఇది..
- రూ.2,300 పెరిగి రూ.95,500కు చేరుకున్న కిలో వెండి రేటు
- అంతర్జాతీయ మార్కెట్లో 3,200 డాలర్లు దాటిన ఔన్స్ గోల్డ్
- అమెరికా-చైనా ట్రేడ్ వార్ ఎఫెక్ట్



న్యూఢిల్లీ: పసిడి తగ్గినట్టే తగ్గి మళ్లీ కొండెక్కింది. ఈసారి మరింత పైకి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం 10 గ్రాముల ధర శుక్రవారం ఒక్కరోజే రూ.6,250 పెరిగి సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.96,450కి చేరింది. దేశీయంగా 10 గ్రాముల బంగారం రూ.96,000 దాటడం ఇదే తొలిసారి. 99.5 శాతం స్వచ్ఛత లోహం సైతం ఇదే స్థాయిలో పెరిగి రూ.96,000గా నమోదైంది. కిలో వెండి సైతం రూ.2,300 పెరుగుదలతో రూ.95,500 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో విలువైన లోహాలకు డిమాండ్ అమాంతం పెరగడం ఇందుకు ప్రధాన కారణం. అమెరికా-చైనా మధ్య సుంకాల యుద్ధం తీవ్ర రూపం దాల్చడంతో అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 3,249 డాలర్లకు ఎగబాకింది. సిల్వర్ మళ్లీ 32 డాలర్లకు చేరువైంది. భారత్ సహా ఇతర దేశాలపై సుంకాల అమలును 90 రోజుల పాటు వాయిదా వేసిన ట్రంప్.. చైనాపై సుంకాలను మాత్రం మరింత పెంచి అమలులోకి తెచ్చారు. దాంతో చైనా కూడా దీటుగా అమెరికాపై సుంకాలు పెంచింది. ఈ రెండు ప్రధాన దేశాల మధ్య సుంకాల యుద్ధం అంతర్జాతీయ ఎగుమతి వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపనుందని, ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగించవచ్చన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగా డాలర్ మరింత బలహీనపడటం కూడా బులియన్ ర్యాలీకి మరో కారణమైంది.

మరింత పైకేనా..? మళ్లీ కిందికా..?

పసిడి ధరల భవిష్యత్ గమనంపై మిశ్రమ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాణిజ్య యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితులు, మాంద్యం, ద్రవ్యోల్బణం మళ్లీ పెరగవచ్చన్న భయాందోళనల నేపథ్యంలో బంగారం మరింత పెరగనుందని యూబీఎస్, గోల్డ్‌మన్ శాక్స్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సిటీ గ్రూప్, మాక్వేరీ వంటి అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థలు భావిస్తున్నాయి. ఈ ఏడాదిలో ఔన్స్ గోల్డ్ 3,500 డాలర్ల వరకు పెరగవచ్చని అంచనా వేశాయి. అంతర్జాతీయ ఆర్థిక సలహాల సంస్థ డెవేర్ గ్రూప్ 4,500 డాలర్ల వరకు పెరిగే అవకాశాల్లేకపోలేవని అంటోంది. అయితే, దీర్ఘకాలికంగా గోల్డ్ బుల్లిష్‌గానే కన్పిస్తున్నప్పటికీ స్వల్ప, మధ్యకాలికంగా భారీ దిద్దుబాటుకు లోనుకావచ్చన్న అంచనాలూ ఉన్నాయి. వినియోగ డిమాండ్‌తో సంబంధం లేకుండా బంగారం ధర ఈ ఏడాదిలో అతివేగంగా పెరుగుతూ వచ్చిందని పేస్ 360 చీఫ్ గ్లోబల్ స్ట్రాటజిస్ట్ అమిత్ గోయల్ అంటున్నారు. వచ్చే 6-10 నెలల్లో ఔన్స్ గోల్డ్ ధర మళ్లీ 2,400-2,600 డాలర్ల వరకు పడిపోయే అవకాశాలున్నాయని ఆయన అంచనా వేశారు. పసిడిలో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి అది మంచి అవకాశమని గోయల్ పేర్కొన్నారు.

మార్చి త్రైమాసికంలో రియల్టీలోకి నిధుల వెల్లువ

న్యూఢిల్లీ: దేశీయ రియల్ ఎస్టేట్ రంగంలోకి జనవరి-మార్చి త్రైమాసికంలో ఈక్విటీ నిధులు 74% పెరిగి 290 కోట్ల డాలర్లకు (రూ.24,940 కోట్లు) చేరాయి. డెవలపర్ల కార్యకలాపాలు పెరగడంతో పాటు ఈ రంగంలో పెట్టుబడి పెట్టేందుకు రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు (రీట్స్), సంస్థాగత ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడం ఇందుకు కారణం. గత ఏడాది ఇదే కాలంలో ఈ పెట్టుబడుల విలువ 170 కోట్ల డాలర్లని (రూ.14,620 కోట్లు) రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సీబీఆర్ఈ చైర్మన్, సీఈఓ అన్షుమన్ మాగజైన్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన ప్రతికూలతలను కూడా తట్టుకుని భారత రియల్ ఎస్టేట్ రంగం బలంగా నిలిచిందని ఆయన అన్నారు.

2032 నాటికి 30 వేల మెగావాట్ల అదనపు సామర్థ్యం జోడింపు : ఎన్‌టీపీసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎన్‌టీపీసీ 2031-32 నాటికి అదనంగా 30 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ సామర్థ్యం జోడించాలని నిర్ణయించింది. గతంలో 26 వేల మెగావాట్లుగా నిర్ణయించుకున్న ఈ లక్ష్యాన్ని ఇప్పుడు ఎగువకు సవరించింది. కాగా 2026 ఆర్థిక సంవత్సరానికి సంస్థ 3580 మెగావాట్ల అదనపు జోడింపు లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇది కాకుండా 5 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం కూడా జోడించనుంది.

లైసెన్సులు, దరఖాస్తులకు ఆర్‌బీఐ ప్రవాహ్

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నుంచి లైసెన్సులు, అనుమతులు, ఆథరైజేషన్లు పొందాలనుకుంటున్న సంస్థలు.. దరఖాస్తుల సమర్పణకు ప్రవాహ్ పోర్టల్‌ను వినియోగించుకోవాల్సి ఉంటుంది. మే 1 నుంచి ప్రవాహ్ పోర్టల్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని తన నియంత్రణలోని సంస్థలు సహా అన్నింటినీ ఆర్‌బీఐ ఆదేశించింది. నియంత్రణాపరమైన అనుమతుల ప్రక్రియ అంతటినీ సంపూర్ణంగా డిజిటలైజ్ చేయాలన్న లక్ష్యంలో భాగంగా ఆర్‌బీఐ ప్రవాహ్ వేదికను గత ఏడాది మే 28న ప్రారంభించింది.

పారిశ్రామికవేత్త మధుర్ బజాజ్ కన్నుమూత



ముంబై: ప్రముఖ పారిశ్రామికవేత్త, బజాజ్ ఆటో వైస్-చైర్మన్ మధుర్ బజాజ్ (73) అస్వస్థతతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అనారోగ్యం కారణంగా కొద్ది రోజుల క్రితం ఆయనను బ్రీచ్‌కాండీ ఆస్పత్రిలో చేర్చారు. రెండు రోజుల క్రితం ఆయనకు స్ట్రోక్ కూడా వచ్చింది. శుక్రవారం తెల్లవారు ఝామున 5 గంటల సమయంలో ఆయన కన్ను మూసినట్టు కుటుంబ సభ్యులు ప్రకటించారు. మధుర్ బజాజ్ గ్రూప్‌నకు చెందిన పలు కంపెనీల బోర్డు సభ్యుడుగా పని చేశారు. 2005-07 సంవత్సరాల మధ్య కాలంలో ఆయన సియామ్ (భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం) అధ్యక్షుడుగా పని చేశారు.

ఆరు నెలల కనిష్ఠానికి ఐఐపీ

న్యూఢిల్లీ: దేశంలో పారిశ్రామిక రంగం మరోసారి నిరుత్సాహపూరితమైన వృద్ధిని నమోదు చేసింది. ఫిబ్రవరిలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 6 నెలల కనిష్ఠ స్థాయి 2.9 శాతానికి దిగజారింది. గత ఏడాది ఫిబ్రవరిలో 5.6% ఉంది. తయారీ, గనులు, విద్యుత్ రంగాలు నిరాశావహమైన వృద్ధిని నమోదు చేయడం ఇందుకు కారణం. గత ఏడాది ఆగస్టులో జీరో శాతం వృద్ధిని నమోదు చేసిన తర్వాత నమోదైన మరో కనిష్ఠ స్థాయి ఇదే.

మివి నుంచి 'ఏఐ బడ్స్'

జూన్‌లో మార్కెట్లోకి.. ధర 10,000 లోపే



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కృత్రిమ మేధ (ఏఐ) కొత్త పుంతలు తొక్కుతోంది. రోజువారీ జీవితాన్ని మరింత సులభం చేస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ స్టార్టప్ కంపెనీ 'మివి' అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత వాయిస్ టూల్ సంచలనం సృష్టిస్తోంది. ఈ టూల్ ఆధారంగా కంపెనీ ఇప్పటికే ఏఐ ఇయర్ బడ్స్‌ను అభివృద్ధి చేసింది. ఈ ఏడాది జూన్‌లో ఈ బడ్స్ మార్కెట్లోకి విడుదల కానున్నాయి. వీటి ధర కూడా అందరికీ అందుబాటులో ఉండేలా రూ.10,000 కంటే తక్కువగానే నిర్ణయించనున్నట్టు కంపెనీ సహ వ్యవస్థాపకులు, సీఎంఓ మిధుల దేవభక్తుని చెప్పారు. ఈ ఏఐ బడ్స్‌ను చెవిలో పెట్టుకుని తోటి మనిషితో మాట్లాడినట్టు మాట్లాడి మన ప్రశ్నలు, సందేహాలు అన్నిటికీ సమాధానాలు రాబట్టుకోవచ్చు. అది కూడా మనకు బాగా సన్నిహితులైన వ్యక్తులతో మాట్లాడుతున్న అనుభూతితో. ఏ వంటకం ఎలా ప్రిపేర్ చేయాలనే విషయం మొదలుకుని, తాజా వార్తల వరకు చక్కటి స్వరంతో అప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం ఈ టూల్ ప్రత్యేకత.

ఇదే తొలిసారి: కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించినంత వరకు ప్రపంచంలో ఇదే తొలి వాయిస్ ఆధారిత ఏఐ ఉత్పత్తి. 'మివి ఏఐ' ద్వారా మేము కేవలం ఒక ఉత్పత్తిని మాత్రమే మార్కెట్లోకి విడుదల చేయడం లేదు. మానవ-ఏఐ సంభాషణ భవిష్యత్‌ను మేము నిర్వచించబోతున్నాం. ఇది అంతర్జాతీయ సృజనాత్మకతను సమూలంగా మార్చివేస్తుంది. ఈ ప్రయాణంలో మివి ఏఐ బడ్స్ తొలి అడుగు మాత్రమే' అని మిధుల అన్నారు. తొలుత ఇంగ్లీషులో మాత్రమే ఈ ఏఐ బడ్స్ లభిస్తాయి. త్వరలో దీన్ని అన్ని భారతీయ భాషలకు విస్తరింప చేస్తారు. ముందు మివి వెబ్‌సైట్ ద్వారా, తర్వాత మిగతా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఈ బడ్స్ విక్రయిస్తారు. కాగా, హైదరాబాద్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న తమ ప్లాంట్‌లో ఈ ఏడాది జూన్ కల్లా ఉత్పత్తి ప్రారంభమవుతుందని మిధుల చెప్పారు.



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	110	విజయవాడ	125
వరంగల్	110	గుంటూరు	122
కరీంనగర్	110	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	88
కర్నూలు	110	నెల్లూరు	93
విశాఖపట్నం	119	అనంతపురం	93
గోదావరి	125		



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ			
హైదరాబాద్	390	విజయవాడ	420
వరంగల్	392	గోదావరి	415
చిత్తూరు	460	విశాఖపట్నం	435
		దజను గుడ్లు రూ. 60	



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,400 ▲	87,450 ▲	1,08,000 ▲
విజయవాడ	96,300 ▲	90,000 ▲	96,000 ▲
విశాఖపట్నం	93,680 ▲	85,870 ▲	93,280 ▲
రాజమండ్రి	95,400 ▲	87,450 ▲	95,500 ▲
ప్రొద్దుటూరు	93,100 ▲	85,560 ▲	95,400 ▲
ముంబై	93,353 ▲	85,511 ▲	92,929 ▲



చెన్నై.. అదే కథ

- 103 పరుగులకే ఆలౌట్
- వరుసగా ఐదో ఓటమి
- కోల్‌కతా ఘనవిజయం
- నరైన్ ఆల్‌రౌండ్‌షో

చెన్నై: మాజీ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ నుంచి మరో నిరాశాజనక ప్రదర్శన. ఎంఎస్ ధోనీ జట్టు పగ్గాలు చేపట్టినా.. ఆట తీరులో ఎలాంటి మార్పూ కనిపించలేదు. ఈసారి బ్యాటింగ్‌లో మరింత దారుణ వైఫల్యం కనబర్చగా.. అటు స్వల్ప స్కోరును కాపాడే క్రమంలో బౌలర్లు కూడా తేలిపోయారు. ప్రత్యర్థి కోల్‌కతా నైట్‌రైడర్స్ మాత్రం అదరగొట్టింది. ముఖ్యంగా స్పిన్నర్ సునీల్ నరైన్ (3/13; 18 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 44) బంతితో, బ్యాట్‌తోనూ మెరిశాడు. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో కోల్‌కతా 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ఐపీఎల్ చరిత్రలో చెన్నై ఇలా వరుసగా ఐదు మ్యాచ్‌లు ఓడడం ఇదే తొలిసారి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 9 వికెట్లకు 103 పరుగులు చేసింది. శివమ్ దూబే (31 నాటౌట్), విజయ్ శంకర్ (29) పర్వాలేదనిపించారు. వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో కోల్‌కతా కేవలం 10.1 ఓవర్లలో 107/2 స్కోరు చేసి గెలిచింది. డికాక్ (23), రహానె (20 నాటౌట్), రింకూ సింగ్ (15 నాటౌట్) రాణించారు. నూర్ అహ్మద్, అన్షుల్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా సునీల్ నరైన్ నిలిచాడు.

61 బంతుల్లోనే ముగించారు: చెన్నై బ్యాటర్లు చెమటోడ్చిన అదే పిచ్‌పై నైట్‌రైడర్స్ మాత్రం ఓవర్‌కు పది పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. ఓపెనర్లు నరైన్, డికాక్ మెరుపు ఆరంభం అందించారు. స్పిన్, పేస్ తేడా లేకుండా బౌండరీలతో హోరెత్తించారు. దీంతో 104 పరుగుల ఛేదనలో ఈ జట్టు పవర్‌ప్లేలోనే 71/1 స్కోరుతో నిలిచింది. మూడో ఓవర్‌లో డికాక్ రెండు సిక్సర్లు బాదగా.. తర్వాతి ఓవర్‌లో నరైన్ 4,6తో ఆకట్టుకున్నాడు. అయితే ఐదో ఓవర్‌లో డికాక్‌ను పేసర్ అన్షుల్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ ఆరో ఓవర్‌లో రహానె 6, నరైన్ 6,4తో 18 పరుగులు రావడంతో పవర్‌ప్లేలోనే ఈ జట్టు సగానికి కంటే ఎక్కువ రన్స్ రాబట్టింది. అశ్విన్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో జోరు చూపిన నరైన్‌ను స్పిన్నర్ నూర్ బౌల్డ్ చేశాడు. అప్పటికే విజయానికి అతి సమీపంలో వచ్చిన జట్టుకు రింకూ సింగ్ సిక్సర్ బాది 59 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

స్పిన్‌కు దాసోహం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై బ్యాటర్లకు కోల్‌కతా స్పిన్నర్లు చుక్కలు చూపించారు. ముఖ్యంగా నరైన్ ధాటికి అటు పరుగులు కాదు కదా.. వికెట్లను కాపాడుకోవడం కూడా కష్టమైంది. నరైన్‌కు తోడు వరుణ్, మొయిన్ అలీ, పేసర్ హర్షిత్ మరో ఎండ్ నుంచి కట్టడి చేయడంతో చెన్నై ఆట టెస్టు మ్యాచ్‌ను తలపించింది. 9-18 ఓవర్ల మధ్య ఓ ఫోర్ కూడా రాబట్టలేకపోయింది. స్పిన్నర్ అలీ నాలుగో ఓవర్‌ను మెయిడిన్ వేసి మరీ ఓపెనర్ కాన్వే (12) వికెట్ తీయగా తర్వాతి ఓవర్‌లోనే మరో ఓపెనర్ రచిన్ (4)ను హర్షిత్ అవుట్ చేశాడు. ఆ వెంటనే విజయ్ శంకర్ కూడా వెనుదిరగాల్సి ఉన్నా వికెట్లప్‌లో అతడిచ్చిన సులువైన క్యాచ్‌ను నరైన్ వదిలేశాడు. రాహుల్ త్రిపాఠి (16)తో కలిసి శంకర్ కాసేపు వికెట్ల పతనం ఆపగలిగాడు. ఇక ఆరో ఓవర్‌లో విజయ్ రెండు ఫోర్లతో జట్టు పవర్‌ప్లేలో 31/2తో నిలిచింది. ఇన్నింగ్స్‌లో ఏకైక సిక్సర్ కూడా ఏడో ఓవర్‌లో విజయ్ శంకరే బాదాడు. అతడి మరో క్యాచ్‌ను వెంకటేశ్ అయ్యర్ వదిలేసినా పదో ఓవర్‌లో వరుణ్‌కు చిక్కాడు. దీంతో మూడో వికెట్‌కు వీరి మధ్య అత్యధికంగా 43 పరుగులు జత చేరాయి. అనంతరం నరైన్ వరుస ఓవర్లలో త్రిపాఠి, జడేజా (0) వికెట్లు తీయగా.. అశ్విన్ (1)ను హర్షిత్ పెవిలియన్ చేర్చాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన దీపక్ హుడాను వరుణ్ డకౌట్ చేయగా.. ప్రేక్షకుల హోరు మధ్య క్రీజులోకి వచ్చిన ధోనీ (1) సైతం జట్టును ఆదుకోలేకపోయాడు. నరైన్ ఓవర్‌లో ఎల్బీ కాగా ధోనీ రివ్యూ కోరాడు. అయితే రీప్లేలో బంతి బ్యాట్‌కు తాకినట్టు స్పైక్స్ వచ్చినా థర్డ్ అంపైర్ అవుట్‌గానే ప్రకటించడంతో స్టేడియం మూగబోయింది. అటు స్పిన్‌ను అద్భుతంగా ఆడే దూబే క్రీజులోనే ఉన్నా భారీ షాట్లు ఆడడం కష్టమైపోయింది. చివరకు 63 బంతుల తర్వాత 19వ ఓవర్‌లో అతను చెన్నై జట్టుకు ఓ ఫోర్ అందించాడు. అలాగే ఆఖరి ఓవర్‌లో దూబే రెండు ఫోర్లతో జట్టు అతికష్టంగా వంద పరుగులు దాటగలిగింది.



2 చెన్నైపైఎక్కువ వికెట్లు (26) తీసిన రెండో బౌలర్‌గా నరైన్. మలింగ (31) ముందున్నాడు.

స్కోరుబోర్డు

చెన్నై: రచిన్ (సి) రహానె (బి) హర్షిత్ 4, కాన్వే (ఎల్బీ) మొయిన్ అలీ 12, రాహుల్ త్రిపాఠి (బి) నరైన్ 16, విజయ్ శంకర్ (సి) మొయిన్ అలీ (బి) వరుణ్ 29, శివమ్ దూబే (నాటౌట్) 31, అశ్విన్ (సి) వైభవ్ అరోరా (బి) హర్షిత్ 1, జడేజా (సి) డికాక్ (బి) నరైన్ 0, దీపక్ హుడా (సి) వైభవ్ అరోరా (బి) వరుణ్ 0, ధోనీ (ఎల్బీ) నరైన్ 1, నూర్ అహ్మద్ (సి) వరుణ్ (బి) వైభవ్ అరోరా 1, అన్షుల్ (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 103/9; వికెట్ల పతనం:** 1-16, 2-16, 3-59, 4-65, 5-70, 6-71, 7-72, 8-75, 9-79; **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-0-31-1, మొయిన్ అలీ 4-1-20-1, హర్షిత్ రాణా 4-0-16-2, వరుణ్ చక్రవర్తి 4-0-22-2, సునీల్ నరైన్ 4-0-13-3.

కోల్‌కతా: డికాక్ (బి) అన్షుల్ 23, నరైన్ (బి) నూర్ 44, రహానె (నాటౌట్) 20, రింకూ సింగ్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 10.1 ఓవర్లలో 107/2; వికెట్ల పతనం:** 1-46, 2-85; **బౌలింగ్:** ఖలీల్ 3-0-40-0, అన్షుల్ 2-0-19-1, అశ్విన్ 3-0-30-0, నూర్ 2-0-8-1, జడేజా 0.1-0-9-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	5	4	1	0	8	1.413
ఢిల్లీ	4	4	0	0	8	1.278
కోల్‌కతా	6	3	3	0	6	0.803
బెంగళూరు	5	3	2	0	6	0.539
పంజాబ్	4	3	1	0	6	0.289
లఖ్‌నవూ	5	3	2	0	6	0.078
రాజస్థాన్	5	2	3	0	4	-0.733
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	6	1	5	0	2	-1.554
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

1 చెపాక్ స్టేడియంలో చెన్నైకిదే అత్యల్ప స్కోరు (102). కాగా, ఆ జట్టుకిది ఐపీఎల్‌లో మూడో అత్యల్పం.

టైటిల్ పోరుకు పంకజ్



కార్లో (ఐర్లాండ్): భారత స్టార్ క్యూయిస్ట్ పంకజ్ ఆడ్వాణీ డబ్ల్యూబీఎల్ వరల్డ్ మ్యాచ్‌ప్లే బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో పంకజ్ 7-5తో భారత్‌కే చెందిన శ్రీకృష్ణ సూరిపై విజయం సాధించాడు. బెస్టాఫ్-15 ఫార్మాట్లో సాగుతున్న ఈ టోర్నీలో పంకజ్ టైటిల్‌ఫైట్‌లో ఇంగ్లండ్ క్యూయిస్ట్ డేవిడ్ కేసియర్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. మరో సెమీస్‌లో పీటర్ గిల్‌క్రిస్ట్ (సింగపూర్)ను డేవిడ్ ఓడించాడు.

ఆసియా కప్ ఆతిథ్య రేసులో భారత్

న్యూఢిల్లీ: ఆసియా ఫుట్‌బాల్ కప్‌నకు ఆతిథ్యమిచ్చేందుకు భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) బిడ్ దాఖలు చేసింది. 2031లో జరిగే ఈ టోర్నీ ఆతిథ్య హక్కుల కోసం భారత్ సహా ఆస్ట్రేలియా, ఇండోనేసియా, దక్షిణ కొరియా, కువైట్, యూఏఈ, ఉజ్బెకిస్థాన్ పోటీపడుతున్నాయి. 2027 ఆసియా కప్ నిర్వహణకు కూడా భారత్ బిడ్ వేసినా.. సౌదీ అరేబియాకు ఆతిథ్య హక్కులు దక్కాయి.

నేటి మ్యాచ్‌లు

మ్యాచ్	సమయం	వేదిక
లఖ్‌నవూ X గుజరాత్	మ.3.30	లఖ్‌నవూ
హైదరాబాద్ X పంజాబ్	రా.7.30 నుంచి	హైదరాబాద్

ప్రభుత్వం ఆదుకోవాలి
ఆర్చరీ కోచ్ చెరుకూరి సత్యనారాయణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అంతర్జాతీయ ఆర్చర్లను అందించిన తాను ప్రస్తుతం ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో నలిగిపోతున్నానని ప్రముఖ ఆర్చరీ కోచ్ చెరుకూరి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. లెనిన్, జ్యోతి సురేఖ, ధీరజ్, శివాని, బైరాగి నాయుడులాంటి ప్రఖ్యాత ఆర్చర్లను తయారు చేసిన తనను శాప్ పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలంటూ ఆయన.. విజయవాడలోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో సోమవారం అమరణ నిరాహార దీక్ష చేపట్టారు. అయితే, సీఎం కార్యాలయం తరఫున ఐఏఎస్ ప్రద్యుమ్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో సత్యనారాయణ శుక్రవారం దీక్ష విరమించారు. 'ఏపీలో ఆర్చరీ అభివృద్ధికి నేను చేసిన కృషిని గుర్తించిన సీఎం చంద్రబాబు నాయుడు గారు 2015లో నా అకాడమీ అభివృద్ధికి రూ. కోటి మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అకాడమీని అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్టుగా తీర్చిదిద్దాలని, విదేశీ కోచ్‌లను పెట్టి వారి జీతభత్యాలను కూడా శాప్ చెల్లించేలా చూడాలని అప్పట్లో అధికారులకు సూచించారు. అకాడమీకి దగ్గరలో నాకు ఇల్లు, జీవన భృతిని కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తర్వాత ప్రభుత్వం మారడంతో నన్నెవరూ పట్టించుకోలేదు. గతంలో నాకు ఇచ్చిన హామీలను ఇప్పుడైనా నెరవేర్చాలని వేడుకుంటున్నా. నా సమస్య పరిష్కారానికి సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి' అని సత్యనారాయణ కోరారు.



సత్యనారాయణ



ఫైనల్లో సురేఖ జోడీ

న్యూఢిల్లీ: ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 1 పోటీల్లో భారత్‌కు మూడో పతకం ఖరారైంది. ఈసారి తెలుగమ్మాయి జ్యోతి సురేఖ, రిషబ్ యాదవ్ జోడీ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లి కనీసం రజతాన్ని ఖాయం చేసుకుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో సురేఖ, రిషబ్ ద్వయం 159-155తో స్లోవేనియా జంటను ఓడించింది. శనివారం జరిగే తుదిపోరులో చైనీస్ తైపీతో సురేఖ జోడీ స్వర్ణం కోసం పోరాడనుంది.

కపిల జోడీ పరాజయం

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో జోడీ కూడా నిరాశపరిచింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో భారత ద్వయం 20-22, 13-21తో హాంకాంగ్‌కు చెందిన ఐదో సీడ్ జంట టాంగ్ చున్ మన్/సె యింగ్ సుయెట్ చేతిలో పరాజయంపాలై టోర్నీ నుంచి వెనుదిరిగింది.

ఇది నా గ్రౌండ్
మ్యాచ్ సంబరాలపై కేఎల్ రాహుల్

బెంగళూరు: ఆర్‌సీబీతో గురువారం జరిగిన మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ వీరోచిత ఇన్నింగ్స్ ఢిల్లీ క్యాపిటల్స్‌ను గట్టెక్కించింది. అయితే స్థానిక ఆటగాడైన రాహుల్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాక తీవ్ర ఉద్వేగంతో సంబరాలు చేసుకున్నాడు. ఇందులో భాగంగా తన బ్యాట్‌ను కాస్త పైకి లేపి గ్రౌండ్‌కి బలంగా ఆనించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. అయితే దీనిపై రాహుల్ వివరణ ఇస్తూ.. 'ఈ మైదానం నాకెంతో ప్రత్యేకమైంది. ఇది నా హోంగ్రౌండ్. దీని గురించి నాకన్నా ఎక్కువ ఎవరికి తెలుసు? ఇక నాకెంతో ఇష్టమైన సినిమా కాంతారాలో మాదిరి బ్యాట్ సంబరాలు చేసుకున్నాను' అని రాహుల్ పేర్కొన్నాడు.





నేడు యథావిధిగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఏప్రిల్ 12, రెండో శనివారం యథాతథంగా పనిచేస్తాయని రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా శుక్రవారం ప్రకటించారు. డీఆర్, డీఐజీ కార్యాలయాలు కూడా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు తెరిచే ఉంటాయన్నారు.

రొయ్యల మేత గరిష్ఠ చిల్లర ధర తగ్గింపు

- కిలోకు రూ.4.. నేటి నుంచి అమలు

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అమెరికా సుంకాల నుంచి ఆక్వా రైతులకు ఉపశమనం కల్పించేందుకు శనివారం నుంచి అన్ని కంపెనీల రొయ్యల మేత గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)పై కిలోకి రూ.నాలుగు తగ్గించనున్నట్లు ష్రిమ్ప్ ఫీడ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఎస్ఎఫ్ఎంఏ)అధ్యక్షుడు బీద మస్తాన్‌రావు యాదవ్ ప్రకటించారు. అమెరికా సుంకాల నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాలతో రొయ్యల మేత తయారీ కంపెనీలతో చర్చించి, ఈ నిర్ణయం తీసుకున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంక్షోభ సమయంలో ఆక్వా రైతుల ప్రయోజనాలను కాపాడటంలో సీఎం చంద్రబాబు నిబద్ధతను మస్తాన్‌రావు ప్రశంసించారు.

క్రమశిక్షణా చర్యల్లో అలసత్వం వద్దు

- రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ హరినారాయణ్

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానాకు ఆదాయం తగ్గడానికి కారణమైన ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు అలసత్వం వహిస్తున్నారని, దీంతో ఈ కేసులు గుట్టలుగా పేరుకుపోతున్నాయని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ శుక్రవారం ఇచ్చిన ఒక మెమోలో పేర్కొన్నారు. ఆ ఉద్యోగులు రిటైర్ అయినప్పటికీ ఇంకా ఆ కేసులు పెండింగ్‌లోనే ఉండడంతో వారంతా పెన్షన్ ప్రయోజనాల కోసం హైకోర్టును ఆశ్రయిస్తున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ల శాఖలోని డీఐజీలు, డీఆర్‌లు క్రమశిక్షణ చర్యలు సకాలంలో తీసుకోవడంలో విఫలమవుతున్నారని దీని వల్ల ఖజానాకు నష్టం వాటిల్లుతోందని ఆయన పేర్కొన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం, క్రమశిక్షణ చర్యలను సకాలంలో అమలుచేసేందుకు తక్షణమే జిల్లా స్థాయి కమిటీలను మళ్లీ ఏర్పాటు చేయాలని ఐజీ ఆదేశించారు. గతంలో ఇచ్చిన నిబంధనల మేరకు సకాలంలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కేజీబీవీలకు దరఖాస్తుల వెల్లువ

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో అడ్మిషన్లకు భారీగా దరఖాస్తులు అందాయని సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 14,080 సీట్లకుగాను 32,839 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. 11, 12 తరగతుల్లో దరఖాస్తులకు గడువును ఈనెల 21 వరకు పొడిగించినట్లు తెలిపారు.

రాష్ట్రంలో ప్రభుత్వ ఆటిజం కేంద్రాలు

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు రాష్ట్రంలో ప్రభుత్వ ఆటిజం కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. భవిత, ఆటిజం కేంద్రాలపై జాతీయ స్థాయి నిపుణులు, ప్రముఖ వైద్యులతో శుక్రవారం విజయవాడలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 89 వేల మంది ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులున్నారని తెలిపారు. వారి అభ్యున్నతికి ప్రభుత్వంతో పాటు నిపుణులు, స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో అవసరమని, అందరూ సహకరించాలని కోరారు.

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లుగా మూడు డైట్‌లు

విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు విద్యా శిక్షణ సంస్థ(డైట్)లను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దేందుకు రూ.43.22 కోట్ల నిధులు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

వ్యాయామ విద్యకు మంగళం!

- జూనియర్ కాలేజీల్లో 203 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు రద్దు
- ఇంటర్ విద్య డైరెక్టర్ నిర్ణయంపై సర్వత్రా ఆందోళన



నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మనోవికాసానికి క్రీడలు దోహదపడతాయి. చదువుతో పాటు విద్యార్థి దశలో క్రీడలూ కీలకమే. ఇంత ప్రాముఖ్యత ఉన్న క్రీడలపై ఇంటర్ విద్యా శాఖ ధోరణి విమర్శలపాలవుతోంది. జూనియర్ కాలేజీల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను రద్దు చేస్తూ ఆ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం విద్యార్థుల శారీరక ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేసింది. వ్యాయామ ఉపాధ్యాయుల భవిష్యత్తును అగమ్యగోచరం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీడీ పోస్టులను రద్దు చేస్తూ విద్యా శాఖ డైరెక్టర్ కృతిక శుక్లా ఆదేశాలిచ్చారు. ఈ మేరకు 203 మంది పీడీలను ఇతర సబ్జెక్టులకు బదలాయిస్తూ 3న ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిజానికి గత 22 ఏళ్ల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులకు అర్హత ఉన్నా పదోన్నతులు చేపట్టలేదు. అంతేకాకుండా పీడీ పోస్టుల నియామకం కూడా చేపట్టకపోవడంతో రెండు దశాబ్దాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా పీడీ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. కొన్నేళ్లుగా రాష్ట్రంలో 84 కొత్త జూనియర్ కళాశాలలకు రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడంతో కేవలం కాంట్రాక్టు అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం బదలాయించిన, సర్దుబాటు చేసిన పోస్టులను ఈ కళాశాలలకు కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 455 పోస్టులకు గాను 214 పోస్టులు సర్దుబాటు చేయగా, 241 పోస్టులను బదలాయిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో పీడీ పోస్టుల రద్దుపై రాష్ట్రవ్యాప్తంగా వ్యాయామ ఉపాధ్యాయులు ఆందోళనకు సిద్ధమైనట్లు సమాచారం.

జోన్‌ల వారీగా పీడీ పోస్టులు ఇలా...

జోన్	రద్దు అయిన పీడీ పోస్టులు	ఉమ్మడి జిల్లాలు
జోన్ 1	43	విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం
జోన్ 2	39	కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి
జోన్ 3	35	నెల్లూరు, ప్రకాశం, గుంటూరు
జోన్ 4	86	కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు

పదోన్నతులపై స్వయంకృతం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీడీ పోస్టులు ఇన్నేళ్లు ఎందుకు ఖాళీగా ఉన్నాయన్న విషయం చర్చనీయాంశంగా మారింది. వ్యాయామ ఉపాధ్యాయుల్లో సమన్వయలోపమే కారణమని తెలుస్తోంది. గతంలో పదోన్నతుల విషయంలో జడ్పీ, ప్రభుత్వ పాఠశాలల పీఈటీలు సీనియారిటీ విషయం లో కోర్టుకు ఎక్కారు. ఈ విషయం లో ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో పదోన్నతులు నిలిచిపోయాయి. 1998 డీఎస్సీ నుంచి పీఈటీ నియామకాల్లో జడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు అనే తేడా లేకుండా మెరిట్ ప్రాతిపదికన పోస్టులు భర్తీ చేశారు. 2003 తర్వాత ఇంతవరకు వ్యాయామ ఉపాధ్యాయులకు కళాశాలల్లో పీడీలుగా పదోన్నతులు ఇవ్వలేదు. జూనియర్ లెక్చరర్స్‌ను కాంట్రాక్టు కింద తీసుకున్నారే కానీ, ఒక్క పీడీని కూడా కాంట్రాక్టు కింద తీసుకున్న పాపాన పోలేదు.

ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి



రాష్ట్రవ్యాప్తంగా ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయంపై సీఎం చంద్రబాబు జోక్యం చేసుకోవాలి. విద్యాశాఖ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి. ఎంపీఈడీ అర్హత ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు ఎంతోమంది ఉన్నారు. వీరంతా పీడీ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్నారు. కాబట్టి జూనియర్ కళాశాలల్లో ఆటలు కనుమరుగయ్యే పరిస్థితిని నివారించి సమస్యను పరిష్కరించాలి.

- విశ్వనాథ్, పీడీ, దీబగుంట్ల హైస్కూల్, నంద్యాల జిల్లా

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా పూలే జయంతి వేడుకలు

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతిని శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా ఘనంగా నిర్వహించారు. విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా తదితర అధికారులు పాల్గొని పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. మహారాష్ట్రలో జన్మించిన కుల వ్యతిరేక కార్యకర్త, రచయిత, ఆలోచనాపరుడు, సామాజిక సంస్కర్త పూలే అని పేర్కొన్నారు.

మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అమరావతి సచివాలయంలో పలువురు ఉన్నతాధికారులు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. సీఎం కార్యదర్శి రాజమౌళి, సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ తదితర అధికారులు నివాళులర్పించారు.



మహాత్మ పూలేకు నివాళులర్పిస్తున్న సీఎం

టీడీపీ కేంద్ర కార్యాలయంలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర మాజీ ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, కృష్ణమూర్తి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యకు పూలే ప్రాధాన్యం: పవన్

సమాజంలో అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసి, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తపించిన మహనీయుడు స్వర్గీయ జ్యోతిరావు పూలే అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొనియాడారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా ఆయనకు అంజలి ఘటించారు. 'మహిళా సాధికారతకు విద్యే మార్గమని భావించి ప్రతి ఆడబిడ్డకి చదవు అందించేందుకు పూలే, శ్రీమతి సావిత్రాభాయి పూలే చేసిన కృషిని ఎన్నటికి మరువలేం. సత్యం, సమానత్వం అనే సూత్రాల ఆధారంగా సమ, సమాజ స్థాపన సాధ్యమని భావించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం జ్యోతిరావు పూలే భావనలను ఆలంబనగా చేసుకొని బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తుంది' అని పవన్ చెప్పారు.

గుంటూరుకు సెంట్రల్ జీఎస్టీ కార్యాలయం

- రాజధానికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం
- భూమి కొని అవసరమైన భవనాలు నిర్మిస్తాం
- ఏపీలో తిరుపతి సర్కిల్ నుంచి ఎక్కువ ఆదాయం
- కమిషనర్ ఆనంద్‌కుమార్ వెల్లడి



విశాఖపట్నం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని సెంట్రల్ జీఎస్టీ (ఆడిట్) కార్యాలయాన్ని గుంటూరుకు తరలించనున్నట్లు కమిషనర్ ఆనంద్ కుమార్ పులపాక తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నామని చెప్పారు. గుంటూరులో బీఎస్ఎన్ఎల్‌కు చెందిన మూడు ఎకరాల భూమి ఉందని, దానిని కొనుగోలు చేసి.. అక్కడ కార్యాలయంతో పాటు సిబ్బందికి క్వార్టర్స్, ఇతర అవసరమైన భవన సముదాయాలు నిర్మిస్తామన్నారు. మరోవైపు ఏపీలో తిరుపతి సర్కిల్ నుంచి ఎక్కువ ఆదాయం వస్తోందని, అక్కడ కియా మోటార్స్ ఉండడమే అందుకు కారణమని ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్, హెచ్‌పీసీఎల్ వంటివి ఉన్నప్పటికీ, 2024-25లో వాటి ఉత్పత్తి తగ్గడం వల్ల తిరుపతి సర్కిల్ ఆదాయంలో ముందుందని తెలిపారు.

ఆ యూనిట్లపై ఆడిట్లు తగ్గించాం

2025-26 ఆర్థిక సంవత్సరంలో పన్ను ఎగవేతదారుల నుంచి రూ.300 కోట్లు రికవరీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆనంద్ తెలిపారు. రాష్ట్రంలో సెంట్రల్ జీఎస్టీ చెల్లించేవారు 1,81,000 మంది, స్టేట్ జీఎస్టీ చెల్లించేవారు సుమారు 2 లక్షల మంది ఉన్నారని తెలిపారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వృద్ధి చెందాలనే ఉద్దేశంతో వాటిపై ఆడిట్లు తగ్గించామని పేర్కొన్నారు. వీటి తనిఖీలు 2023-24లో 4,140 ఉండగా, 2024-25లో 135కే పరిమితం చేశామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ వ్యాపార సంస్థలు 1,510 కోట్లు పన్ను ఎగవేసినట్టు గుర్తించి, 150 కోట్లు రికవరీ చేశామన్నారు. అంతకు ముందు ఏడాదితో పోల్చుకుంటే రికవరీ 100% పెరిగిందన్నారు.

పన్ను ఎగవేతదారుల్లో 20% మంది బిల్డర్లే

తప్పుడు లెక్కలు చూపించి పన్ను ఎగవేసే వారిలో 20 శాతం మంది బిల్డర్లే ఉన్నారని ఆనంద్‌కుమార్ తెలిపారు. వారికి గతంలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ 18 శాతం వరకు క్లెయిమ్ చేసుకునే వెసులుబాటు ఉండేదని, దానిని ఐదు శాతానికి కుదించామన్నారు. బిల్డర్లు నిర్మించిన అపార్ట్‌మెంట్లు/విల్లాలకు స్థానిక కార్పొరేషన్ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇస్తే.. కొనుగోలుదారులు జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అలాగే ఎక్కడైనా ఖరీదైన వస్తువులు కొనుగోలు చేసినప్పుడు జీఎస్టీతో కూడిన ఇన్వాయిస్ డిమాండ్ చేయాలని కొనుగోలుదారులకు సూచించారు. దీనివల్ల వ్యాపారి పన్ను ఎగవేయడానికి వీలుండదన్నారు. రాష్ట్రాలు పన్నులు, సెస్ వంటివి వేయడం వల్ల పెట్రోల్ రేటు ఎక్కువగా ఉందని, వీటిని జీఎస్టీ పరిధిలోకి తేవడానికి రాష్ట్రాలు అంగీకరిస్తే ధరలు దిగివస్తాయన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965


గొప్ప అనుభూతిని ఇస్తుంది

నిర్మాత మధు



తమన్నా భాటియా ప్రధాన పాత్రలో దర్శకుడు సంపత్ నంది పర్యవేక్షణలో అశోక్ తేజ తెరకెక్కించిన చిత్రం 'ఓదెల-2'. 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ చిత్రమిది. డి.మధు నిర్మించారు. ఈనెల 17న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత మధు మీడియాతో చిత్ర విశేషాలను పంచుకొన్నారు. 'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ప్రాణం. కమర్షియల్‌గా కాకుండా సినిమాపై ప్యాషన్‌తోనే ఇండస్ట్రీలోకి వచ్చాను. నాకు మొదటి నుంచి ఏదైనా వెరైటీగా చేయాలని ఉండేది. కాశీలో ఈ సినిమాని ప్రారంభించాం. అలాగే మహా కుంభమేళాలో టీజర్‌ని లాంచ్ చేసాం. సినిమాలో తమన్నా అద్భుతంగా నటించారు. ఏప్రిల్, మే నెలల్లో చెప్పులు వేసుకోకుండానే ఎర్రటి ఎండలో షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సినిమా కథలో ప్రతి పాత్రకీ ప్రాధాన్యం ఉంటుంది. ప్రేక్షకులు ఆ పాత్రలతో లీనం అయిపోతారు. గొప్ప అనుభూతిని పొందుతారు' అని అన్నారు.

అదే తేదీన 'వీరమల్లు'



ఈ ఏడాది విడుదల కానున్న భారీ చిత్రాల్లో 'హరి హర వీర వీరమల్లు' ఒకటి. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఏ.దయాకర్ రావు, ఏ.ఎం. రత్నం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర నిర్మాణం తుది దశకు చేరుకుంది. రీ రికార్డింగ్, డబ్బింగ్, వీఎఫ్ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సినిమా ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు గతంలోనే మేకర్స్ ప్రకటించారు. అయితే సినిమా విడుదల వాయిదా పడిందంటూ కొద్ది రోజులుగా ఫిల్మ్‌నగర్‌లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో చిత్రబృందం శుక్రవారం స్పందించింది. ముందు చెప్పినట్లుగానే మే 9న బాక్సాఫీసు వద్ద 'హరి హర వీరమల్లు' గర్జించనున్నారంటూ స్పష్టం చేసింది. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తోన్న ఈ చిత్రంలో సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా కీలక పాత్రలు పోషిస్తున్నారు.

వందేళ్ల నిరీక్షణకు ముగింపు...

స్టంట్ డిజైన్ కేటగిరీలో ఆస్కార్ పురస్కారం



ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారాల్లో కొత్తగా మరో విభాగం చేరింది. ఇక నుంచి స్టంట్ డిజైన్ విభాగంలోనూ పురస్కారాలు ఇవ్వనున్నట్లు అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించింది. సినిమా మ్యాజిక్‌లో భాగమైన స్టంట్స్ ఇకపై ఆస్కార్ పురస్కారాల్లోనూ భాగమవనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. 2028లో నిర్వహించబోయే వందో ఆస్కార్ పురస్కారాలలో స్టంట్ డిజైన్ కేటగిరీలో పురస్కారాన్ని అందజేస్తామని వెల్లడించారు. 2027లో విడుదలయ్యే చిత్రాల నుంచి విజేతను ఎంపిక చేస్తారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో 'ఎవ్రీథింగ్ ఎట్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్, మిషన్ ఇంపాజిబుల్' లాంటి హాలీవుడ్ చిత్రాలతో పాటు 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని ఫైట్ సీక్వెన్స్‌కు సంబంధించిన ఇమేజ్‌ను అకాడమీ నిర్వాహకులు ఉపయోగించడంపై దర్శకుడు రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'ఎట్టకేలకు వందేళ్ల నిరీక్షణ తర్వాత 2027లో విడుదలయ్యే చిత్రాలకు కొత్తగా స్టంట్ డిజైన్ కేటగిరీలో పురస్కారాలు ఇవ్వబోతున్నందుకు ఆనందంగా ఉంది. పోస్టర్‌లో 'ఆర్ఆర్ఆర్'ను భాగం చేసినందుకు సంతోషంగా ఉంది. ఈ కలను నిజం చేసిన నిర్వాహకులకు ధన్యవాదాలు' అంటూ రాజమౌళి స్పందించారు.

ఆత్మవిశ్వాసమే అసలైన అందం



ఒత్తైన, పొడవాటి జుట్టు ఆడవారి అందాన్ని రెట్టింపు చేస్తుంది. వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది. జుట్టు ఏ కాస్త రాలినా వారు అస్సలు తట్టుకోలేరు. అలాంటి కురులపై మహిళలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. కానీ ఒకప్పటి హీరోయిన్ మాత్రం అందంగా కనిపించాలంటే జుట్టు అవసరమా? అని ప్రశ్నించారు. ఆత్మవిశ్వాసమే అసలైన అందం అని నిర్వచిస్తూ గుండు గీయించుకొని అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసారు. ఆమె మరెవరో కాదు... ఒకప్పటి స్టార్ హీరోయిన్ భానుప్రియ చెల్లి శాంతిప్రియ. తెలుగులో మహర్షి, కలియుగ అభిమన్యుడు, సింహ స్వప్నం లాంటి పలు విజయవంతమైన చిత్రాల్లో శాంతి ప్రియ నటించారు. కొన్ని తమిళ చిత్రాల్లోనూ నటించిన ఆమె..ఆ తర్వాత బాలీవుడ్ వెళ్లిపోయారు. నటుడు సిద్ధార్థ్ రాయ్‌ని 1999లో వివాహం చేసుకొన్నారు. వీరికి ఇద్దరు సంతానం. 2004లో సిద్ధార్థ్ రాయ్ గుండెపోటుతో మరణించారు. కాగా, తన లేటెస్ట్ లుక్‌తో అందరినీ షాక్‌కు గురిచేశారు శాంతిప్రియ. చనిపోయిన తన భర్త బ్లేజర్ ధరించి గుండుతో దిగిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'ఈ మధ్యే గుండు కొట్టించుకొన్నాను. విభిన్నమైన అనుభూతిని పొందుతున్నా. మహిళగా మనం జీవితంలో కొన్ని పరిమితులు పెట్టుకుంటాం. సమాజం విధించిన కట్టుబాట్లు, నియమ నిబంధనలు పాటిస్తూ మనల్ని మనమే కట్టడి చేసుకుంటాం. వీటి నుంచి నేను స్వేచ్ఛను కోరుకున్నాను. నన్ను నేను విముక్తి చేసుకున్నాను. అందం అంటే ఇదే అనే ప్రమాణాలను బ్రేక్ చేయాలనుకున్నాను. ఎంతో ధైర్యంతో ముందడుగు వేశాను. నా భర్త జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అతని బ్లేజర్ ధరించాను' అని ఆ పోస్టులో పేర్కొన్నారు.

హిట్ జోడీ మళ్లీ?



హృతిక్ రోషన్ కథానాయకుడిగా 'క్రిష్' ఫ్రాంచైజీలో వచ్చిన మూడు చిత్రాలు ఘన విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు కొనసాగింపుగా 'క్రిష్ 4' వస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రంలో హృతిక్‌రోషన్ కథానాయకుడిగా నటించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. హృతిక్‌కు జోడీగా నటించబోయే హీరోయిన్‌ల జాబితాలో ఇప్పటివరకూ పలువురి పేర్లు వినిపించాయి. ఈ ఫ్రాంచైజీలో వచ్చిన గత చిత్రాల్లో కథానాయికగా నటించారు ప్రియాంక చోప్రా. వీరిద్దరిదీ విజయవంతమైన జోడీగా నిలిచింది. ఇప్పుడు 'క్రిష్ 4'లోనూ ఆమె భాగమవ్వబోతున్నారని తెలుస్తోంది. ఇటీవలే ప్రియాంకచోప్రా, ఆమె భర్త నిక్ జొనాస్‌ను కలసినట్లు హృతిక్ తెలిపారు. దీంతో ఈ సినిమాలో కథానాయికగా ప్రియాంక చోప్రా నటించడం దాదాపు ఖాయమైనట్లే అని భావిస్తున్నారు. ఆమె ప్రస్తుతం రాజమౌళి-మహేశ్‌బాబు చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. 'క్రిష్ 4'లో హృతిక్ మూడు పాత్రలు పోషించనున్నారనీ, ప్రీతిజింటా, రేఖ, వివేక్ ఒబెరాయ్ కీలకపాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2026 ప్రారంభంలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.



అన్నాదమ్ముల అనుబంధం



అన్నాదమ్ముల అనుబంధం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'సోదరా'. సంపూర్ణేశ్‌బాబు కథానాయకుడు. సంజోష్ కీలకపాత్ర పోషిస్తున్నాడు. ప్రాచీబంసాల్, ఆరతి గుప్తా కథానాయికలు. మోహన్ మేనంపల్లి దర్శకుడు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు సాయిరాజేశ్, నిర్మాత ఎస్‌కేఎన్ 'సోదరా' ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంపూర్ణేశ్‌బాబు మాట్లాడుతూ 'అన్నాదమ్ముల అనుబంధాన్ని కొత్త కోణంలో ఆవిష్కరించాం. నా నిజ జీవితానికి దగ్గరగా ఉండే పాత్రను ఈ చిత్రంలో పోషించాను' అని చెప్పారు. బాబూమోహన్‌లాంటి సీనియర్ నటుడితో పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చిందని సంజోష్ తెలిపారు. చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో వస్తున్నాం అని బాబూమోహన్ తెలిపారు. పవన్ కల్యాణ్ 'బ్రో' చిత్రంలా 'సోదరా' కూడా మంచి విజయం అందుకోవాలని ఎస్‌కేఎన్ ఆకాంక్షించారు. సంపూ కెరీర్‌లో ఈ చిత్రం మైలురాయిగా నిలవాలని సాయిరాజేశ్ కోరుకున్నారు.



విద్యార్థుల చేతిలోని పేపర్‌పై ప్రింట్ చేసిన ఉన్న జవాబులు



చినముషిడివాడలోని జియాన్ డిజిటల్ కేంద్రం వద్ద అభ్యర్థుల ఆందోళన

భెల్ పరీక్ష పేపర్ లీక్..!?

- చినముషిడివాడ జియాన్ డిజిటల్ కేంద్రంలో మాస్ కాపీయింగ్..?
- అడ్మిట్ కార్డు వెనుక 150 ప్రశ్నలకూ జవాబులు ముద్రించిన వైనం
- ఇద్దరు అభ్యర్థులకు అడ్మిట్ కార్డులు తిరిగివ్వడంతో అనుమానం
- వాటిపై జవాబులు చూసి ఆందోళనకు దిగిన మిగిలిన అభ్యర్థులు
- పరీక్ష రద్దు చేయాలని డిమాండ్.. విచారణ చేపడతామన్న పోలీసులు

పెందుర్తి (విశాఖపట్నం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) జాతీయ స్థాయిలో శుక్రవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్ష పత్రం లీకైందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చినముషిడివాడలోని జియాన్ డిజిటల్ కేంద్రంలో పేపర్ లీకైందని, మాస్ కాపీయింగ్ జరిగిందని ఆరోపిస్తూ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. తమ సెల్‌ఫోన్లలో పరీక్ష ప్రశ్నపత్రం, జవాబులు రాసిన అడ్మిట్ కార్డు వెనుక భాగం ఫొటోలను చూపుతూ నిరసన తెలిపారు. పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భెల్‌లో ట్రైనీ సూపర్‌వైజర్, ట్రైనీ ఇంజనీర్ ఉద్యోగాలకు దేశవ్యాప్తంగా శుక్రవారం ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడ జియాన్ కేంద్రంలో మధ్యాహ్నం రెండు గంటలకు పరీక్ష ప్రారంభం కావలసి ఉండగా సుమారు 500 మంది 12.30 గంటలకే అక్కడకు చేరుకున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు అభ్యర్థుల హాల్‌టికెట్స్ (అడ్మిట్ కార్డులు) తనిఖీ చేసి, రిజిస్ట్రేషన్ అనంతరం నిర్వాహకులు వారిని కేంద్రంలోకి అనుమతించారు. 2 గంటలకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో లాగిన్ అయ్యారు. కేంద్రంలోని ఓ ఫ్లోర్‌లో 3 గంటలకు అభ్యర్థుల నుంచి ఇన్విజిలేటర్లు అడ్మిట్ కార్డులు తీసుకున్నారు. అనంతరం ఆ ఫ్లోర్‌లో పరీక్ష రాస్తున్న ఇద్దరు అభ్యర్థులకు ఓ ఇన్విజిలేటర్ అడ్మిట్ కార్డులు తిరిగి ఇచ్చేశారు. సాధారణంగా అభ్యర్థుల నుంచి అడ్మిట్ కార్డులు తీసేసుకోవాలి. కానీ వారిద్దరికీ వాటిని తిరిగి ఇవ్వడంపై అనుమానం వచ్చి కొంతమంది ఆరా తీశారు. ఆ అడ్మిట్ కార్డులను పరిశీలించగా వెనక వైపున 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు సమాధానాలు ప్రింట్ చేసి ఉన్నాయి. దీంతో మాస్ కాపీయింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ అభ్యర్థులు పరీక్ష పూర్తికాకముందే బయటకు వచ్చి, నిరసన తెలిపారు. దీంతో జవాబులు రాసిన అడ్మిట్ కార్డులు తిరిగిచ్చిన ఇద్దరినీ మరో ఫ్లోర్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రం లీకైందంటూ అభ్యర్థులు కేంద్రం ఎదుట నినాదాలు చేశారు. ఆన్సర్ షీట్ ఫొటోలను తమ సెల్‌ఫోన్లలో ప్రదర్శించారు. నిర్వాహకులు డబ్బులు తీసుకుని ప్రశ్నపత్రం లీక్ చేసి, జవాబులు రాసి ఇద్దరు అభ్యర్థులకు ఇవ్వడంపై చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు చేరుకుని వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. కాగా, భెల్ పరీక్ష పరిశీలకుడు వివరాలు సేకరించారని పోలీసులు తెలిపారు.

కియ ఇంజిన్‌ల మిస్సింగ్ కేసులో దర్యాప్తు వేగవంతం

- డీజీపీ కార్యాలయం నుంచి పర్యవేక్షణ
- మాజీ ఉద్యోగులపైనే అనుమానం
- సిట్ అదుపులో ఓ అనుమానితుడు
- అనుమానితులు పారిపోకుండా పాస్‌పోర్టులు సీజ్

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కియ పరిశ్రమలో కార్ ఇంజిన్‌ల మాయం కేసులో దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసును డీజీపీ కార్యాలయం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోంది. కియా ఫ్యాక్టరీలో పనిచేసి మానేసిన ఉద్యోగులనే ఈకేసులో ప్రధానంలో అనుమానిస్తున్నారు. ఇప్పటికే తమిళనాడుకు చెందిన ఓ ఉద్యోగిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా మిగిలినవారిని పట్టుకునేందుకు 20 మంది అధికారుల బృందం పొరుగు రాష్ట్రాలకు వెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అనుమానితులు పారిపోకుండా వారి వీసా, పాస్‌పోర్ట్‌లను సీజ్ చేసినట్లు సమాచారం. శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న కియ పరిశ్రమకు సుమారు 54 ప్లాంట్లు ఉన్నాయి. ప్రధాన పరిశ్రమకు తోడు 26 అనుబంధ పరిశ్రమలున్నాయి. ఇక్కడ గంటకు 58 కార్లను తయారు చేస్తారు. రూ.వేల కోట్ల లావాదేవీలు, వేలాది మంది ఉద్యోగులు ఉన్నారు. ఇలాంటి పరిశ్రమలో ఏకంగా 940 కార్ ఇంజిన్‌లు మాయం కావడం కలకలం రేపింది. దీనిపై ఆ కొరియన్ సంస్థ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మార్చి 19న అమ్మవారిపల్లిలోని కియ ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అదే రోజు నుంచి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు కోసం సిట్‌ను ఏర్పాటు చేశారు.

సీరియస్‌గా తీసుకున్న కియ

కార్ ఇంజిన్‌ల మాయం వ్యవహారాన్ని కియ యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ప్లాంట్ వ్యాపార లావాదేవీలతో పోల్చుకుంటే మాయమైన ఇంజిన్‌ల విలువ స్వల్పమే అయినా.. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా చూడాలని పోలీసులను కోరింది. అక్రమాలకు బీజం ఎక్కడ పడింది? సూత్రధారులు ఎవరు? మాయమైన ఇంజిన్‌లు ఎక్కడికి చేరాయి? అనే అంశాలను నిగ్గు తేల్చాలంది. దీంతో ఇంజిన్‌లను దాచి ఉంచారా, స్క్రాప్, స్పేర్స్ కింద విక్రయించారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే రాష్ట్రంవారికి ప్రాధాన్యం!

కియ పరిశ్రమలో కార్ల ఉత్పత్తి, ఎగుమతి ప్రక్రియలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఉంటాయి. పెనుకొండ మండలం యర్రమంచి పంచాయతీ పరిధిలో కియ పరిశ్రమ ఏర్పాటైనప్పటి నుంచి తమిళనాడుకు చెందిన వ్యక్తులే ఇక్కడ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. కియతో పాటు అనుబంధ పరిశ్రమలలో ఆ రాష్ట్రానికి చెందినవారే కీలక ఉద్యోగాల్లో ఉన్నారు. ఇంజిన్‌ల మిస్సింగ్ వెనుక ఆ రాష్ట్ర ఉద్యోగుల ప్రమేయమే ఉంటుందని కియ యాజమాన్యం, పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక రాష్ట్రంవారికే ఇక్కడ ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం కారణంగా అక్రమాలు జరిగాయని కియ యాజమాన్యం అంతర్గత చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది.

టెర్రరిస్టుల కంటే ఆర్థిక నేరస్థులు ప్రమాదకారులు

- బీజేపీ రాకతో లౌకికవాదం ధ్వంసం
- జేఈఈ రాయలేకపోయిన విద్యార్థులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత పవన్‌దే: నారాయణ



విశాఖపట్నం, నర్సీపట్నం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 'ముంబై ఉగ్రదాడుల సూత్రధారి రాణాను అమెరికా నుంచి మన దేశానికి రప్పించగలిగిన ప్రధాని నరేంద్ర మోదీ విదేశాల్లో దాక్కున్న ఆర్థిక ఉగ్రవాదులను తీసుకురావడంలో విఫలమయ్యారు. టెర్రరిస్టుల కంటే ఆర్థిక నేరస్థులు చాలా ప్రమాదకారులు. రూ.16.5 లక్షల కోట్లు ప్రజల సొమ్ము కొల్లగొట్టి విదేశాలలో ఉన్న 29 మంది ఆర్థిక నేరస్థులను దేశానికి తీసుకువచ్చి శిక్షించాలి' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో శుక్రవారం 'రాజ్యాంగ రక్షణ, లౌకికవాదం... పరిరక్షణ' అనే అంశం పై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. అలాగే విశాఖ నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏర్పాటు చేసిన బహిరంగ సభలోనూ ఆయన మాట్లాడారు. 'ప్రజా సంపదను దోచుకొని విదేశాలకు వెళ్లిపోయిన 29 మం దిలో 28 మంది గుజరాత్‌కు చెందినవారే. దేశంలో నిరర్థక ఆస్తుల విలువ బీజేపీ అధికారంలోకి వచ్చేనాటికి రూ.2.5 లక్షల కోట్లు ఉండగా, ఈ 11 సంవత్సరాల్లో రూ.16.5 లక్షల కోట్లకు పెరిగింది. మిత్రుడు అంటూనే సుంకాలతో ట్రంప్ దాడి చేస్తున్నందున నరేంద్ర మోదీ ఇప్పటికైనా యూరోపియన్ యూనియన్, చైనాతో కలిసి అమెరికా సుంకాలను తిప్పికొట్టాలి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో లౌకిక వాదం ధ్వంసమయింది. లౌకిక వాదులమని చెప్పుకునే టీడీపీ, జనసేనలు... మతతత్వ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకోవడం విడ్డూరంగా ఉంది. భవిష్యత్తులో బీజేపీ వల్ల జరిగే నష్టానికి ఆ రెండు పార్టీలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. దేశంలోనే 11 సంవత్సరాల పాటు బెయిల్‌పై ఉన్న ఏకైక వ్యక్తి జగన్ అన్నారు. మోదీ, అమిత్‌షాల ఆశీస్సులు లేకుండా అది సాధ్యం కాదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటనలో పోలీసుల ఆంక్షలు, అత్యుత్సాహం కారణంగా జేఈఈ మెయిన్స్ పరీక్ష రాయలేకపోయిన 30 మంది విద్యార్థులు మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్ష రాయకపోవడం వల్ల సంవత్సరం వృథా అవుతుందన్నారు. వారు నష్టం పోకుండా చూడాల్సిన బాధ్యత పవన్ కల్యాణ్‌పై ఉంది' అని నారాయణ సూచించారు.

రాసేది తప్పులు.. ఆపై.. ఏడుపులు!

(మొదట ఇపేజీ తరువాయి)

రాసింది. ప్రాంతానికో రకంగా వార్తలు రాసింది 'పచ్చ' పత్రికలే అని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు గుర్తు చేస్తున్నారంటూ డొల్ల వాదనలు చేసింది. దీనికి ఉదాహరణగా... ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాలకు వేర్వేరుగా ప్రకటనలు జారీ చేసిందని 'గుర్తు చేసింది'! అది... తెలుగుదేశం పార్టీ ఇచ్చిన వ్యాపార ప్రకటన! పార్టీ ప్రకటనకు, పత్రికలు ప్రచురించే వార్తలకు సంబంధం ఏమిటి? ఆ మాత్రం తెలియకుండానే జగన్ పత్రిక నడుపుతున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తెలంగాణ పోలీసులు నిజం చెప్పరా?

ఈనెల మొదటివారంలో పల్నాడు జిల్లా మాచర్ల మండలానికి చెందిన పండ్ల హరిశ్చంద్ర అనే వ్యక్తిని కిడ్నాప్ చేసి చంపారు. అతను వైసీపీ కార్యకర్త! కిడ్నాప్ జరిగింది తెలంగాణ పరిధిలో! దీంతో అక్కడి పోలీసులు దర్యాప్తు చేశారు. దీనిపై తెలంగాణ సంచికలో "సాగర్‌లో కిడ్నాప్ అయిన వ్యక్తి హత్య... భూ వివాదాల కారణంగా అంతమొందించిన అల్లుడు' అంటూ జగన్ పత్రిక వార్త ప్రచురించింది. "హరిశ్చంద్ర, ఆయన సొంత అల్లుడు బెజవాడ బ్రహ్మం మధ్య కొంత కాలంగా భూమి పంచాయతీ నడుస్తోంది. గత ఏడాది డిసెంబరు 16న వీరు గొడవ పడ్డారు. గొడవలు వద్దని వారించిన బ్రహ్మం అన్న (చిన్నమ్మ కొడుకు) బెజవాడ రమేశ్, అక్కలు మంగమ్మ, పోచమ్మలపై హరిశ్చంద్ర గొడ్డలితో దాడి చేసి గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన రమేశ్ కోమాలోకి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి హరిశ్చంద్రపై బ్రహ్మం కక్ష పెంచుకున్నాడు. అతడిని మట్టుపెట్టే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. దీంతో... హరిశ్చంద్ర తన సొంతూరిలో వ్యవసాయం వదిలిపెట్టి నల్లగొండ జిల్లా కనగల్‌లో తన బంధువుల వద్ద తలదాచుకుంటున్నాడు. ఈనెల 2వ తేదీన పింఛనుకోసం స్వగ్రామానికి బయలుదేరిన హరిశ్చంద్రను బ్రహ్మం తన బంధువులతో కలిసి కిడ్నాప్ చేశాడు. పోలీసులు బ్రహ్మంతోపాటు ఇతరులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. హరిశ్చంద్రను తమ గ్రామంలో ఆయన పొలంలోనే హత్య చేసినట్లు వారు అంగీకరించారు" అని జగన్ పత్రిక తెలంగాణ సంచికలో ప్రచురించింది. కానీ... ఆంధ్రప్రదేశ్ ఎడిషన్‌కు వచ్చేసరికి "పొరుగు రాష్ట్రంలో దాక్కున్నా ప్రాణం తీశారు. టీడీపీ గూండాలు ఘోరానికి పాల్పడ్డారు. వైసీపీ నేత హరిశ్చంద్రను హత్య చేశారు" అని రాజకీయ రంగు పులిమారు.

సమర్థించుకునేందుకు తంటాలు..

అడ్డగోలు రాతలు రాసిన జగన్ పత్రికను సమర్థించేందుకు వైసీపీ నేతలు అంతే అడ్డగోలు వాదనలు చేశారు. "తెలంగాణలోని పాత్రికేయులకు పూర్తి సమాచారం లేకపోవచ్చు. కానీ... పల్నాడు పాత్రికేయులు బాధిత కుటుంబాలతో మాట్లాడి పూర్తి సమాచారం ఇచ్చారు" అని పేర్కొన్నారు. 'పూర్తి సమాచారం ఇచ్చారు' అని చెబుతున్న వార్తలో... హరిశ్చంద్రను చంపింది సొంత అల్లుడు అని లేదు. కనీసం... అతని పేరు కూడా రాయలేదు. వారి మధ్య భూతగాదాలు ఉన్నాయని, గతంలో వారిపై హరిశ్చంద్ర గొడ్డలితో దాడి చేసి ఊరి వదిలి వెళ్లిపోయాడని ఎక్కడా చెప్పలేదు. తెలంగాణ సంచికలో మాత్రం ఈ వివరాలన్నీ ఉన్నాయి. కేసు నమోదైంది అక్కడే కావడంతో... ఇది అధికారిక సమాచారం అని భావించక తప్పదు. ఇదే ఏపీలో జరిగి ఉంటే... 'పోలీసులు టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారు' అని ఆరోపించే అవకాశముండేది. తెలంగాణ పోలీసులకు ఆ అవసరం ఏముంటుంది? వ్యక్తిగత, కుటుంబ కక్షలతో జరిగిన హత్యను తమకు అంటగట్టడంతో టీడీపీ తీవ్రంగా స్పందించింది. పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై చర్యలు తీసుకోవడంతో జగన్ పత్రిక గగ్గోలు పెడుతోంది!

గతం మరిచిపోయారా...

పోలీసులు తమపై కేసు పెట్టారని ఆక్రోశిస్తున్న జగన్ మీడియా... అంతకుముందు ఐదేళ్లు ఏం జరిగిందో మరిచిపోయినట్లుంది. 'ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీశారు' అంటూ 'ఆంధ్రజ్యోతి'తోపాటు తనకు గిట్టని మీడియాపై జగన్ సర్కారు పదులకొద్దీ కేసులు పెట్టింది. అప్పటి సీఎస్ జవహర్ రెడ్డి కడప జైలు వద్ద మరో అధికారిని తన కారులో తీసుకెళ్లారని ఉన్న విషయం ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి'పై పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా కేసు పెట్టించింది. ఇక... సోషల్ మీడియా పోస్టులపై పెట్టిన కేసులకు లెక్కే లేదు. ఇప్పుడు... ఒక అడ్డగోలు వార్త రాసి, అడ్డంగా దొరికిపోయి... దీనిపై కేసు పెట్టగానే 'పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు' అంటూ వాపోవడం జగన్ మీడియాకే చెల్లింది.

అజ్ఞాతంలోకి అనంత జైలర్

- న్యూడ్ కాల్ చేయాలని మహిళపై సుబ్బారెడ్డి ఒత్తిడి!
- కేసు నమోదు కావడంతో పరార్



సుబ్బారెడ్డి

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు జైలర్ సుబ్బారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు 20 రోజుల నుంచి అజ్ఞాతంలో ఉన్నారు. న్యూడ్ కాల్ చేయాలని ఓ మహిళను ఒత్తిడి చేసినందుకు జైలర్ సుబ్బారెడ్డిపై విశాఖ సైబర్ క్రైం పోలీసుస్టేషన్‌లో గత నెలలో కేసు నమోదైంది. సుబ్బారెడ్డిని విచారించేందుకు విశాఖ నుంచి ప్రత్యేక పోలీసు బృందం అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలుకు మార్చి 23న వచ్చినట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన ఆయన.. పోలీసుల కంటపడకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మార్చి 23 నుంచి ఆయన విధులకు హాజరు కావడం లేదని, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడని జైలు సూపరింటెంటెంట్ ఏబీ క్రాంతిరాజ్ శుక్రవారం తెలిపారు. కుటుంబ సభ్యులను ఆరాతీయగా, అనారోగ్యంగా ఉన్నాడని, ఆస్పత్రికి వెళ్లాడని చెప్పారని అన్నారు. అయితే, అదే రోజున వేరే నంబర్ నుంచి ఫోన్ చేసి, మెడికల్ లీవ్ ఇవ్వాలని కోరాడని తెలిపారు. అనంతరం జైళ్ల శాఖకు మెయిల్ ద్వారా మార్చి 23 నుంచి ఏప్రిల్ 11 వరకు సెలవు కావాలని లేఖ పంపించారని తెలిపారు. సుబ్బారెడ్డి మెడికల్ లీవ్ శుక్రవారంతో ముగిసింది. ఆయన విధులకు రాగానే సమాచారం ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్‌కు విశాఖ పోలీసులు సూచించారని సమాచారం.

హోంఫట్

(మొదటి పేజీ తరువాయి)

పర్వం కొనసాగింది. వైసీపీ ఐదేళ్ల కాలంలో కావలిలో 90 ఎకరాలను కబ్జా చేశారు. ఈ కబ్జా విలువ రూ.300 కోట్లు. వారే...కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆయన సన్నిహితుడు మన్నెమాల సుకుమార్ రెడ్డి. ఆ వివరాల్లోకి వెళితే.. వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎక్కడికక్కడ ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు దోపిడీకి తెరదీశారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి కనుసన్నల్లో ఆయన అనుచరులు రెచ్చిపోయారు. కావలి పట్టణం నడిబొడ్డున ఉన్న కాల్వలు, కుంట...డొంక పోరంబోకు అన్నింటినీ కలిపేసుకుని లేఔట్లు వేసి విక్రయించేందుకు సిద్ధం చేశారు. వీరి కబ్జాకు గురైన భూముల్లో శ్మశానాలు, మున్సిపల్ కామన్ సైట్లు, దేవదాయశాఖ భూమ ౹లూ ఉన్నాయి. ఈ భూములను ప్రతాప్ కుమార్‌రెడ్డి అనుచరులు మన్నెమాల సుకుమార్ రెడ్డి, ఈతముక్కల మురళీరెడ్డి, చెన్నకేశవుల నాయుడు, మహేంద్ర యాదవ్, కేతిరెడ్డి జగదీశ్ రెడ్డి పేరుతో బదలాయించేసుకున్నారు. వీరి దందాకు అప్పటి రెవెన్యూ, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అందరూ సహకరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీరి అక్రమాలపై విచారణకు సిట్ వేయాలని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణా రెడ్డితోపాటు పలువురు టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తూ వచ్చారు. దీంతో ప్రభుత్వం కలెక్టర్‌ను విచారణకు ఆదేశించడంతో వీరి కబ్జా కాండ బట్టబయలు అయింది. ఆర్డీవో విచారణలో 77.34 ఎకరాల ప్రభుత్వ భూమిని ఈ ముఠా తమ పేరుతో బదలాయించుకుందని తేలింది. ఈమేరకు ఆర్డీవో జిల్లా కలెక్టర్‌కు గత ఏడాది జూలైలో నివేదిక ఇచ్చారు. ఆ నివేదికను అనుసరించి..

కబ్జాకాండ ఇలా...

కావలి పట్టణంలో సర్వే నంబరు 656లో 4.24 ఎకరాలు కుంట పోరంబోకుగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. ప్రతాప్‌కుమార్ రెడ్డి అనుచరులు 2023లో రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి అదే ఏడాది డిసెంబరు 19న ఫ్రీహోల్డ్‌కు ప్రతిపాదిస్తూ నివేదికలు పంపారు. ఫ్రీహోల్డ్ ఆఫ్ అసైన్‌మెంట్‌లో అప్పటి కావలి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు ఎలాంటి లాగిన్ లేకపోయినప్పటికీ ఫీల్డ్ విజిట్ చేయకుండానే మాన్యువల్ ఎక్సెల్ షీట్ ప్రతిపాదనలపై సంతకం చేసి పంపేశారు. దీనిపై 2024 జూలై 9న ఆర్డీవో విచారణ ప్రారంభించగానే, ఒక రోజు ముందు అంటే జూలై 8వ తేదీ అర్ధరాత్రి సమయంలో మాజీ ఎమ్మెల్యే అనుచరులు హడావిడిగా సదరు భూమిలో దారులు ఏర్పరచి, లౌఔట్ మార్కింగ్ చేశారు. కావలి పట్టణంలో సర్వే నంబరు 656-2, 4, 6, 7లో 3.53 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఈ భూమిపై ఒరిజినల్ లబ్ధిదారుల వారసులే ఉన్నట్లు పేర్కొంటూ 2023లో ఫ్రీహోల్డ్‌కు ప్రతిపాదించడం.. సంబంధిత ఉత్తర్వులు ఇచ్చేయడం జరిగిపోయింది. అయితే తాజా పరిశీలనలో సదరు భూమిలో ఒరిజినల్ లబ్ధిదారుల వారసులు ఎవ్వరూ లేరని, ఆ భూమిని అనుమతులు లేకుండానే వ్యవసాయేతర భూమిగా మార్పు చేశారని తేలిందని ఆర్డీవో నివేదిక ఇచ్చారు. ఫ్రీహోల్డ్ ఉత్తర్వులను రద్దు చేయాలని ప్రతిపాదించారు. సుకుమార్‌రెడ్డి గరుడ లేఔట్ పేరుతో వేసిన దాంట్లో సర్వే నంబరు 656-5,9లో 66 సెంట్ల కాల్వలు, సర్వే నంబరు 656-1,2,3,6,7,8లో 4.24 ఎకరాల్లో అనాధీన భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సుకుమార్ రెడ్డి తుమ్మలపెంట రోడ్డులో వేసిన లేఔట్‌లో 5.18 ఎకరాల కాల్వలు, 3.78 ఎకరాల డొంక కలిపేసుకున్నారు. చెన్నకేశవుల నాయుడు తుమ్మలపెంట రోడ్డులో వేసిన లేఔట్‌లో సర్వే నంబర్లు 126,1219, 1221, 1213, 1261, 1263, 1267-5ఎ, 1267-5సి, 1249, 1238-2, 1283లో 3.77 ఎకరాల పరిధిలోని కాల్వలను కబ్జా చేయగా, సర్వే నంబర్లు 1282, 1281, 1273ల్లో 6.44 ఎకరాల కుంటలను మాయం చేశారు. మరో 4.01 ఎకరాల అనాధీన భూమి, 2.01 ఎకరాల డొంక కలుపుకొని మొత్తం 16.23 ఎకరాల ప్రభుత్వ భూములను లేఔటులో కలిపేసుకున్నారు. వెంగయ్యగారి పాలెంలో చెన్నకేశవుల నాయుడు వేసిన లేఔట్‌లో కాల్వలు, అనాధీనం, మందబయలు భూములు 1.22 ఎకరాలు ఉన్నట్లు తేలింది. మహేంద్రయాదవ్ వేసిన లేఔట్‌లో సర్వే నంబర్లు 303-1, 308-1, 316లో 18.29 ఎకరాల కాల్వలు, 4.97 ఎకరాల కుంటలు, మొత్తం 31.43 ఎకరాల ప్రభుత్వ భూములు కలిపేసుకున్నారు. కావలి జాతీయరహదారి పక్కన సుబ్రమణ్యం వేసిన లేఔట్‌లో 6.70 ఎకరాల కాల్వలు, కుంటలు కలిపేసుకున్నట్లు తేలింది. కాటా శ్రీనివాసరెడ్డి తుమ్మలపెంట రోడ్డులో వేసిన లేఔట్‌లో 9.67 ఎకరాల కాల్వలు, కుంటలు, డొంక, దేవదాయ శాఖ భూములు ఉన్నట్లు గుర్తించారు. రమణారెడ్డి వేసిన లేఔట్‌లో 0.42 ఎకరాల కాల్వలను కలిపేసుకున్నారు. కాగా, వైసీపీ ఐదేళ్ల పాలనలో కావలిలో అపూర్వసహోదరులు చేయని అరాచకం లేదు. 2023 డిసెంబరులో హర్ష అనే ఎస్సీ మాల సామాజికవర్గం యువకుడు ఎమ్మెల్యేని ప్రశ్నించాడని బట్టలూడదీసి మోకాళ్లపై కూర్చోబెట్టి ఎమ్మెల్యేకు ఆయన అనుచరుడికి క్షమాపణ చెప్పించారు. కూటమి అధికారంలోకి రావడంతో తాము చేసిన అక్రమాల నుంచి బయటపడేందుకు.. మన్నెమాల సుకుమార్ రెడ్డిని వైసీపీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఆయనను బీజేపీ లేదా జనసేనలోకి పంపి తాము చేసిన అక్రమాల నుంచి బయటపడేందుకే ఈ ఎత్తు వేశారన్న ప్రచారం ఉంది.

రూ. వంద కోట్ల గ్రావెల్ తవ్వేశారు

వైసీపీ హయాంలో కావలి నియోజకవర్గంలో సుమారు రూ.100 కోట్ల పైచిలుకు విలువైన గ్రావెల్‌ను తవ్వి తరలించేశారు. ఈ దందా మొత్తం అపూర్వ సహోదరుల నేతృత్వంలోనే సాగింది. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, జగనన్న కాలనీలతోపాటు కావలిలోని అనధికార లేఔట్లకు అక్రమంగా తవ్విన గ్రావెల్‌ను సరఫరా చేసి వందల కోట్లు ఆర్జించారు. ఎలాంటి అనుమతులు లేకుండా 20 నుంచి 30 అడుగుల లోతున వందల ఎకరాల్లో గ్రావెల్‌ను తవ్వేశారు. మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు రూపాయి రాయల్టీ చెల్లించకుండా ఈ దందా నడిపించారు. వీరి దందాకు.. కావలి మండలం రుద్రకోటలో జాతీయరహదారిని ఆనుకుని ఉన్న సుమారు 30 అడుగుల లోతున గుంతలే నిదర్శనం. కప్పరాళ్ల తిప్ప పోలీసుస్టేషన్‌ను ఆనుకుని 30 అడుగుల లోతున గ్రావెల్ తవ్వారు. ఎస్పీ, కలెక్టర్ హెచ్చరించినా వీరి అక్రమ దందా ఆగలేదు. 'సేవ్ ద కావలి' పేరుతో కమ్యూనిస్టులు, బీజేపీ కలిసి ఇక్కడ ఉద్యమాలు చేయడం గమనార్హం. కూటమి అధికారంలోకి వచ్చి 10 నెలలు అయినా అపూర్వ సహోదరులపై చర్యలు తీసుకోవడం లేదన్న అసంతృప్తి టీడీపీ కార్యకర్తలు, నేతలూ, అఖిలపక్షం నాయకుల్లోనూ ఉంది.

సీఎం, మంత్రి సంతకాలు ఫోర్జరీ

- వారి పేరిట సిఫారసు లేఖలు తయారు
- 'అనంత'లో సహకార శాఖ అధికారిపై కేసు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సహకార శాఖ ఉద్యోగి.. శాఖాపరమైన చర్యల నుంచి తప్పించుకునేందుకు ఏకంగా సీఎం చంద్రబాబు, సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సంతకాలనే ఫోర్జరీ చేశాడు. వారి పేరిట సిఫారసు లేఖలను తయారు చేసుకున్నాడు. చివరకు వాటిని రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపి దొరికిపోయాడు. దీనిపై అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 9న కేసు నమోదైంది. సహకార శాఖ అనంతపురం జిల్లా గుత్తి సబ్ డివిజనల్ కార్యాలయంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శివాపురం సతీష్‌కుమార్.. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల విధులకు గైర్హాజరయ్యారు. ఆ సమయంలో ఆయన షేర్‌మార్కెట్ బిజినెస్ పనుల్లో నిమగ్నమైనట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ధారించారు. అతనిపై చర్యలు తీసుకోవాలని ఆ శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ ఆదేశించారు. అయితే శాఖాపరమైన చర్యల నుంచి తప్పించుకునేందుకు సతీష్ కుమార్ సీఎం, మంత్రి పేరిట సిఫారసు లేఖలు తయారు చేసి, సహకార శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌కు పంపించారు.

మెమోను మీరెలా దాఖలు చేస్తారు?

- వంశీ కేసులో ఇన్‌స్పెక్టర్‌ను ప్రశ్నించిన కోర్టు

విజయవాడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో డీఎస్పీ స్థాయి అధికారి దాఖలు చేయాల్సిన మెమోను మీరెలా దాఖలు చేస్తారని ఇన్‌స్పెక్టర్‌ను న్యాయస్థానం ప్రశ్నించింది. విజయవాడ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బెయిల్ కోసం రెండోసారి వేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని గత విచారణలో కోర్టు ఆదేశించింది. దీనిపై శుక్రవారం విచారణ సాగింది. ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్యాణి సెలవులో ఉండటంతో కౌంటర్ దాఖలు చేయడానికి ఈ నెల 15 వరకు గడువు కావాలని పటమట ఇన్‌స్పెక్టర్ పవన్ కిశోర్ మోమో దాఖలు చేశారు. దీనిపై వంశీ తరపు న్యాయవాది దేవీసత్యశ్రీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో న్యాయాధికారి హిమబిందు ఇన్‌స్పెక్టర్‌ను ప్రశ్నించారు.

సిలిండర్ బుక్ చేసినా సబ్సిడీ జమ కాలేదా?

ఉచిత గ్యాస్‌కు మీరు అర్హులేనా?.. సమస్య ఎక్కడుందో ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు .. త్వరలో అందుబాటులోకి దీపం-2 డ్యాష్‌బోర్డ్

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న దీపం-2 పథకం కింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందేందుకు మీరు అర్హులేనా? అయినప్పటికీ ఈ పథకం కింద మీకు రావాల్సిన సబ్సిడీ సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ కాలేదా? సమస్య ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు గ్యాస్ ఏజెన్సీలు, అధికారులను అడుగుతున్నా సమాధానం దొరకడం లేదా? అయితే ఇక నుంచి మీరు ఎక్కడికీ వెళ్లనవసరం లేదు. ఇంట్లో కూర్చునే మీ ఎల్పీజీ గ్యాస్ సిలిండరు బుకింగ్ స్టేటస్‌తో సహా అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ ప్రత్యేక చొరవ తీసుకుని వినియోగదారులకు సౌలభ్యంగా ఉండేలా 'దీపం-2 డ్యాష్‌బోర్డును సిద్ధం చేశారు. త్వరలోనే ఈ డ్యాష్‌బోర్డు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానుంది.


● రెండో ఉచిత సిలిండరుకు బుకింగ్స్...

రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 హామీని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ఏడాది నవంబరు 1న దీపావళి కానుకగా 'దీపం-2' పథకానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఈ పథకం అమలు కోసం రూ. 2,684 కోట్ల నిధులను కూడా కూటమి ప్రభుత్వం కేటాయించింది. లబ్ధిదారులు సాధారణ పద్ధతిలోనే ముందుగా సొమ్ము చెల్లించి గ్యాస్ సిలిండరు బుక్ చేసుకుంటే పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లోపు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లోపు సిలిండర్లు డెలివరీ అవుతాయి. సిలిండరు డెలివరీ అయిన తర్వాత 48 గంటల్లోపు లబ్ధిదారులు చెల్లించిన సొమ్ము మొత్తం వారి ఖాతాల్లో తిరిగి జమ అవుతుంది. మొత్తం మూడు సిలిండర్లూ ఒక సారే ఇవ్వకుండా ప్రతి నాలుగు నెలలకో సిలిండరు ఉచితంగా ఇచ్చేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. తొలి ఉచిత గ్యాస్ సిలిండరు బుక్ చేసుకోవడానికి ఈ ఏడాది మార్చి 31 వరకు గడువు ఇవ్వగా 98 లక్షల మంది ఉపయోగించుకున్నారు. అయితే వీరిలో 14 వేల మందికి పైగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఇంతవరకు సబ్సిడీ సొమ్ము జమ కాలేదు. లబ్ధిదారుల గ్యాస్ కనెక్షన్‌తో బియ్యం కార్డు, ఆధార్ కార్డులు ఒకదానితో మరొకటి లింక్ కాకపోతే సబ్సిడీ సొమ్ము వారి ఖాతాల్లో జమ కావడానికి సాంకేతిక సమస్యలు ఎదురవుతాయని సివిల్ సప్లయిస్ అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా మొదటి ఉచిత గ్యాస్ సిలిండరు బుకింగ్‌కు గత మార్చి 31తో గడువు ముగిసినందున ఈ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రెండో ఉచిత సిలిండరుకు బుకింగ్స్ ప్రారంభించారు.

●డ్యాష్‌బోర్డులో స్టేటస్

ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్స్‌కు సంబంధించిన స్టేటస్‌ను తెలిపే డ్యాష్‌బోర్డును పౌరసరఫరాలశాఖ అందుబాటులోకి తెచ్చింది. ఆన్‌లైన్‌లో epds2.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళితే 'దీపం-2 డ్యాష్‌బోర్డ్' ఓపెన్ అవుతుంది. దానిలో 4 రకాల ఆప్షన్లు కనిపిస్తాయి. అందులో మొదట కనిపించే know your deepam2 status అనే ఆప్షన్‌పై క్లిక్ చేస్తే ఒక సెర్చ్ బాక్స్ వస్తుంది. ఆ బాక్స్‌లో లబ్ధిదారులు తమ బియ్యం కార్డు నంబరు లేదా ఎల్పీజీ కన్స్యూమర్ నంబరు ను ఎంటర్ చేయాలి. అప్పుడు లబ్ధిదారుల ఎల్పీజీ ఐడీతో లింక్ అయి ఉన్న మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేస్తే.. దీపం-2 పథకం లబ్ధిదారుల ఎలిజిబిలిటీ స్టేటస్ వివరాలు కనిపిస్తాయి. పర్సనల్ డిటెయిల్స్‌లో.. వరుసగా ఎల్పీజీ కన్స్యూమర్ పేరు, మొబైల్ నంబరు, జిల్లా, మండలం, బియ్యం కార్డు నంబరు, ఎల్పీజీ కన్స్యూమర్ ఐడీ నంబర్లు ఉంటాయి. ఎల్పీజీ ఏజెన్సీ డిటెయిల్స్‌లో ఆ ఏజెన్సీ పేరు, ఐడీ, ఓఎంసీ(ఆయిల్ కంపెనీ) పేరు ఉంటాయి. ఇక ట్రాన్సాక్షన్ స్టేటస్‌లో వరుస నెంబరు, గ్యాస్ సిలిండరు డెలివరీ డేట్, సబ్సిడీ జమ తేదీ ఉంటాయి.





- ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ వచ్చేవరకు వెనుకబడిన వర్గాలకు న్యాయం జరుగలేదు. బీసీలు పూర్తిగా నష్టపోయారని, వారికి గుర్తింపు లేదని గుర్తించిన వ్యక్తి ఎన్టీఆర్. వారికి న్యాయం చేసిన ఏకైక పార్టీ టీడీపీయే.
- వెనుకబడిన వర్గాల పిల్లల్లో మాణిక్యాలు ఉన్నారు. వారికి సరైన చేయూతనిస్తే బ్రహ్మాండంగా రాణించగలుగుతారు.
- పేదలను ఆదుకుని శాశ్వతంగా పైకి తీసుకొస్తే పూలేను గుర్తు పెట్టుకున్నట్లుగానే మార్గదర్శకులను గుర్తుంచుకుంటారు. ఒక స్థాయి వరకు సొంతానికి, వ్యక్తిగతంగా కష్టపడదాం. తర్వాత మంచి పేరు కోసం కృషిచేద్దాం. అలాంటి వేదిక కోసమే మార్గదర్శి-బంగారు కుటుంబం కార్యక్రమం.
- గత ప్రభుత్వం అనుకూలం కాని ఇంటి జాగాలిచ్చింది. ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టించిన తర్వాతే మళ్లీ ఓటు కోసం వస్తా. నివాసయోగ్యమైన ఇళ్లు కట్టిస్తా.

- సీఎం చంద్రబాబు

బీసీలకు అండ



ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మార్కెట్ యార్డు వద్ద జరిగిన ప్రజా వేదిక సభకు హాజరైన జనం

(మొదటి పేజీ తరువాయి)

తయారు చేయడమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలం వడ్లమానులో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కార్యక్రమం కూడా నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ నుంచి తొలి విడతగా రూ.275 కోట్ల రుణాలను లబ్ధిదారులకు విడుదల చేశారు. బీసీ చట్టంపై ఇప్పటికే సబ్‌కమిటీ వేశామని, నివేదిక రాగానే ఆ చట్టం తీసుకొస్తామని బీసీ సబ్‌ప్లాన్ కింద ఈ ఏడాది రూ.48వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించడంతో ఆదరణ-3 ద్వారా చేతివృత్తులు, కులవృత్తుల మనుగడకు కృషి చేస్తామన్నారు. బలహీన వర్గాల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అమరావతిలో సివిల్ సర్వీస్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, 500 మందికి ఒక బ్యాచ్ చొప్పున శిక్షణ ఇచ్చేలా చూస్తామన్నారు. బీసీ సంక్షేమ వసతి గృహాల కోసం రూ.4,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని.. పెండింగ్‌లో రూ.76కోట్లు ఉంటే వెంటనే విడుదల చేయాలని ఆదేశించానని చెప్పారు. డీఎస్సీలో ఎక్కువ మంది బీసీలు ఉత్తీర్ణులయ్యేందుకు 5,720మందికి శిక్షణ కార్యక్రమాలు పెడతామన్నారు. ఆదరణ-3 కింద ఏటా రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తామని తెలిపారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

బీసీల ఆదాయం పెంచేందుకు..

వెనుకబడిన వర్గాల్లో కులవృత్తులు పోయాయి. చేతి వృత్తులు దెబ్బతింటున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని బీసీల ఆదాయం పెంచేందుకు ప్రత్యేకమైన కార్యక్రమాలు చేపట్టాం. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. కల్లుగీత కార్మికులకు మద్యం షాపులలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాం. వారికి ఫీజుల్లోనూ 50 శాతం రాయితీ కల్పించి ఎక్కువ ఆదాయం వచ్చేలా చేశాం. చేనేత కార్మికులకు మగ్గం ఉంటే 200 యూనిట్లు, పవర్‌లూమ్స్ ఉంటే 500 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తున్నాం. వెనుకబడిన వర్గాలు ఇళ్లు కట్టుకుంటే అదనంగా రూ.50 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. ఎస్సీలు పైసా చెల్లించకుండా సూర్యఘర్ యూనిట్లు పెట్టుకోవచ్చు. బీసీలకు కూడా ఇంటిపైనే కరెంటు ఉత్పత్తికి సోలార్ ఫలకలు పెట్టిస్తాం. దేవాలయాల్లో పని చేసే నాయీబ్రాహ్మణులకు గౌరవ వేతనం రూ.15వేల నుంచి రూ.25 వేలకు పెంచాం. బీసీ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తున్నాం. నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్లలో వెనుకబడిన వర్గాలకు న్యాయం చేసేందుకు 33శాతం కోటా పెట్టాం.

అన్నీ చేయాలనుంది.. గల్లాపెట్టె ఖాళీ..

సంపద సృష్టించాలి. అభివృద్ధి చేయాలి. ఆదాయాన్ని పెంచాలి. పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలి. మీకోసం ఎన్నో చేయాలనుంది. కానీ గల్లా పెట్టె ఖాళీగా ఉంది. అప్పులు తేవాలనుకుంటే ఇచ్చేవారు లేరు. నాపై ఉన్న నమ్మకంతో ఎంతోకొంత అప్పువస్తోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో 64 లక్షల మంది పేదలకు రూ.33వేల కోట్లు పింఛన్ల రూపంలో ఇస్తున్నాం. ఏపీలో రూ.4వేలు ఇస్తుంటే తెలంగాణ ఇచ్చేది రూ.2,600 మాత్రమే. ఏపీలో దివ్యాంగులకు రూ.6 వేలు, కిడ్నీ రోగులకు రూ.10 వేలు, మంచానికే పరిమితం అయితే రూ.15 వేలు ఇస్తున్నాం. ఆ రోజున నా మానస పుత్రికగా డ్వాక్రా సంఘాలు పెట్టాను. పొదుపు ఉద్యమం నడిపా. ఈ ఏడాది లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలను చేసే బాధ్యత తీసుకున్నాం. నా తల్లి కట్టెల పొయ్యితో పడిన బాధ కళ్లారా చూశాను. ఆ బాధ నా చెల్లెళ్లు పడకూడదనే 1996-97లో దీపం-1 పెట్టాను. సూపర్-6 హామీలో భాగంగా దీపం-2 కింద ఏటా 3 సిలెండర్లు ఉచితంగా ఇస్తున్నాం. రేపో ఎల్లుండో తల్లికి వందనం ఇస్తాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఇస్తాం.

సోషల్ మీడియా సైకోలకు వార్నింగ్..

రాజకీయాలు దిగజారిపోయాయి. సోషల్ మీడియా వేదికగా ఆడబిడ్డలపై అసభ్యంగా పోస్టులు పెడుతున్నారు. సోషల్ మీడియా నేరస్థుల అడ్డాగా మారిపోయే పరిస్థితి వచ్చింది. వ్యక్తిత్వ హననం చేసే వ్యక్తులకు అదే చివరి రోజని హెచ్చరిస్తున్నా. సోషల్ మీడియా వల్ల నేనే తప్పుదారి పట్టాను. వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయాడని వార్త చూశా. అది గొడ్డలి వేటని తెలుసుకునేందుకు చాలా సమయం పట్టింది. ఒక సీఎం స్థాయి వ్యక్తినే మోసం చేయగలిగారంటే సామాన్యులొక లెక్కా? (జగన్) అనంతపురం పోయి ఎన్ని డ్రామాలు ఆడారో చూశాం. 2019-24మధ్య రాష్ట్రంలో నేనే తిరగలేకపోయా. కానీ ఇప్పుడు ఎవరైనా, ఎక్కడైనా స్వేచ్ఛగా తిరిగే అవకాశం కల్పించాం. అయితే రౌడీయిజం చేస్తామంటే, నేరాలు చేస్తామంటే గట్టిగా ఉండాలా లేదా?

పూలే ఆదర్శాలతో.. పేదలకు పంచుదాం

- ఆర్థిక అసమానతలు తొలగించడానికే పీ-4: సీఎం

పూలేను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ చరిత్రలో నిలిచిపోయేలా సంపాదించిన దాంట్లో కొంత పేదలకు ఖర్చు చెయ్యాలని సీఎం చంద్రబాబు పిలుపిచ్చారు. 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కార్యక్రమంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం, ప్రైవేటు, పీపుల్ పార్టిసిపేషన్‌తో పీ-4 అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆర్థిక అసమానతలు తొలగించడానికే తెచ్చామని.. దీనికి జీరో పావర్టీ అని పేరు పెట్టామని చెప్పారు. 'పూలే దేశంలోనే తొలి మహిళా స్కూల్ ఏర్పాటు చేయడమే కాకుండా తన భార్య సావిత్రీబాయిపూలేను తొలి మహిళా టీచర్‌గా చేసిన గొప్ప వ్యక్తి. బీసీల ఆరాధ్యదైవంగా ఎప్పటికీ నిలిచిపోతారు. బాల్యవివాహాలు, సతీసహగమనాలు, మూఢనమ్మకాలపై రాజీలేని పోరాటం చేశారు. హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేశారు. ఇలాంటి వ్యక్తుల చరిత్ర నెమరువేసుకుంటే మనలో కూడా చైతన్యం వస్తుంది. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న 10శాతం మంది.. అట్టడుగున ఉన్న 20శాతం పేదలను పైకి తీసుకొచ్చేందుకు ముందుకు రావాలి' అని మరోసారి పిలుపిచ్చారు. ఆగిరిపల్లిలోని 206బంగారు కుటుంబాలకు మార్గదర్శులు అండగా ఉంటారని చెప్పారు. 'మార్గదర్శకులు ఓట్ల కోసం రావడం లేదు. పేరు కోసం వస్తున్నారు. రామకృష్ణ పరమహంస లేకపోతే వివేకానందుడు లేడు. బరోడా మహరాజ్ లేకపోతే అంబేడ్కర్ లేరు. పీ-4 కోసం గుర్తించిన కుటుంబాల్లో చాలా మంది ఆణిముత్యాలున్నారు. వారిని వెలికితీసే బాధ్యత మార్గదర్శకులదే' అని స్పష్టంచేశారు. ఆగిరిపల్లిలో ఒక యాదవుల కుటుంబంలో ఉన్న పిల్లను నువ్వు ఏమౌతావని అడిగితే ఒకరు డాక్టర్ కావాలంటే మరొకరు ముఖ్యమంత్రి కావాలన్నారని సీఎం తెలిపారు. 'పిల్లల ఆలోచనలు మారాయి. కోర్కెలు మారాయి. వారిని బాగా చదివిస్తే మట్టిలో మాణిక్యాలవుతారు. దేశం, రాష్ట్రం బాగుపడతాయి' అని చెప్పారు.

చదివించడానికి సాయం చేయండి..

నా భర్త డ్రైవర్‌గా పని చేస్తున్నారు. మాకు ఆస్తులు లేవు. సొంతిల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాం. రేషన్ కార్డు తప్పితే మరో ఆసరా లేదు. మా ముగ్గురు పిల్లలను చదివించుకోవడానికి సాయం కోరుతున్నాను. - ప్యారీ రేష్మ, గృహిణి

పూటగడవడానికి కూలికి..

బోన్ కేన్సర్‌తో నా భర్త మూడేళ్ల క్రితం చనిపోయారు. మావయ్యకు పింఛను ఉంది. నాకు పింఛన్ రావడం లేదు. పాప, బాబు ఉన్నారు. సొంతిల్లు లేక నా తల్లిదండ్రులతో ఉంటున్నాను. పూట గడవడం కోసం కూలీ పనులకు వెళ్తున్నాను. జీవనోపాధి కల్పించాలని కోరుతున్నా. - బోనం లక్ష్మీదుర్గ, గృహిణి

(వచ్చేనెల నుంచే పింఛను మంజూరు చేయడంతో పాటు 12 నెలల పింఛను కూడా ఇస్తామని.. సొంతిల్లు కట్టించి, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు ప్రకటించారు)

మార్గదర్శకుల మాట..

నాలుగేళ్లలో 25 కోట్లు ఖర్చుచేస్తా

మార్గదర్శి-బంగారు కుటుంబం చాలా మంచి కార్యక్రమం. దేశంలో ఎక్కడా లేని మంచి కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారు. రాబోయే నాలుగేళ్లలో రూ.20 నుంచి 25 కోట్ల వరకూ ఆగిరిపల్లిలోని పేదలకు ఖర్చు చేస్తా. ఆగిరిపల్లితో పాటు మా గ్రామమైన తుక్కులూరులో కూడా చేపడతాం.

- ప్రభాకర్, నూజివీడు సీడ్స్ అధినేత

స్థలాలిస్తే ఇళ్లు కట్టిస్తాం

పేద పిల్లల చదువుకు, ఆర్థిక ఇబ్బందులు పడేవారికి సాయం అందిస్తాం. ఇల్లు లేని వారికి ప్రభుత్వం స్థలాలు కేటాయిస్తే మేం వారికి ఇళ్ళు నిర్మించి ఇస్తాం. - సిద్ధార్థ, కుశలవ గ్రూప్

జనంతో సీఎం మమేకం!



ముఖ్యమంత్రి చంద్రబాబు జనంలో సామాన్యుడిలా కలిసిపోయారు. కుల వృత్తులతో జీవనం సాగిస్తున్న వారితో మాట కలిపారు. వారి పనుల్లో ఉన్న కష్ట సుఖాలు తెలుసుకున్నారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో శుక్రవారం 'పీ4' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు... బత్తుల జగన్నాథానికి చెందిన సెలూన్‌కు వెళ్లారు. అక్కడి కుర్చీలో కూర్చుని జగన్నాథంతో, ఆయన కుమారుడితో మాట్లాడారు. ఆధునాతన పరికరాలు కొనగలిగే స్తోమత లేదని వారు చెప్పడంతో... అప్పటికప్పుడే వారికి కొన్ని పరికరాలను అందించారు. ఆగిరిపల్లికి చెందిన రైతు కోటయ్య, గొర్రెల కాపరి శివయ్య ఇళ్లకు వెళ్లారు. వారి కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడారు. వారికి ఆదాయం గురించి ఆరా తీశారు. తరతరాలుగా ఇదే వృత్తిలో ఉన్నామని, పెద్దగా ఆదాయం లేదని వారు తెలిపారు. అక్కడే ఉన్న చిన్నారిని... ఏం చదువుతున్నావు అని చంద్రబాబు ప్రశ్నించారు. పెద్దయ్యాక ఏం చేస్తావని అడిగారు. 'మీలాగే సీఎం అవుతాను' అని ఆ అమ్మాయి బదులివ్వడంతో... 'బాగా చదువుకుని వృద్ధిలోకి రా' అని దీవించారు. అక్కడే... గొర్రె పిల్లను ఎత్తుకున్నారు. పశువులకు పచ్చిక అందించారు. పీ-4 సభా వేదిక కుమ్మరి కులస్తులతో మాట్లాడి... కొద్దిసేపు కుమ్మరి చక్రం కూడా తిప్పారు. - ఆగిరిపల్లి, ఆంధ్రజ్యోతి







టీడీపీలో సంస్థాగత కోలాహలం

- మే 15కల్లా పార్టీ ఎన్నికలు పూర్తిచేయాలి
- రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు చంద్రబాబు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పార్టీ సంస్థాగత నిర్మాణంపై టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టి సారించారు. సంస్థాగత ఎన్నికల నిర్వహణకు పక్కా కార్యాచరణ రూపొందించి, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పూర్తయ్యేలా చూడాలని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. రెండేళ్లకోసారి ఈ ఎన్నికలు జరుగుతుంటాయి. ఈసారి సంస్థాగత ఎన్నికల్లో మహిళలకు, ఎస్సీ ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, కొత్తగా కుటుంబ సాధికార సారథులను నియమించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి 60 మంది ఓటర్లకు ఇద్దరు కుటుంబ సాధికార సారథులను నియమించాల్సి ఉంటుంది. వీరిలో ఒకరు పురుషుడు, మరొకరు మహిళ ఉండాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఓటర్లకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో పార్టీలో తొలిసారిగా ఈ ప్రయోగం చేపట్టారు. మే 27 నుంచి మూడ్రోజులపాటు కడపలో మహానాడు నిర్వహించనున్న నేపథ్యంలో.. మే 15 నాటికి అన్ని నియోజకవర్గ, పార్లమెంటరీ స్థాయిలో సంస్థాగత ఎన్నికలు పూర్తి కావాలని చంద్రబాబు స్పష్టంచేశారు. ఎన్నికల సమర్థ నిర్వహణకు అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలకు సంస్థాగత ఎన్నికల పరిశీలకులను నియమించారు.

'లీప్'తో మారనున్న పాఠశాలల రూపురేఖలు

- అంతర్జాతీయ ప్రమాణాలతో మంగళగిరిలోనే మొదటి స్కూల్ అభివృద్ధి: మంత్రి లోకేశ్
- కొనసాగిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ



మంత్రి లోకేశ్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న వృద్ధురాలు

మంగళగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): త్వరలో లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని, ఇందులో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో మొదటి స్కూల్‌ను మంగళగిరి నియోజకవర్గంలోనే అభివృద్ధి చేయబోతున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. 50 రోజుల్లో పాఠశాల రూపురేఖలు మారిపోవాలని అధికారులకు సూచించానని పేర్కొన్నారు. మంగళగిరిలో శుక్రవారం కూడా పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. తాడేపల్లి, మంగళగిరి ప్రాంతాలకు చెందిన 1,030 మంది పేదలకు శాశ్వత ఇంటి పట్టాలను మంత్రి లోకేశ్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరిలో ప్రస్తుతం పేదలకు ఇస్తున్న ఆస్తి విలువ రూ.వెయ్యి కోట్లు ఉంటుందన్నారు. తాము ఇస్తున్న పట్టాతో వెంటనే రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చని, రెండేళ్ల తర్వాత అమ్ముకునే హక్కు కూడా వస్తుందని తెలిపారు. సూపర్ సిక్స్‌లోని కొన్ని హామీలను మే నెలలో నిలబెట్టుకోబోతున్నామని మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా చెప్పారు.

డోలీ మోతలు తప్పించడమే లక్ష్యం: మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు డోలీ మోతలు తప్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలంలో జి.శివడ నుంచి రాముడుగూడ వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర నిర్మించిన బీటీ రహదారిని శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కనిపించలేదు. కూటమి ప్రభుత్వం ప్రతి గిరిజన గ్రామానికీ రహదారి నిర్మించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతోంది. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారు. జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరిస్తాం. గురుకులాలు, కళాశాలలు, పాఠశాలల, అభివృద్ధికి రూ.159 కోట్లు మంజూరయ్యాయి' అని తెలిపారు.

దాటవేత.. డొంక తిరుగుడు!

- సీఐడీ విచారణలో జోగి రమేశ్ తీరు
- దాడికి కాదు.. నిరసనకే బాబు ఇంటికెళ్లాం
- మా కార్లలో కర్రలు, రాళ్ల గురించి నాకు తెలియదు: మాజీ మంత్రి
- మరోసారి రావాలన్న అధికారులు



విచారణ అనంతరం బయటకు వస్తున్న జోగి

విజయవాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలియదు.. గుర్తు లేదు..! సీఐడీ వేసిన ప్రశ్నలకు మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ ఇచ్చిన సమాధానాలివి. ఉండవల్లిలోని అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో విచారణ కోసం శుక్రవారం విజయవాడలోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి ఆయన వచ్చారు. ఈ కేసులో జోగి సహా 11 మంది నిందితులుగా ఉన్నారు. ఆయనతో పాటు పది మంది విచారణకు వచ్చారు. అనారోగ్యం కారణంగా ఒకరు రాలేదు. నాటి ఘటనపై సీఐడీ ఎస్పీ శ్రీదేవిరావు నేతృత్వంలోని బృందం గంటపాటు జోగిని విచారించింది. మొత్తం 35 ప్రశ్నలు అడుగగా.. ఆయన చాలా వాటికి బదులివ్వలేదని సమాచారం. ఎవరి ఆదేశాలతో ఉండవల్లి కరకట్ట ఎక్కారని ప్రశ్నించగా.. తనకు తానే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. ఘటన జరిగిన రోజున ఉపయోగించిన సెల్‌ఫోన్ గురించి అడుగగా.. దాన్ని మార్చేశానని జవాబిచ్చారు. కొన్ని ప్రశ్నలకు.. చెప్పిన సమాధానాలే మళ్లీ మళ్లీ చెప్పారని విశ్వసనీయంగా తెలిసింది. ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న అధికారులు.. మరోసారి విచారణకు హాజరు కావలసి ఉంటుందని చెప్పి ఆయన్ను, ఇతర నిందితులను పంపించివేశారు. వాస్తవానికి నాడు చంద్రబాబు ఇంటిపై దాడి చేయడానికి జోగి మందీమార్బలంతో వెళ్లారు. కార్లలో కర్రలు, రాళ్లు వేసుకుని కరకట్టపై వీరంగం చేశారు. దీనిపై సీఐడీ అధికారుల ప్రశ్నలు, ఆయన సమాధానాలు కింది విధంగా ఉన్నాయి..

సీఐడీ: చంద్రబాబు ఇంటిపై దాడికి ఎందుకు వెళ్లారు?

జోగి: నేను దాడి చేయడానికి వెళ్లలేదు

సీఐడీ: మరి ఎందుకు వెళ్లినట్లు?

జోగి: నిరసన తెలియజేయడానికి మాత్రమే వెళ్లాను.

సీఐడీ: నిరసనకు కారణమేంటి?

జోగి: నాడు సీఎంగా ఉన్న జగన్‌ను ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసభ్యకరంగా మాట్లాడారు.

సీఐడీ: నిరసనకు వెళ్తే కర్రలు, రాళ్లు కార్లలో ఎందుకున్నాయ్?

జోగి: వాటి గురించి నాకు తెలియదు. నేను గమనించలేదు. టీడీపీ వాళ్లే నా కార్లను ధ్వంసం చేశారు. తిరిగి నాపై కేసు పెట్టారు.

మమ్మల్ని ఏమీ చేయలేరు

- మళ్లీ అధికారంలోకి వస్తాం..
- కేసులకు, నోటీసులకు భయపడను
- కూటమి ప్రభుత్వం ఎల్లకాలం ఉండదు
- మీడియా వద్ద 'ఊగిన' జోగి రమేశ్

'ఎప్పటి కేసులివి. ఎప్పుడు నోటీసులు ఇస్తున్నారు? మమ్మల్ని ఏమీ చేయలేరు. మళ్లీ అధికారంలోకి వస్తాం' అని జోగి రమేశ్ వ్యాఖ్యానించారు. విచారణ అనంతరం సీఐడీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఊగిపోయారు. సీఐడీ అధికారులను బెదిరించే ధోరణిలో మాట్లాడారు. తాను కేసులకు, నోటీసులకు భయపడనన్నారు. వైఎస్ శిష్యుడిగా నిక్కరు వేసుకున్నప్పటి నుంచి కృష్ణా జిల్లా రాజకీయాల్లో ఉన్నానని.. భూమి గుండ్రంగా తిరుగుతుందని, ఎల్లకాలం ఒకేలా ఉండదని.. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని పదే పదే అన్నారు. 'సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం విచారణకు హాజరయ్యా. తెలిసిన సమాచారాన్ని అధికారులకు ఇచ్చాను. ఆనాడు అయ్యన్నపాత్రుడు అసభ్యకరంగా జగన్‌ను దూషించారు. ఈ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా చంద్రబాబు నివాసం వద్దకు వెళ్లి నిరసన చేపట్టాం. అయితే నిరసనకు వెళ్లిన నాపై టీడీపీ వాళ్లు దాడి చేశారు. నా కార్లను ధ్వంసం చేశారు. అక్రమంగా కేసు పెట్టి ఏదో సాధించాలనుకుంటున్నారు. నన్ను భయపెట్టలేరు. ఈ మధ్యే వచ్చిన సర్వే ప్రకారం ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే 75 మంది టీడీపీ ఎమ్మెల్యేలకు డిపాజిట్లు గల్లంతవుతాయి. కడుపునిండా అన్నం పెట్టిన జగన్‌ను వదులుకుని.. పలావు పెడతానని చెప్పిన చంద్రబాబును నమ్మి ఓటేసినందుకు జనం బాధపడుతున్నారు. బాబు కుర్చీ కోసం సొంత పుత్రుడు, దత్తపుత్రుడు పోటీపడుతున్నారు. మూడేళ్ల క్రితం జరిగిన ఘటనపై కేసుపెట్టి వేధించాలని చూస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కు లేదా? నన్ను అరెస్టు చేసి ఆనందం పొందాలని చూస్తున్నారు. ఎన్నాళ్లు రెడ్‌బుక్ పట్టుకుని తిరుగుతారు? ఎల్లకాలం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండదని గుర్తుపెట్టుకోవాలి' అని అన్నారు.

భారతీరెడ్డిపై వ్యాఖ్యలు బాధాకరం

- వైసీపీ పెంచి పోషించిన కాలకేయులే వ్యవస్థను భ్రష్టు పట్టించారు
- ఇలాంటి నీచపు కామెంట్స్ తీవ్రవాదంతో సమానం
- ఈ సైకోగాళ్లను నడిరోడ్డుపై ఉరి తీయాలి
- 'సైతాన్ సైన్యానికి' జగన్ పార్టీ, టీడీపీనే ఆదర్శం: షర్మిల



అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ భారతీరెడ్డి మీద సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరం. ఇలాంటి నీచపు కామెంట్స్ తీవ్రవాదంతో సమానం. ఈ సైకోగాళ్లను నడిరోడ్డుమీద ఉరితీసినా తప్పులేదు' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. వైసీపీ హయాంలో తనపై జరిగిన దాడిని పరోక్షంగా ప్రస్తావిస్తూ 'అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఉచ్చం, నీచం, మానం, మర్యాద లేకుండా ప్రవర్తించారు. రక్త సంబంధాన్ని మరిచారు. రాజకీయ కక్షతో కుటుంబాలను రోడ్డు మీదకు లాగారు. మనిషి పుట్టుకను అనుమానించి రాక్షసానందం పొందారు. అన్యం, పుణ్యం ఎరుగని పసిపిల్లలను సైతం గుంజారు. అక్రమ సంబంధాలు అంటగట్టారు. మీరు పెంచి పోషించిన కాలకేయులే ఇప్పుడు వ్యవస్థను భ్రష్టు పట్టించారు. ఈ దారుణ సంస్కృతిని వెలివేయడానికి అన్ని పార్టీలూ ముందుకు రావాలి' అని షర్మిల కోరారు. రేటింగ్స్ కోసం ఎంటర్‌టైన్ చేసే యూట్యూబ్ చానెళ్లపై కఠిన చర్యలు ఉండాలన్నారు. సమాజం ఇలాంటి మకిలి చేష్టలను హర్షించదని, ఏ పార్టీ వాళ్లయినా, ఎంతటి వాళ్లయినా శిక్ష పడాల్సిందేనని డిమాండ్ చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడే నీచపు వ్యవస్థకు, విష సంస్కృతికి బీజం వేసింది వైసీపీ, టీడీపీనే అని తేల్చిచెప్పిన షర్మిల.. అసభ్యపోస్టులు పెట్టే సైతాన్ సైన్యానికి ఆ రెండు పార్టీలే ఆదర్శమని అన్నారు.

మళ్లీ పర్మిట్ రూమ్‌లు!?

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంది. అయితే... దాని వల్ల తలెత్తే ఇబ్బందులను వివరించడంలో ఎక్సైజ్ అధికారులు విఫలమయ్యారు. పర్మిట్ రూమ్‌ల రద్దు నిర్ణయం వల్ల ప్రభుత్వం రూ.175 కోట్ల ఆదాయం కోల్పోయింది. ఆదాయం సంగతి పక్కనపెడితే.. పర్మిట్ రూమ్ లేకపోయినా సరే మందుబాబులు సీసాలు కొనుక్కుని షాపుల దగ్గరే తాగుతున్నారు. దీంతో మళ్లీ పర్మిట్ రూమ్‌లు పెట్టాలని ఎక్సైజ్ శాఖ ఆలోచన చేస్తోంది. తాజాగా తిరుపతిలో జరిగిన ఎక్సైజ్ సమీక్ష సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చింది. పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వడమే మంచిదని, దానివల్ల బహిరంగ ప్రదేశాల్లో తాగుడు గోల పోతుందని ఎక్కువ మంది అధికారులు అభిప్రాయపడ్డారు. దీంతో దీనిపై ఓ కవిటీ వేయాలని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

ఆదాయం ఇలా నష్టం..

సాధారణంగా మద్యం షాపుల వద్ద మందు కొనుక్కునేవారు అక్కడే తాగుతుంటారు. అయితే వారు షాపు ముందు, రోడ్లపై తాగకుండా ఎక్సైజ్ శాఖ పర్మిట్ రూమ్‌లకు అనుమతిస్తుంది. షాపు లైసెన్సీ అక్కడే ఒక చిన్న రూమ్ ఏర్పాటుచేసి తాగేందుకు అవకాశం కల్పిస్తారు. అందుకోసం లైసెన్సీ ఏడాదికి రూ.5లక్షలు ఎక్సైజ్ శాఖకు చెల్లించాలి. గతేడాది అక్టోబరులో 3,396 షాపులకు లైసెన్స్‌లు జారీచేశారు. ఆ తర్వాత గీత కులాలవారికి 340 షాపులు ఇచ్చారు. మొత్తంగా 3,500 షాపుల లైసెన్సీలు రూ.5లక్షల చొప్పున చెల్లించినా రూ.175 కోట్ల ఆదాయం వచ్చేది. గతంలో మద్యం షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లకు అవకాశం ఉండేది. కానీ వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. షాపుల వద్ద తాగుడు తగ్గిస్తామని ఆ నిర్ణయం తీసుకుంది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా, ఎక్సైజ్ శాఖ అదే బాటలో నడిచింది. పర్మిట్ రూమ్‌లకు అవకాశం ఇస్తే మద్యం షాపులు మినీ బార్లుగా మారతాయని మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయపడింది. అయితే పర్మిట్ రూమ్‌లకు అవకాశం ఇవ్వకపోతే కొత్త ఇబ్బందులు వస్తాయనే విషయాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులు ఉపసంఘానికి సరైన రీతిలో వివరించలేదు. ఉపసంఘం తీసుకున్న నిర్ణయాన్ని యథావిధిగా అమలుచేశారు. ఫలితంగా భారీ నష్టం వచ్చింది.

అయినా ఫలితం ఎక్కడ?

అంత ఆదాయం కోల్పోయినా ప్రయోజనం మాత్రం శూన్యమే. నిజానికి, గత వైసీపీ ప్రభుత్వంలోనే ఈ నిర్ణయం వల్ల ఇబ్బందులు తలెత్తాయి. షాపుల వద్ద తాగేందుకు అనుమతివ్వకపోవడంతో రోడ్లపై విచ్చలవిడిగా తాగుతూ మందుబాబులు సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవారు. అయినా కూటమి ప్రభుత్వం కూడా అదే నిర్ణయం తీసుకోవడంతో మళ్లీ అదే పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తోంది. చాలా చోట్ల మందుబాబులు రోడ్లపైనే మందు తాగుతున్నారు. అలాగే అనుమతి లేకపోయినా షాపుల లైసెన్సీలు అక్కడే తాగేందుకు అవకాశం కల్పిస్తున్నారు. తరచూ దీనిపై ఫిర్యాదులు రావడంతో ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నా, పెద్దగా ప్రయోజనం కనిపించట్లేదు.

గ్రామాల్లో పెడితే మంచిది


పర్మిట్ రూమ్‌లు తొలుత గ్రామీణ ప్రాంతాల్లో పెడితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పట్టణాల్లో అనుమతిస్తే అది బార్లకు ప్రతికూలంగా మారుతుంది. ఎలాగూ మరో నాలుగునెలల్లో బార్ పాలసీ ముగుస్తుంది. ఆగస్టులో కొత్త బార్ పాలసీ అమల్లోకి వస్తుంది. అందువల్ల ఈలోగా తొలుత గ్రామీణ ప్రాంతాల్లోని షాపులకు అయినా అనుమతివ్వాలని ఎక్సైజ్ అధికారులు కూడా సూచిస్తున్నారు.



కమనీయం..



ఒంటిమిట్ట కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి, భక్తులు



సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరైన జనంతో కళకళలాడుతున్న ప్రాంగణం

కోదండరాముని కల్యాణం

- పండు వెన్నెలలో... నెలరాజు సాక్షిగా... సీతమ్మ మెడలో రామయ్య మాంగల్యధారణ
- తిలకించి, పులకించిన వేల మంది భక్తులు
- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు
- సంప్రదాయ పంచెకట్టుతో ఆలయ ప్రవేశం
- తిరుమల నుంచి మైథిలికి స్వర్ణకిరీటం..
- రామచంద్రుడికి యజ్ఞోపవీతం కానుకలు
- భక్తజన సంద్రంగా మారిన ఒంటిమిట్ట
- ఏకశిలానగరంలో మార్మోగిన రామనామం

కడప/రాజంపేట/ఒంటిమిట్ట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణం శుక్రవారం రాత్రి రమణీయంగా.. కమనీయంగా జరిగింది. రఘుకుల తిలకుడు, దశరథ తనయుడు శ్రీరామచంద్రమూర్తికి, జనక మహారాజు సుపుత్రిక జానకీదేవితో కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పిండారబోసినట్లున్న పండు వెన్నెలలో, నెలరాజు సాక్షిగా.. టీటీడీ వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్య ఘోషలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ సర్వమంగళ స్వరూపుడైన శ్రీరాముడు, మహాలక్ష్మీ స్వరూపిణి సీతమ్మ మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. రాత్రి 8.10 గంటలకు టీటీడీ ఆగమశాస్త్ర పండితులు కంకణబట్టర్ రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో మాంగల్య ధారణ ఘట్టాన్ని తిలకించిన భక్తజనుల మనసులు సంబరంతో ఉప్పొంగాయి. కల్యాణ క్రతువును ఆసాంతం చూసి ఆనందంతో పులకించారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులతో ఒంటిమిట్ట జనసంద్రమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సంప్రదాయ పంచెకట్టులో ఆలయ ప్రవేశం చేసిన చంద్రబాబుకు వేద పండితులు, టీటీడీ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం సీఎం సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు. తిరుమల శ్రీవారి తరఫున రామయ్యకు యజ్ఞోపవీతం, అమ్మవారికి స్వర్ణకిరీటాన్ని టీటీడీ కానుకగా అందించింది.

వైభవంగా శోభాయాత్ర, ఎదుర్కోలు ఉత్సవం

ఒంటిమిట్ట కోదండరామాలయం నుంచి సీతారాముల ఉత్సవమూర్తుల శోభాయాత్ర శుక్రవారం సాయంత్రం వైభవంగా సాగింది. కల్యాణ వేదిక వద్ద ఎదుర్కోలు ఉత్సవాన్ని వీక్షించిన భక్తులు ఆనందపరవశులయ్యారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఎదురెదురుగా ఉంచి పూలమాలలు మార్చుకునే ఈ ఉత్సవం ఆద్యంతం నేత్రపర్వంగా సాగింది. అమ్మవారి తరఫున ఆచార్య చక్రవర్తుల రంగనాథ్, స్వామివారి తరఫున ఆచార్య ఆకెళ్ల విభీషణశర్మ పాల్గొన్నారు. దారిపొడవునా శ్రీవారి సేవకుల కోలాటాలు, నృత్యాలు, భజనలతో కోలాహలం నెలకొంది. భక్తకోటి చేసిన రామనామ స్మరణలతో ఏకశిలానగరం మార్మోగింది.

ఆకట్టుకున్న కల్యాణవేదిక కళాకృతులు

టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా... త్రేతాయుగం నాటి జనకపురిని గుర్తుకు తెచ్చేలా కల్యాణ వేదికను సుందరంగా తీర్చిదిద్దారు. వేదికపై ప్రాచీన ఆలయాలలోని కళాకృతులు, దశావతారాల సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వరి గింజలతో మండపం ఏర్పాటు, చెరకు గెడలు, కొబ్బరి పూత, అరటి ఆకులు, మామిడి ఆకులు,కాయలు, విదేశీ పుష్పాలతో చేసిన అలంకరణలు ఆకట్టుకున్నాయి. ఇందుకోసం 4 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 60 వేల కట్ ఫ్లవర్స్ వినియోగించారు. టీటీడీ ఉద్యానవన విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసులు పర్యవేక్షణలో రెండురోజుల పాటు 120 మంది అలంకరణ నిపుణులు, 120 మంది టీటీడీ సిబ్బంది వేదికను తీర్చిదిద్దారు.

రాష్ట్రంలో రామరాజ్యం తీసుకొస్తా

- పేదరికం లేని సమాజమే లక్ష్యం
- ఒంటిమిట్ట ఆలయాన్ని అభివృద్ధి చేస్తా
- ఆధ్యాత్మిక టూరిజం హబ్‌గా అభివృద్ధి
- తిరుమల తరహాలో అన్నప్రసాదాలు: చంద్రబాబు

రాష్ట్రంలో రామరాజ్యాన్ని తీసుకొస్తానని, ఆ స్వామి స్ఫూర్తితో పేదరికం లేని సమాజాన్ని తెస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఒంటిమిట్ట సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. టెంపుల్ టూరిజంలో భాగంగా ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామని, తిరుమల తరహాలో ఇక్కడా అన్నప్రసాదాలు ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. యుగపురుషుడైన శ్రీరాముడు ఆదర్శప్రాయుడని, తండ్రి ఆజ్ఞ మేరకు అరణ్యవాసం చేశారని, ఆయన నీతి నిజాయితీ మనందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన పాలనను తీసుకురావడమంటే పేదరికం లేని సమాజంగా తీర్చిదిద్దడం, సాటి మనిషిని గౌరవించడం, అందరూ సమానమన్న భావన ఏర్పడటమేనని తెలిపారు. పారిశ్రామికవేత్త పెన్నా ప్రతాప్‌రెడ్డి కోదండరామాలయానికి రూ.6.50 కోట్ల బంగారు, వజ్ర కిరీటాలు బహూకరించడం అభినందనీయని కొనియాడారు. ఇలాంటివారు ముందుకు వచ్చి ఆలయాలను అభివృద్ధి చేయాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 30 లక్షల పేద కుటుంబాలు ఉండగా 10 లక్షల కుటుంబాలు ఆర్థికంగా బాగున్నవారు ఉన్నారని చెప్పారు. పేద కుటుంబాలను అభ్యున్నతిలోకి తీసుకురావడమే ప్రధాన సంకల్పంగా పేర్కొన్నారు. తిరుమలలో ఎన్టీఆర్ అన్న ప్రసాద కేంద్రాన్ని ప్రారంభించారని, నేడు ఆ ట్రస్టు రూ.2,200 కోట్ల డిపాజిట్లకు చేరుకొని, రోజూ లక్షమందికి అన్నప్రసాదం అందిస్తోందని వివరించారు. టీటీడీ బోర్డు వెంటనే సమావేశమై ఒంటిమిట్టలో అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక్కడ మిగిలిపోయిన అభివృద్ధి పనులన్నీ వెంటనే పూర్తిచేస్తామని తెలిపారు. తిరుమల, ఒంటిమిట్ట, తాళ్లపాకను కలుపుతూ ఆధ్యాత్మిక టూరిజం హబ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. దేవాలయాలు వారసత్వ సంపదకు నిలయాలుగా అభివర్ణించారు. దేవాలయాల వల్లే కుటుంబ వ్యవస్థ ఏర్పడిందని పేర్కొన్నారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు వెంటనే ఒంటిమిట్టలో అన్నప్రసాదాలను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీఎం సతీమణి భువనేశ్వరి, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రులు సవిత, రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీలు సీఎం రమేశ్, అవినాశ్ రెడ్డి, మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, టీటీడీ ఈవోతో పాటు ఉమ్మడి కడప జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో సీఎం బస

సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా ఒంటిమిట్టకు వచ్చిన సీఎం చంద్రబాబు దంపతులు శుక్రవారం రాత్రి ఇక్కడే బస చేశారు. ఈ సందర్భంగా బారీ పోలీసు బందోస్తు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం బయలుదేరి సీఎం విజయవాడ వెళ్లనున్నారు.

సీతారామ లక్ష్మణులకు 7 కిలోల స్వర్ణకిరీటాలు

- పెన్నా సిమెంట్స్ అధినేతల విరాళం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామాలయంలోని సీతారామ లక్ష్మణులకు మండలంలోని మంటపంపల్లె గ్రామానికి చెందిన పెన్నా సిమెంట్ అధినేతలు మూడు స్వర్ణకిరీటాలను విరాళంగా అందించారు. శుక్రవారం స్థానిక కోదండరామాలయంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మంలకు పెన్నా సిమెంట్ అధినేతలు ప్రతాప్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి వీటిని అందజేశారు. సుమారు 7 కిలోల బంగారంతో తయారుచేసిన ఈ కిరీటాలు దాదాపు రూ.6.60 కోట్ల విలువ చేస్తాయి. అంతకుముందు వేణుగోపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి కోదండరాముడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఒంటిమిట్ట కోదండ రామాలయానికి రూ.6.6 కోట్ల విలువైన మూడు బంగారు, వజ్రాల కిరీటాలను అందజేస్తున్న పెన్నా సిమెంట్స్ అధినేత ప్రతాప్‌రెడ్డి, కుటుంబ సభ్యులు



నెల్లూరు జిల్లా వెంకటాచలం కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని బయటకు తీస్తున్న రైతులు

ఈదురు గాలుల బీభత్సం

- అనంతలో రూ.10.29 కోట్ల పంట నష్టం
- నెల్లూరు జిల్లాలో తడిసిన ధాన్యం.. రైతుల గగ్గోలు

అనంతపురం అర్బన్, వెంకటాచలం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1050.47 హెక్టార్లల్లో రూ.10.29 కోట్ల విలువైన వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. కోత దశలో పంటలు దెబ్బతినడంతో పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఇక, నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలో గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం నీటిపాలవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం గ్రామాల్లో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తడిసినధాన్యాన్ని పరిశీలించి, రైతులకు ధైర్యం చెప్పారు.

బలహీనపడిన అల్పపీడనం.. నేటి నుంచి సెగలే

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో రెండు రోజులపాటు కొనసాగిన అల్పపీడనం శుక్రవారం బలహీనపడింది. అయితే దానిపై ఉపరితల ఆవర్తనం, ఉపరితల ద్రోణి ప్రభావంతో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, ఆ సమయంలో గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగింది. కాగా, కోస్తా జిల్లాల్లో శనివారం నుంచి మళ్లీ వడగాడ్పులు పెరిగే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం కడప జిల్లా అట్లూరులో 41.4, ప్రకాశం జిల్లా గుంటుపల్లిలో 41.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవగా, 28 ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఇప్పుడైనా మాకు న్యాయం చేయండి

- పీఆర్ అండ్ ఆర్డీ అధికారులకు ఉపాధి సిబ్బంది మొర

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో తమ గోడు ఎవరూ పట్టించుకోలేదని, ఇప్పుడైనా తమకు న్యాయం చేయాలని ఉపాధి హామీ పథకం సిబ్బంది కోరుతున్నారు. సమస్యలు పరిష్కరించాలంటూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ, ఉపాధి పథకం డైరక్టర్ షణ్ముక్ కుమార్‌లను కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లులతో పాటు పలు యూనియన్ నేతలు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనరేట్ కార్యాలయానికి తరలివచ్చారు.

111 సెక్షన్ ఎందుకు పెట్టారు?

- చేబ్రోలు కిరణ్ కేసులో పోలీసులపై కోర్టు సీరియస్.. రిమాండ్

మంగళగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ సతీమణి భారతిని సోషల్ మీడియాలో దూషించిన కేసులో అదుపులోకి తీసుకున్న చేబ్రోలు కిరణ్‌ను శుక్రవారం మధ్యాహ్నం మంగళగిరి కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. న్యాయస్థానం కిరణ్‌కు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా.. కిరణ్‌పై పోలీసులు 111 సెక్షన్ (మరో వ్యక్తిని నేరం చేయడానికి ప్రేరేపించడం) పెట్టడంపై న్యాయాధికారి అభ్యంతరం తెలిపారు. ఇష్టానుసారం సెక్షన్లు పెట్టి చట్టాన్ని అవహేళన చేస్తున్నారని కేసు విచారణాధికారి శ్రీనివాసరావుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ సెక్షన్ ఎందుకు పెట్టవలసి వచ్చిందో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

మాధవ్ వీరంగం

(మొదటి పేజీ తరువాయి)

హాజరుపరిచారు. అయితే, అప్పటికే పోలీసులపై గోరంట్ల మాధవ్ వీరంగం చేశారు. "ఏం తమాషాలు చేస్తున్నారా? దోపిడీ దొంగనా నేను? దేశానికి ఎంపీగా చేశా.. పోలీస్ ఆఫీసర్ని.... ఏమనుకుంటున్నారు...?" అంటూ రెచ్చిపోయారు. అసలు ఏమనుకుంటున్నారంటూ పోలీస్ అధికారులపై హెచ్చరిక స్వరం వినిపించారు. అనంతరం మాధవ్ సహా నిందితులందరినీ పోలీసులు కోర్టుకు తీసుకెళ్లారు. మాధవ్ తీరును గుంటూరు ఎస్పీ సతీశ్‌కుమార్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కోర్టు నుంచి నిందితులను బలవంతంగా నైనా పోలీస్ కార్యాలయానికి తీసుకురావాలంటూ వారు ఆదేశాలిచ్చాయి. దీంతో పోలీసు అధికారులు... నిందితులను తిరిగి తీసుకువచ్చేందుకు సిబ్బందిని పంపారు. కోర్టు నుంచి తిరిగి పోలీస్ కార్యాలయానికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించిన పోలీసులపై మాధవ్ విరుచుకుపడ్డారు. అడ్మిన్ ఏఎస్పీ రమణకుమార్‌తో వాగ్వాదానికి దిగారు. అక్కడ ఉన్న వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, పేర్ని నాని తదితరులు జోక్యం చేసుకుని పోలీసులతో మాట్లాడుతుండగా.. మాధవ్ హడావుడిగా కోర్టు హాల్లోకి వెళ్లిపోయారు. దీంతో పోలీసులు వెనుతిరిగారు.



అదనపు ఎస్పీ రమణకుమార్‌తో కోర్టు వద్ద వాగ్వాదానికి దిగిన గోరంట్ల మాధవ్

దోమల ధాటికి నిద్రలేక లాకప్‌లో సతమతం

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, ఆయన అనుచరులు నల్లపాడు పోలీస్‌స్టేషన్ లాకప్‌లో గురువారం రాత్రంతా గడిపారు. లాకప్‌లో అరుగుపై మాధవ్ పడుకున్నారు. అయితే, దోమల ధాటికి ఆయనకు సరిగా నిద్ర పట్టలేదు. గతంలో సీఐగా ఎంతోమంది నిందితులను అరెస్టు చేసి లాకప్‌లో వేసిన ఆయన, చివరకు తనే లాకప్‌లో రాత్రంతా గడపాల్సి వచ్చింది.

లోక్‌సభ స్పీకర్ అనుమతి అక్కర్లేదు

గోరంట్ల మాధవ్‌కు బెయిల్ ఇప్పించేందుకు మాజీ ఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, హైకోర్టు సీనియర్ న్యాయవాది మనోహర్ రెడ్డితో పాటు పలువురు న్యాయవాదులు రంగంలోకి దిగారు. గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట వాదనలు వినిపించారు. మాధవ్ లోక్‌సభ మాజీ సభ్యుడని, అరెస్టుకు ముందుగా సెక్షన్ 195 ప్రకారం లోక్‌సభ స్పీకర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని పొన్నవోలు వాదించారు. కేసులో సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షకు సంబంధించినవే కాబట్టి 41ఎ నోటీసు జారీ చేసి పంపవచ్చని వాదించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ శౌరి, ఐదో మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఏపీపీ పవన్‌కుమార్ వాదనలు వినిపించారు. మాధవ్‌పై నమోదైన నేరానికి సంబంధించి 195 వర్తించదని, మాజీ లోక్‌సభ సభ్యుని అరెస్టుకు స్పీకర్ అనుమతి తీసుకోవాల్సిన అవసరంలేదని వాదించారు. గౌరవ లోకసభ మాజీ సభ్యుడు, మాజీ పోలీస్ అధికారి అయినప్పటికీ ఆయన చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకొని పోలీసుల ఐదుపులో ఉన్న నిందితుడిపై దాడి చేశారని, పోలీస్ కారు అద్దాలు ధ్వంసం చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. మాధవ్‌కు రిమాండ్ విధించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ జి. స్రవంతి గోరంట్ల మాధవ్ సహా నిందితులకు రిమాండ్ విధించారు కాగా ఏపీపీలకు మద్దతుగా టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు శ్రీరామ్ రాజీవ్ ఆనంద్, కట్టా కాళిదాసు, పారి బాబురావు, వేమూరు శ్రీనివాసరావు తదితరులు కోర్టుకు వచ్చారు.

జైలుకు గోరంట్ల

- 14 రోజులు రిమాండ్ విధించిన కోర్టు
- మాజీ ఎంపీ సహా ఆరుగురు రాజమహేంద్రికి తరలింపు

గుంటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిపై దాడిచేసి, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై జులుం ప్రదర్శించిన కేసులో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు గుంటూరు కోర్టు రిమాండ్ విధించింది. అనంతరం మాధవ్ సహా ఆరుగురు నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. మాజీ సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతిపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన కేసులో చేబ్రోలు కిరణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని గుంటూరు ఎస్పీ కార్యాలయానికి తీసుకొస్తుండగా మాధవ్ అటకాయించి దాడి చేశారు. ఎస్పీ కార్యాలయం వద్ద హల్‌చల్ సృష్టించారు. ఈ కేసులో మాధవ్ సహా ఆరుగురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్లో సత్యసాయి జిల్లా రామగిరి మండలం శేషంపల్లికి చెందిన చిగండి రమేశ్ (29), అనంతపురం జిల్లా గార్ల దిన్నె మండలం కృష్ణాపురానికి చెందిన తాళ్ల దామోదర్ (29), సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఆర్ కొట్టాల గ్రామానికి చెందిన దిగివింటి శివ ప్రసాద్ (32), సత్యసాయి జిల్లా రామగిరి మండలం శేషంపల్లికి చెందిన చిదగొండ్ల శివయ్య (27), సత్యసాయి జిల్లా రామగిరి మండలం పోలేపల్లికి చెందిన గొల్ల సురేందర్ (23) ఉన్నారు.

మాధవ్ సహా ఆరుగురినీ గుంటూరులోని స్పెషల్ మొబైల్ కోర్టులో ప్రవేశపెట్టగా, మేజిస్ట్రేట్ జి.స్రవంతి వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించారు. అయితే, పోలీసుల వినతిపై భద్రతాకారణాల రీత్యా చివరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పంపాలని ఆదేశాలు జారీచేశారు. అంతకుముందు ఎస్పీ సతీశ్‌కుమార్ కేసు వివరాలను మీడియాకు వివరించారు. "ఒక యూట్యూబ్ చానెల్ ఇంటర్వ్యూలో వైఎస్ భారతిపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్ అనే నిందితుడిని గురువారం ఇబ్రహీంపట్నంలో అరెస్టు చేశాం. అక్కడనుంచి గుంటూరుకు తరలిస్తుండగా తన అనుచరులతో పోలీస్ వాహనాన్ని అనుసరిస్తూ, వారి కస్టడీలో ఉన్న నిందితుడిపై మాధవ్ దాడి చేశారు. పోలీసులపై కూడా దురుసుగా ప్రవర్తించి, వారి విధులకు ఆటంకం కలిగించారు. మాజీ ఎంపీయే కాకుండా మాజీ పోలీసు అధికారికూడా అయిన వ్యక్తి నుంచి ఇలాంటి ప్రవర్తన ఊహించలేం. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే నిందితుల లక్ష్యం." అని ఎస్పీ తెలిపారు.



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం రాష్ట్రస్థాయి గుర్రాల పరుగు పోటీలు సందడిగా సాగాయి. అనకాపల్లి జిల్లా చేనుల అగ్రహారంలోని మణికి చెందిన గుర్రం ప్రథమ స్థానంలో నిలవగా రూ.25వేల నగదు బహుమతి అందజేశారు. - గొల్లప్రోలు రూరల్, ఆంధ్రజ్యోతి

టీటీడీ గోశాలపై రగడ!

తిరుపతి(జీవకోన)/తిరుమల/అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలపై వివాదం రాజుకుంది. ప్రభుత్వం, అధికారుల పర్యవేక్షణ లేకనే ఇక్కడి గోశాలలో 3 నెలల్లో వందకుపైగా గోవులు మృతి చెందాయని టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ నాయకుడు భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గోవుల మరణాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన ఆవులకు పోస్టుమార్టం ఎందుకు నిర్వహించలేదో అర్థం కావడంలేదన్నారు. దీనికి సీఎం, డిప్యూటీ సీఎం బాధ్యత వహించాలన్నారు. స్వామి క్షేత్రంలో జరుగుతున్న ఈ సంఘటనలపై హైందవ ధర్మ పరిరక్షకులు ప్రశ్నించాలని కోరారు. కాగా, గోవులు మృతి చెందాయంటూ చేసిన ఆరోపణలు అబద్ధమని తేలితే రాజకీయాల నుంచి తప్పుకుంటారా అంటూ భూమనకు టీటీడీ సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి సవాల్ విసిరారు.

గోవుల మృతి వార్తలు అవాస్తవం: టీటీడీ

టీటీడీ గోశాలలో ఆవులు మృతి చెందాయంటూ కొందరు సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం అవాస్తవమని టీటీడీ స్పష్టం చేసింది. 'మృతిచెందిన గోవుల ఫొటోలు టీటీడీ గోశాలకు చెందినవి కావు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా కొద్దిమంది దురుద్దేశంతో చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తున్నాం. ఇలాంటి అవాస్తవాలను నమ్మవద్దని కోరుతున్నాం' అంటూ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో టీటీడీ వివరణ ఇచ్చింది.

గోమాతతో రాజకీయాలా?

'గోవును లక్ష్మీదేవి స్వరూపంగా భావిస్తాం. అలాంటి ఆవును కూడా వైసీపీ నేతలు రాజకీయాలకు వాడుతున్నారు. టీటీడీ గోశాలలో 3 నెలల్లో 100 ఆవులు చనిపోయాయంటూ భూమన అసత్య ప్రచారం చేస్తున్నారు' అని బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీటీడీ గోశాలలో 2,668 గోవులు ఉన్నాయని, వాటిని ప్రతిరోజూ అధికారులు పర్యవేక్షిస్తుంటారని చెప్పారు. గత 3 నెలల్లో ఒక్కటి మాత్రమే అనారోగ్యంతో మృతి చెందిందన్నారు.

వైసీపీ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: లోకేశ్

టీటీడీ గోశాలలో ఆవులు చనిపోయాయంటూ జరుగుతున్న అసత్య ప్రచారాన్ని మంత్రి లోకేశ్ ఖండించారు. రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీ ఇలాంటి ప్రచారాలు చేయడం దుర్మార్గమని, దీన్ని భక్తులు ఎవ్వరూ నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఏపీకి ఐఏఎస్ అధికారిణి ఆర్.వైశాలి

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గుజరాత్ కేడర్‌కు చెందిన 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి ఆర్.వైశాలిని డీవోపీటీ ఏపీకి కేటాయించింది. ఈ మేరకు అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. మ్యారేజ్ గ్రౌండ్స్ కింద ఆమెను గుజరాత్ కేడర్ నుంచి ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించారు. ఆమె భర్త పవన్ స్వప్నిల్ జగన్నాథ్ కూడా ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారిగా ఉన్నారు. ప్రస్తుతం పవన్ స్వప్నిల్ జగన్నాథ్ గుంటూరు జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.